VISALAANDHRA VIJAYAWADA PHONE No 376

70 1004

'విశాలాంధ్ర' పత్రిక
చందా వివరాలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	28 00	30 00
ఆరు మాసాలు	14 00	15 00
మూడు మాసాలు ...	7 00 ...	7 75
ఒక మాసం	2 40 ...	2 60

విశాలాంధ్ర

6 పేజీలు 7 నయాపైసలు రిజిష్టర్డు నెం A. 203

సంపుటి 11] విజయవాడ • 21 డిసెంబరు 1961 గురువారం • [సంచిక 355

కుష్టు సమస్త మహా వ్యాధులకు
బొల్లి మొదటి నెలలో 40% నివారణ!!! 10% నివారణ!!
లెప్సిన్ అమోఘ ఔషధము!!!
వివరములకు గ్రంధే రఘురామ గుప్త
అమర జ్యోతి ప్రొడక్ట్స్. మారాపురం కర్నూలు జిల్లా

వివిధ సంస్కృతుల, సమాజాల సమాఖ్య భారతదేశం

ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో సర్దార్ పణిక్కర్ ప్రసంగం

సాంప్రదాయక జీవితంతో భారతజాతి తెగతెంపులు చేసుకోవాలని ఉద్బోధ

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, డిసెంబరు 20

భారతదేశం వివిధ సంస్కృతుల, సమాజాల సమాఖ్య అని ఆరోగ్యకరమైన ప్రాంతీయతలపైన ఆధారపడే జాతీయైక్యత ఏర్పడగలదని సర్దార్ పణిక్కర్ ఉస్మానియా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ అన్నారు తరతరాల సాంప్రదాయాలకు కట్టుబడిన భారతదేశం పాతజీవితంతో తెగతెంపులు చేసుకోవాలని కూడా ఉద్బోధించారు

శ్రీ పణిక్కర్ ఇలా అన్నారు

"విభిన్న సంస్కృతులతో విలసిల్లే ఇంత పెద్ద దేశంలో ప్రాంతీయతత్వం వాంఛనీయమే, నిజానికది అవసరం కూడ నిక్కచ్చిమాటంగా చెప్పాలంటే దేశప్రాంతీయతలో వ్యక్తం వున్న వాటిని ఇంత పెద్ద జనాభా, ఇంత చారిత్రక సాంప్రదాయాన్ని, ఇంత పెద్ద దేశంలో ఆరోగ్యకరమైన ప్రాంతీయతే పునాదిగా నిజమైన జాతీయైక్యతను నిర్మించవచ్చు మరీ ప్రత్యేకంగా ప్రాంతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చే ప్రజాస్వామ్యాలలో ఇది ఇంకావాస్తవం నియంతృత్వంలో ఇది సాధ్యంకాదు

"అయితే జాతీయ ప్రయోజనాలు ముందుండాలి అన్నింటికంటె దేశ ఐక్యత, రక్షణలకు పెంపొందించే ప్రాధాన్యత [illegible] కాని ప్రాంతాల ప్రయోజనాలుకూడా దేశ అవసరాలే చిన్న రాజ్యాలలో కూడ జాతీయైక్యతా స్థాపన ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చినపుడే సాధ్యమవుతుంది

"ఈ సందర్భంలోనే మన రాజకీయ నేతలకు దయ్యంలా పట్టుకున్న భాషాతత్వం గురించి కొంతచెబుతాను ఈ జాతీయ భావాలలో నమ్మకమున్న వాడినని విడియపడకుండా చెబుతున్నాను తన మాతృభాషను అభివృద్ధి చేసుకోవాలని కోరడం విద్యనేర్చిన ప్రతివాని విధి. ఏ ప్రభుత్వానికి ఎంత అధికారమున్నా, ఎక్కడా మాతృభాషాభిమానాన్ని చంపలేక పోయింది 600 సంవత్సరాలపాటు మరుగుపడిన తర్వాత వెల్ష్ భాష (బ్రిటన్‌లో వేల్స్ అనే రాష్ట్రభాష) తిరిగి ఇప్పుడు పుంజుకుంటూంది; ఇందువల్ల బ్రిటన్ ఐక్యతకేమీ భంగం రాలేదు అనేక శతాబ్దాల తర్వాత ఇంగ్లండులో తిరిగి గాలిక్ భాష అధికారభాష అయింది

మన రాజకీయ నేతలు దేనిని భాషావాదం అని నిరసిస్తున్నారో ప్రపంచంలో ప్రతిచోటా అదే ప్రోత్సాహం పొందుతూంది భారత దేశానికి వెలుపల ఎవరూ స్థానికభాష పెరిగితే తమ దేశ ఐక్యతకు భంగమని భావించిన వారులేరు మనదేశంలో స్థానికభాషల అభివృద్ధిపై సాగేదాడి ఏకజాతి రాజ్యం అనబడే పాతసిద్ధాంతపు వాసనే

"భారతదేశాన్ని ఏకజాతిరాజ్యంగా చూసే అలవాటు 19 వ శతాబ్దపు రాజకీయ ధోరణి మనలను ఇంకా వదలనందువల్లనే యూరప్‌లో వివిధ రాజ్యాలెంత పెద్దవో, అంత పెద్దవైన రాష్ట్రాలతో కూడిన సమాఖ్య మాత్రమే భారతదేశం భారత రాజ్యాంగ రచయితలు దేశాన్ని ఏకజాతి రాజ్యంగా రూపొందించితే అది దేశాన్ని అతి త్వరగా నాశనం చేసే మాత్రమవుతుందని గుర్తించినందువల్లనే దీనిని సమాఖ్యగా పేర్కొన్నారు ఒక్క భారతదేశ చరిత్ర మాత్రమేగాక ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా కూడ భారతదేశం వంటి పెద్దదేశంలో ప్రజాతంత్ర వ్యవస్థ సమాఖ్య రూపంగానే వుంటుంది

అలాంటి సమాఖ్య స్వరూపమైన రాజ్యాంగంలో ఐక్యతాభావం, సాంప్రదాయ సాన్నిహిత్యం కలిగే విధంగా వివిధ భాగాలను ఏర్పాటు కావాలన్నదే సమాఖ్య భావం

"సమాఖ్యఅంటే అర్థం వివిధభాగాలకు, వాటి సంస్కృతి, భాష, సాంప్రదాయాలకు ప్రాధాన్యమివ్వడమే అయితే అందువల్ల జాతీయైక్యత బలహీనపడదు, కొందరు ఒక ఫ్యాషన్‌గా పిలుస్తూ విచ్ఛిన్నతకు దారి తీయదు. అసలు యీ విచ్ఛిన్నకర ధోరణులు ఏమిటో, ఎక్కడున్నాయో నేను కనుగొనలేకపోయాను

ఉమ్మడి భాష

"దేశానికొక ఉమ్మడిభాష వుండాలి నేను ప్రాంతీయ భాషావాదినే అయినప్పటికి భారతీయ ఐక్యతకు జాతీయైక్యతకు హిందీ ఉమ్మడి భాష కావాలంటాను గత తరానికి చెందిన నాయకులు కొందరు ఇంగ్లీషే ఉమ్మడి భాష కావాలనికోరడం వారికి ప్రజాస్వామ్య వాస్తవాలు బోధపడక పోవడం వల్లనే మేధావంతులకు, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల అధ్యయనానికి ఇంగ్లీషు అవసరమే దానికి మన ప్రధాన భాషలకు ఎక్కడా పొంతనలేదు, దానిని నేర్చుకొనడానికి అనేక సంవత్సరాలు పడుతుంది కాబట్టి మన పరిస్థితులలో హిందీయే ఉమ్మడి భాషా కావాలి

"ఇక జాతీయసమైక్యతా భావం, నేడు భారత దేశానికి ఒకే సమాజం, ఒకే సంస్కృతి కావాలని కోరేవారు లేదు ఒకే పార్టీ, ఒకే అభిప్రాయం వుండాలంటారు జాతీయ సమైక్యత భావంలో కొట్టుకుపోతూ భారతదేశం వివిధ రాష్ట్రాల సమాఖ్యయేగాక వివిధ సంస్కృతుల,ఆసంస్కృతులపై ఆధారపడనివి విధసామాజికవర్గాలసమాఖ్యఅని మనం మరచిపోరాదు నిజమైనజాతీయ సమైక్యతఅంటే అర్థంబలమైనమెజారిటీ సంస్కృతికి ఇతరసంస్కృతులు లొంగిపోవడంకాదు ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ భారతదేశంలో ప్రతిఒక్క సాంస్కృతిక విభాగం రక్షణకు, ప్రోత్సాహానికి నోచుకున్నదని గుర్తించడమే ఐక్యతకు మార్గం

"కాబట్టి వచ్చేతరంవారిబాధ్యతఏమిటంటేవివిధసంస్కృతులపైఆధారపడిన ఏకజాతీయతను సృష్టించడమేగాని పాతవాసనలకోసం తహతహలాడడం కాదు పాతకోసమని ప్రస్తుతాన్ని తక్కువగా చూడడమంటే నిరుత్సాహపరిచేది ఇంకేదీలేదు అందరం మంచి భవిష్యత్తుకోసం పనిచేయడానికి గర్వించాలి

"నా దృష్టిలో మానసిక అసంతృప్తి, ప్రస్తుత పరిస్థితులపై తిరుగుబాటు, నిరంతరం ముందుకు పోవాలనే ఆకాంక్షల ద్వారానే సమాజం అభివృద్ధి పొందుతోంది మానసికంగా సంతృప్తి చెందడమంటే చాలా దుఃఖకరమైన సోమరితనమన్నమాట ఇది జాతిపతనమవుతుందనడానికి [illegible] ఖచ్చితమైన చిహ్నం."

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు

"ఒక వ్యక్తి రాజకీయాలలో పాల్గొనడం ఎంత ముఖ్యమో, ఇంకొక వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అంతే ముఖ్యం ఈ ప్రజాతంత్ర పద్ధతినే మనం ఎంచుకొన్నాం ఈ రెంటిలో దేనినుండీ

(మిగతా 3 వ పేజీ 6 వ కాలంలో)

జోసెఫ్ స్టాలిన్, జన్మదినం 1879, డిసెంబరు 21

మార్క్సిస్టు లెనినిస్టు మహా విజ్ఞాని లెనిన్ మరణానంతరం ముప్పదేండ్లు సోవియట్ యూనియన్ దిగ్విజయ యాత్రకూ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికీ నాయకత్వం వహించిన మహానేత

'అసంపూర్ణమైన భారత విప్లవం నేడు పూర్తి అయింది'

గోవా విముక్తిపై బొంబాయి సభలో శ్రీ కృష్ణమీనన్ ఉద్ఘాటన

బొంబాయి, డిసెంబరు 19

గోవాలో సైనికచర్య ప్రారంభమైన తరువాత మొట్టమొదటి సారిగా బహిరంగసభలో నేటిసాయంత్రంయిక్కడ రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ ప్రసంగిస్తూ పరిష్కారం కోసం సంప్రతింపులకు పోర్చుగీస్‌వారు నిరాకరించినందువల్లే భారతదేశం గోవాలో సైనిక చర్యను తీసుకొనవలసి వచ్చిందని తెలిపారు

శాంతియుతంగా పరిష్కారం చేసుకొమ్మని వాదించివాదించి చివరికి విసిగి వేసారిన తరువాతనే భారతదేశం ఈ విధంగా మిలిటరీచర్యలను తీసికొనవలసి వచ్చిందని వివరంగా శ్రీ కృష్ణమీనన్ తన ప్రసంగంలో తెలియజేశారు

సభకు హాజరైన వేలాది ప్రజలు శ్రీ మీనన్ ప్రసంగానికి మాటిమాటికీ హర్షధ్వానాలు చేశారు

గోవాలో భారతీయ జాతీయ పతాకాన్ని ప్రతిష్ఠాపన చేయడంలో యింతవరకూ పూర్తికాకుండా మిగిలివున్న భారత విప్లవం పూర్తి అయిందని ఆయన అనగానే సభికులనుండి హర్షధ్వానాలు మిన్నుముట్టాయి

ఈ విప్లవం బయటనుండి "ఎగుమతి" చేయబడినదికాదని ఆయన స్పష్టంచేశారు పోర్చుగీస్ వలసపాలన పతనంపై అక్కడి భారతీయులకు రక్షణ లేని పరిస్థితుల్లో భారతీయ సైన్యం ప్రవేశించవలసి వచ్చిందన్నారు

చాలసంవత్సరాలక్రిందట మహాత్మా గాంధీ ప్రారంభించిన స్వాతంత్ర్య ఉద్యమం నేటితో ముగిసిందన్నారు

సులభ సంస్కృతంలో పాఠ్య గ్రంథాలు వ్రాసేవారికి [illegible] బహుమానం ఇస్తామని సంస్కృత విద్యా పరిషత్ వారు ప్రకటించారు.

వలసవాదుల భౌభౌలు



రాష్ట్రపతి తిరిగి పదవీస్వీకారం

ప్రజలందరికీ కృతజ్ఞతాభినందనలు

న్యూఢిల్లీ, డిసెంబరు 19

రేపు తన అధికారపదవిని స్వీకరించబోతున్న రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అస్వస్థతగా వున్న కాలములో తనపట్ల ఆదరాభిమానాలను చూపిన వారందరికీ నేడు కృతజ్ఞతను తెలియజేశారు

ఈ సందర్భంలో ఆయన ఒక పత్రికా ప్రకటన చేస్తూ అయిదు నెలల అనంతరం తిరిగి తాను అధికార బాధ్యతలను స్వీకరించుచున్న విషయాన్ని ప్రస్తావించారు తాను జబ్బుగా వున్నప్పుడు త్వరగా స్వస్థత చేకూరాలని కాంక్షించుచుతూ టెలిగ్రాములను, లేఖలను పంపినవారికీ, ప్రార్థనలు జరిపిన మత నాయకులకూ అందరికీ తన కృతజ్ఞతాభినందనలను తెలియజేశారు

అయిదు నెలలు గడిచినప్పటికి తనకు పూర్తి బలం యింకా చేకూరలేదనీ, అందువలన అధికార నిర్వాహణలో వచ్చే లోపాలను తన సహచరులు అభిమానంతో సర్దుకోగలరనే ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు.

బిల్లుకలెక్టరుకు శిక్ష

మున్సిపాలిటీ ద్రవ్యం దుర్వినియోగ పర్చినందుకు

విజయవాడ, డిసెంబరు 20

విజయవాడ మునిసిపాలిటీ బిల్లుకలెక్టరు శ్రీ యస్ తిరువెంకటయ్యను, మునిసిపాలిటీ సొమ్మును దుర్వినియోగ పరచినందుకు, మున్సిఫ్ మేజిస్ట్రేటు శ్రీ జయశంకరంగారు నిన్న 409 వ సెక్షనుక్రింద ఆరుమాసాలు కఠినశిక్ష విధించారు

శ్రీ తిరువెంకటయ్య, నాలుగువేల రూపాయలు మున్సిపాలిటీ బిల్లులు వసూలుచేసి, స్వంతానికి వాడుకొన్నాడని మునిసిపల్ అధికారులు పెట్టిన కేసుపై మేజిస్ట్రేటు ఈ తీర్పుచెప్పారు

ముద్దాయి తరఫున శ్రీ రామన్న పంతులు, ప్రాసిక్యూషన్ తరఫున శ్రీ ఉమామహేశ్వరరావుగార్లు వాదించారు (వి వి)

కమ్యూనిస్టు పార్టీకి బెంగాల్లో మెజారిటీ సీట్లు వచ్చేఅవకాశం

— శ్రీ అజయ ఘోష్ ఆశాభావం

బెల్గాం, డిసెంబరు 19

వచ్చే జనరల్ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో మెజారిటీ సీట్లను తమ పార్టీ సంపాదించగలదనే విశ్వాసం గలదనీ, అందువల్లనే ఆ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వానికి తాము పిలుపు నిచ్చామని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ అజయ ఘోష్ నేడిక్కడ అన్నారు

శ్రీ అజయఘోష్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీకి గల అవకాశాలను గురించి చెప్పారు

ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టుపార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఎన్నికోబడగలదనే ఆశాభావంగలదని ఆయన అన్నారు

ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ ఇతర పార్టీలతో కలిసి పోటీచేసే అవకాశం గలదా అని ప్రశ్నించగా అభ్యుదయకాముకులైన స్వతంత్రులతో కలిసి పోటీ చేయడానికి సిద్ధంగా వున్నదని శ్రీ అజయఘోష్ అన్నారు "అభ్యుదయ కాముకులు" అంటే అర్థమేమిటని ఒకరు ప్రశ్నించగా శ్రీ అజయఘోష్ మద్రాసు రాష్ట్రంలో ద్రవిడ మున్నేట్ర కళగాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు కొన్ని సమస్యలపై తమిళనాడ్‌లో కమ్యూనిస్టుపార్టీ ద్రవిడ మున్నేట్రకళగంలు ఒక ఒప్పందానికి రాగలిగాయని, అందువలన ఎన్నికల ఒడంబడిక చేసుకున్నామని తెలిపారు

ఆతరువాత విలేకరులు సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ఇరవై రెండో మహాసభ నిర్ణయాలను గురించి ప్రశ్నించగా ఆమహాసభ నిర్ణయాలకు భారతకమ్యూనిస్టు పార్టీ హర్షించుతోందన్నారు ఐతే,అల్బేనియా పార్టీతో గల విభేదాలు, సోషలిస్టు సిద్ధాంత అభివృద్ధిలో స్టాలిన్ పాత్ర మొదలుగాగల సమస్యలపై జనరల్ ఎన్నికల అనంతరం జరిగే భారత కమ్యూనిస్టుపార్టీ జాతీయసమితి చర్చించి అభిప్రాయం తెలియచ్చగలదని ఆయన చెప్పారు

ఈ సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీకి ఏకాభిప్రాయం లేదని ఎవరైనా అనుకుంటే అది పూర్తిగా పొరపాటని తాను స్పష్టంచేయదలచానన్నారు.

మనపట్ల అమెరికా ఉక్రోషం

వాషింగ్టన్, డిసెంబరు 19

గోవాపై భారతదేశం సైనిక చర్యకు పూనుకున్నందుకు ఉక్రోషం పట్టలేని అమెరికా విదేశాంగశాఖ అధికారులు గత రాత్రి ఒక విందు సందర్భంలో ప్రదర్శించాల్సిన "అమెరికాలో నెహ్రూ పర్యటన" ఫిల్మును ఉపసంహరించుకున్నారు గోవా పరిస్థితిదృష్ట్యా ఫిల్ము ప్రదర్శన అసమంజసమని ఒక అధికారి [illegible]

మార్మగోవాలో భారత సేనల ప్రవేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 20

నిన్నరాత్రి 11 గంటలకు భారత సేనలు మార్మగోవాలో ప్రవేశించాయని నేటి ఉదయం ఇక్కడ రక్షణశాఖప్రతినిధి ఒకరు తెలియజేశారు ఈ సందర్భంలో 1500 మంది పోర్చుగీస్ సైనికులు అస్త్రసన్యాసంచేసిలొంగిపోయారు

దీనితో భారత ప్రభుత్వం సైనిక చర్యకు పూనుకున్న తరువాత ఇంత వరకు మొత్తం 3,500 మందిపోర్చుగీస్ సైనికులుమనకు ఖైదీలుగాపట్టుబడ్డారు

ఇదిలావుండగా భారతసేనలుపోర్చుగీస్ సైన్యావశేషాలను చుట్టుముట్టేందుకని గోవాలోని ప్రధాన పట్టణాలనుండి గ్రామీణ ప్రాంతాలవైపు సాగిపోతున్నారని ఢిల్లీకి అందినవార్తలు తెలుపుతున్నాయి

గోవాలోని పోర్చుగీస్ సైన్యాధికారి నిన్న ఉదయం పాంజిమ్‌లో భారత సైన్యానికి లొంగిపోయిన విషయం పాఠకులకు విదితమే

మలయాళంలోని పత్రికలన్నీ గోవాపై భారత సైనిక చర్యను బలపరుస్తూ వ్రాశాయి

భారతదేశ చర్య సహేతుకం

చైనాప్రభుత్వ హర్ష ప్రకటన

పెకింగ్, డిసెంబరు 19

గోవాలోని పోర్చుగీస్ సైన్యాలను ఎదుర్కోడానికి తన సేనలను పంపిన భారతదేశ చర్యను గట్టిగా బలపరుస్తూ చైనా ప్రభుత్వం నేడొక ప్రకటన చేసింది "గోవా స్వాధీనానికి భారత ప్రభుత్వం తీసుకున్న చర్య భారత ప్రజాకోర్కెను ప్రతిబింబిస్తోంది ఈ చర్యను చైనా ప్రభుత్వమూ, ప్రజలూ దృఢంగా బలపరుస్తున్నారు" అని చైనా విదేశాంగశాఖ తన ప్రకటనలో పేర్కొన్నది

భారతదేశంలోని పోర్చుగీస్ వలసైన గోవాను విముక్తి చేసుకోవడంలో భారతదేశం తన న్యాయసమ్మతమైన హక్కులకు పరిమితమయ్యే వుందని ఆ ప్రకటన చెప్పింది

గోవాలో సైనికచర్యకు భారతదేశం స్వస్తి చెప్పాలంటూ పశ్చిమరాజ్యాలు తీసుకొచ్చిన ముసాయిదా తీర్మానాన్ని ఐరాస భద్రతా సంఘం త్రోసిపుచ్చడం బహుసబబుగావుందని చైనా ప్రభుత్వం అంగీకారం ప్రకటించింది. అమెరికా - బ్రిటన్ - ఫ్రాన్స్‌లు కలిసి తీర్మానాన్ని ప్రతిపాదించడమూ, అది ఓటమి పొందడమూ వలస ప్రజల ఆత్మరక్షణ చర్యలను ధ్వంసపర్చ తలచాయని చైనా ప్రభుత్వ ప్రకటన స్పష్టీకరించింది

అంగోలాలో బుడతకీచు సైనికులు పైశాచిక చర్యలకు ఒడిగట్టినప్పుడు అందుకు పశ్చిమ రాజ్యాలు నోరుమెదపకపోవడాన్ని ఈప్రకటన గుర్తుచేసింది

ఆప్రకటనలో యింకా యిలావుంది అన్నింటికన్నా అందరూ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే, అమెరికా నాయకత్వాన వున్న సామ్రాజ్యవాద రాజ్యాలు గోవాను తిరిగి మాతృభూమిలో విలీనం చేసుకోవాలన్న భారతప్రజల న్యాయమైన డిమాండును వ్యతిరేకించి అన్యాయంగా అధిక్షేపించడానికి పూనుకోవడమూ, అదే సమయంలో గోవాలోని పోర్చుగీస్ ఆక్రమణను కొనసాగించడాన్ని బలపర్చడమూను

"అంతేగాదు ఈ సామ్రాజ్యవాద రాజ్యాలు వేర్వేరుగా దౌత్య చర్యలకు పూనుకోడానికి మారుగా గోవాను న్యాయంగా తమ భూభాగంలో కలుపుకోడానికి భారత ప్రజలు సాగించే కృషిని అడ్డుకొనేందుకు తీవ్రమైన ప్రయత్నం చేయడంలో భారతదేశంపై ఒత్తిడి తెచ్చేందుకు భద్రతా సంఘాన్ని వినియోగించుకోడానికి [illegible]

"దీన్నిబట్టి,అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాద రాజ్యాల కంట్రోలులో ఐరాస వున్న ఈ సమయంలో ప్రపంచంలోని వివిధ చోట్ల తమ వలస పాలనను పాత, కొత్త వలస వాదులు పరిత్యజించేటట్లు ఐరాస పూనికవహించగలదని ఆశించడం కేవలం భ్రమ మాత్రమేనని" రుజువైంది

గోవాపై భారత సైనికచర్య వార్తలను నేటిరాత్రి నవచైనా వార్తాసంస్థ చైనాలోని ఉదయం పత్రికలకు విడుదల చేసింది

గోవాలో సాధారణ పరిస్థితులు

న్యూఢిల్లీ, డిసెంబరు 20

గోవాలో పరిస్థితులు త్వరత్వరగా మామూలు స్థితికి చేరుకుంటున్నాయని, ఇకనుండి గోవాలో ఎట్టి ప్రతిఘటన వుండదని నేటి మధ్యాహ్నం భారత రక్షణశాఖ ప్రతినిధి ప్రకటించారు

గోవాలోనికరెన్సీవిషయమై గోవా, డామన్, డయ్యూ సైనిక గవర్నర్ నేడు ఉత్తర్వులు జారీచేశారు పోర్చుగీస్ బ్యాంకును, దాని శాఖలను మూసివేశారు వీటి లావాదేవీలను భారత రిజర్వు బ్యాంకు పరిశీలనకు వదిలారు

గోవాలోని పోర్చుగీస్ గవర్నర్ జనరల్ జాడ తెలియరావడం లేదని రక్షణశాఖ ప్రతినిధి తెలిపారు

గోవాలోని పాడుపడ్డ ప్రజాపకర సంస్థలు, సమాచార కేంద్రాలను బాగుచేయడానికై ఆలిండియా రేడియో తంతి తపాలాశాఖ, తదితర శాఖల సిబ్బందిని పంపడానికి ఏర్పాట్లు పూర్తయినాయని ఆ ప్రతినిధి చెప్పారు

గోవాలో భారత కరెన్సీ, పోర్చుగీసు-భారత 'ఎస్కూడోస్' నాణాలు చట్టసమ్మతమైనవిగాను, అధికారమారకంరేటు ఆరు ఎస్కూడోలు ఒక రూపాయికి సమానమనీ గోవా సైనిక గవర్నర్ ప్రకటించారు భారతదేశం నుండివచ్చే భారత కరెన్సీని యథేచ్ఛగా ఇక్కడ వాడవచ్చు

గోవాలోని బ్రిటిష్ వారంతా క్షేమంగానే వున్నారని భారత సైనికాధికారుల ద్వారా ఒక బ్రిటిషు పౌరుడు బ్లాక్ ఫోర్ట్ ఒక సందేశం పంపారు

డాక్టర్ డిసౌజా విడుదల

పాంజిమ్, డిసెంబరు 19

డాక్టర్ లారా డిసౌజాతోసహా అనేకమంది గోవా నాయకులు నేడు విడుదల అయ్యారు

ఇటలీలో భారత పతాక దహనం

నియోఫాసిస్టుల దుశ్చర్య

రోమ్, డిసెంబరు 19

నియోఫాసిస్టు యువకులు కొందరు నేడిక్కడ భారత రాయబార కార్యాలయంపై రాళ్ళు, ఖాళీ బ్రాందీసీసాలు విసిరారు గోవాపై భారత సైనికచర్య వీరి ఆగ్రహానికి కారణమట

భారత పతాకమునుకూడా వీరు తగలబెట్టారు

పోలీసులు రాయబార కార్యాలయానికి కాపలా దళాన్ని ఎక్కువ చేశారు.

ప్లవనామ సంవత్సర
మార్గశిర శుద్ధ పూర్ణిమ వేకువ6 11
మృగశిర వేకువ 6-18

విశాలాంధ్ర

గురువారం 21-12-1961

అసాధారణస్థితి

రాష్ట్ర మంత్రులపై వచ్చిన ఆరోపణల విచారణకు, ఒక నిష్పాక్షిక ఉన్నతాధికారసంఘాన్ని ఏర్పరచాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వొకేటులు 128మంది రాష్ట్రపతికి ఒక నివేదిక సమర్పించటం, రాష్ట్రంలో నేడేర్పడిన అసాధారణస్థితికి తార్కాణం

“అధికారం అవినీతికిమూలం సంపూర్ణ అధికారం సంపూర్ణంగా అవినీతిని కలిగిస్తుంది” అన్న వాక్యం ఆంధ్రకాంగ్రెసుమంత్రుల పట్ల అక్షరాలా నిజం కనుకనే ప్రతిపక్షాలవారు మాత్రమే కాక, అన్ని వర్గాలవారూ, ఏ రాజకీయ పార్టీకి చెందనివారూ – ఈ అధికార దుర్వినియోగాన్ని గర్హిస్తున్నారు దీన్ని అరికట్టాలని కోరుతున్నారు

ప్రభుత్వ యంత్రాంగం, అధికార పార్టీవారి ఒత్తిడికి లోనుగాకుండా, స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించగలస్థితి ఉండటంప్రజాస్వామ్య వ్యవస్థకు మూలం కాని ఈ స్థితి కాంగ్రెసు మంత్రులపరిపాలనలో నశించింది. అడుగడుగునా అధికారులు పంచాయతీ స్థాయినుండి రాష్ట్ర స్థాయివరకు కాంగ్రెసుపార్టీ నాయకుల ఒత్తిడికి, మంత్రుల అధికార దుర్వినియోగానికి గురౌతున్నారు

అసంఖ్యాకంగా వస్తున్న ఈ ఆరోపణలలో ఏ ఒక్కదానికి మంత్రులు సమాధానాలు ఇవ్వలేకపోతున్నారు: నిజాన్ని ఎలా కప్పిపుచ్చగలరు?

అనంతపురం బస్సు యజమానులపై విధించినసర్ఛార్జీనితగ్గించి, వారిలో ఒక్కొక్కరివద్దనుండి 700 రూ॥ల చొప్పున కాంగ్రెసు పార్టీకి ఆర్ టి సి అధికారి విరాళాలు వసూలు చేసిన ఉదంతం శాసనమండలివేదికపైనప్రస్తావించబడ్డది

ప్రభుత్వ జీపులు వేలంపాటలో కాంగ్రెసు అభ్యర్థులకు అమ్మిన ఉదంతం, ప్రభుత్వ పమీద వెళ్ళే పార్టీ కార్యకలాపాలు కూడా మంత్రులు చూసుకోవటం మొదలైన ఉదంతాలు ఎన్నో వెల్లడైనాయి వాస్తవమైన ఈ ఘటనలను కాదనలేక, ఔనని అంగీకరించలేక, శాసన మండలిలో మంత్రులు ‘శేషం కోపేన పూరయేత్’ అన్నట్లు ఏవో నిందారోపణలతో సమాధానాలిచ్చి తప్పుకున్నారు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వొకేట్లు వెలిబుచ్చిన కోర్కెనే మధ్యప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ పి యస్ రావుగారు కూడా హైద్రాబాద్‌లో ఒకసభలో వెలిబుచ్చారు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనేగాక మొత్తం భారతదేశంలోనే గత పదేండ్లలో పరిపాలనా స్థాయి- సామర్థ్యం బాగా పతనమయ్యాయని, రాజకీయమైన ఒత్తిడికి అధికారులు గురికావటమే యిందుకు మూలకారణమని ఆయన తెలియజేశారు ఈ కారణాలను, వీటికి నివారణోపాయాలను పరిశీలించేందుకు ప్రభుత్వం ఉన్నతాధికార విచారణ సంఘాన్ని నియమించాలని, బలమైన ప్రజాభిప్రాయ మొక్కటే ఈ అవినీతిని నిర్మూలనకు తోడ్పడగలదని ఆయన సూచించారు

కాంగ్రెసు పరిపాలన ఫలితంగా దేశం మొత్తంమీదా, ఆంధ్రలో ప్రత్యేకంగానూ ఏర్పడిన ఒక అసాధారణ స్థితిని ఈ ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి

చిన్న అధికారినుండి పెద్ద అధికారివరకు ఏ ఒక్కరూ, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్ణయాలు చేయటానికి అనువైన వాతావరణంనేడులేదు ఉద్యోగుల నియామకం మొదలుకొని కళాశాలల్లో సీట్లను సంపాదించేవరకు, అధికార పార్టీకిచెందిన వారి సిఫారసులో, లేక ఇతర విధాలైన అవాంఛనీయ చర్యలో జరిపితే కాని ప్రయోజనంలేని స్థితి ఏర్పడుతున్నది ఎన్నికల సమయంలో అపద మొక్కులుగా కొత్తనిర్మాణ కార్యక్రమాలకు ప్రారంభం చేయటం, తమతమ నియోజక వర్గాలలో కాంగ్రెసు మంత్రులు డబ్బు మంజూరు చేసుకోవటం సర్వసాధారణమైంది

అన్నిపదవులనూ తమ బంధువులతోనూ, ఆశ్రితులతోనూ నింపుకునే ధోరణి ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు ఒక్క ఉదాహరణచాలు

ప్రణాళికా మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డిగారి నియోజక వర్గంలో ఆయన తమ్ముడు, అల్లుడు రెండు పంచాయతీ సమితులకు అధ్యక్షులు ఆయన బావమరది గిద్దలూరు పంచాయతీకి అధ్యక్షులు అవిగాక రూరల్ బ్యాంకు అధ్యక్ష పదవి పొగాకు ఉత్పత్తిదార్ల సహకార సంఘ అధ్యక్ష పదవి, హైస్కూలు కరస్పాండెంటు పదవి వంటివి ఎన్నో మంత్రి శ్రీ రంగారెడ్డిగారు నిర్వహిస్తున్నారు

ఒక వ్యక్తి చేతిలో, ఒక్క కుటుంబం చేతిలో అంతటి అధికారం కేంద్రీకరించబడి ఉండగా అక పంచాయతీ సమితులద్వారా అధికార వికేంద్రీకరణ అమలు జరిపామని కాంగ్రెసు మంత్రులు చేసే ప్రసంగాలకు విలువేమిటి?

బహుశా కాంగ్రెసుమంత్రులు పార్టీనాయకులు ప్రతిఒక్కరూ తలాకాస్త అధికారాన్ని చేజిక్కించుకోవటమే వారిదృష్టిలోఅధికార వికేంద్రీకరణ కాబోలు !

ఆంధ్రలో నేడొక అసాధారణ స్థితి ఏర్పడ్డది

ప్రస్తుత మంత్రివర్గం ఇలాగే కొనసాగితే రానున్న సాధారణ ఎన్నికలలోస్వేచ్ఛగా ప్రజలు వోటు చేయగలరన్న హామీలేదు కనుకనే ఈ మూడునెలలకాలంలోనూ ఆంధ్ర మంత్రివర్గం రాజీనామాయిచ్చి, ఒక తాత్కాలిక మంత్రివర్గం పరిమితాధికారాలతో ఏర్పడాలని శాసనమండలిలో ప్రతిపక్ష ఉపనాయకులు ఒక ప్రతిపాదన చేశారు

అదొక ‘అసాధారణ ప్రతిపాదన’గా మంత్రులు అనాడు చిత్రించారు కాని రాష్ట్రంలో అధికార దుర్వినియోగంవలన,అవినీతివలన అసాధారణ స్థితి ఏర్పడినపుడు, ‘అసాధారణ పరిష్కారాలు’ అవసరమౌతాయి

అన్ని రాష్ట్రాలలోను అధికారం చేజిక్కించుకుని పదేండ్లపాటు కాంగ్రెసు పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యం సాగించిన ఫలితంగా ఈ దుష్ఫలితాలన్నీ ఏర్పడుతున్నాయి

ఈ స్థితిని తొలగించాలంటే కాంగ్రెసు గుత్తాధికారాన్ని బలహీనపరచి, ప్రజాతంత్ర ప్రతిపక్షాలవారిని హెచ్చు సంఖ్యలో రానున్న ఎన్నికల్లో ప్రజలు గెలిపించవలసి ఉంది అదొక్కటే ఈ జబ్బుకు పరిష్కారం

“డాక్టరు” డిగ్రీని చౌకపరుస్తున్న రీతి

నేటి యూనివర్శిటీల ధోరణికి ప్రధాని నెహ్రూ నిరసన

న్యూఢిల్లీ, డిసెంబరు 19

భారతదేశంలోని యూనివర్శిటీలు ప్రతివారికీ చౌకరీతిలో గౌరవడిగ్రీలు, డాక్టరేట్ బిరుదులు యిచ్చేపద్ధతిని నేడిక్కడ ప్రధానినెహ్రూనిరసించారు

భారత విజ్ఞానశాస్త్ర అకాడమీ వారుతనకు గౌరవ డాక్టరేట్ బిరుదును ప్రదానం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన యింకా ఇలా అన్నారు

ఇటీవల మన యూనివర్శిటీలు డబ్బు కోసమూ, ఇతర కారణాలకోసమూ గౌరవ డాక్టరేట్ బిరుదుల నిచ్చి వాటిని మలినం చేస్తున్నాయి ఒక సందర్భంలో ఒకాయనకు, ఆయనకు విద్యారీత్యా ఎలాంటి యోగ్యతా లేనప్పటికీ యూనివర్శిటీకి భూరి విరాళం యిచ్చినందుకు డాక్టరేట్ బిరుదు నిచ్చారు

“డాక్టరు” అన్న బిరుదు ఉపయోగాన్ని పరిమితం చేస్తూ ఒక చట్టం వుండటంకూడా మంచిదేమోనని శ్రీ నెహ్రూ సూచించారు ఎందుకల్లనంటే చాలమంది తాము డాక్టర్లమని చెప్పుకొంటున్నారన్నారు

కేంద్ర బొంబాయిలో రెండు కక్షాలమధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు పోలీసులతో సహా 8 మంది వ్యక్తులు గాయపడ్డారు.



అంగోలా, మకావో ప్రజలకు భారత ప్రజల ఊతం

భారతదేశ స్వాతంత్ర్యానంతరం దశాబ్దం పైగా గోవా ఇంటాబయటా జాతీయశక్తులు ఎంతగానో ఒత్తిడి తేవడంతో ఎంతమంది భరతమాత పుత్రులు నేలకొరిగిన తరవాత భారత ప్రభుత్వం ఆఖరకు కదలి భారత భూభాగంపైకడసారి వలసాశేషమైన పోర్చుగీస్ పాలననుండి గోవా ప్రజలను విముక్తి చేసింది ఈ పని అలస్యంగా జరిగినా దిగ్విజయం సాధించాం.

ఒక వలస రాజ్యపాలనకు ఆధారాన్నికి సంబంధించిన వలసలన్నింటిలోనూ ఒకే సారి ప్రతిఘటన తేవడం ఆ రాజ్యాన్ని బలహీన పర్చటానికి దోహదంచేస్తుంది నేడు భారతీయులు విశేషించి గోవన్లు సాధించిన ఘనవిజయం ఇదే సమయంలో పోర్చుగీస్ నిష్ఠుర పాలనకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం నడుపుతున్న అంగోలా, మొజాంబిక్, మకావో, కేప్ లకర్డ్ వలస ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని, ఊపునూ ఇస్తుంది మననూ బుడతకీచుల పీచమణచగల మన్న ధైర్యస్థైర్యాలను వాళ్ళలో ఉద్దీపింప చేస్తుంది. వలస శక్తులపై బహుముఖ పోరాటాలెప్పుడూ సంపూర్ణ విజయానికే ఎక్కువ అవకాశాల్ని కల్పిస్తాయి.

ప్రపంచానికి దాగుడుమూత వ్యవహారంగావున్న పోర్చుగీసు వలసలైన అంగోలా, మొజాంబిక్ మకావోలలోని రాజకీయ పరిస్థితిని పరిశీలించడం ఈ సందర్భంలో ఎంతైనా అవసరం

అంగోలా, పశ్చిమాఫ్రికాలోని ఒక పెద్ద దేశం మొజాంబిక్ తూర్పు ఆఫ్రికాలోని దేశం వీటి మొత్తం వైశాల్యం 7,79,081 చదరపుమైళ్ళు మొత్తం జనాభా 1 కోటిమంది పైచిలుకు వుంటారు వీరిలో అంగోలా జనాభా 48 లక్షలు మొజాంబిక్ జనాభా 60 లక్షలు

అంగోలా పరిస్థితిని ఒక శాస్త్రవేత్త ఇలా వర్ణించాడు

“జనాభారీత్యాచూస్తే అంగోలాకు పాండురోగం పట్టుకుంది” అంటే దాని జనాభా నానాటికీ క్షీణించిపోతోందన్నమాట జీవన పరిస్థితులు భరించరానివి గావడంవల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది అంగోలాలోని ఆఫ్రికన్లు బానిసలుగా పరిగణింపబడుతున్నారు వెట్టిచాకిరీ సర్వసామాన్యం ఈనాడు అంగోలాలో 4 లక్షల మందిచేత యూరోపియన్ తోటల యజమానులకు, పారిశ్రామికులకు బలవంతాన ఊడిగం చేయిస్తున్నారు ఆఫ్రికన్లకు కొరడాదెబ్బలు, కష్టాలలో కష్టాల శిక్ష నిర్బంధ వెట్టిచాకిరీ మగవాళ్ళకే గాదు పిల్లలకూ, స్త్రీలకూకూడా విధించారు ఈ ఘోరపరిస్థితిని అమెరికన్ పత్రిక “గజెట్ అండ్ డైలీ” యిలా వర్ణించింది

“పిల్లల్ని వీపులమీద మోసుకుని పనిచేసే తల్లులూ, పురాతన మోటుపని ముట్లతో, మట్టితట్టలు మోసుకుంటూ రోడ్లపనిచేసే గర్భిణీ స్త్రీలనూ, చిన్నపిల్లలనూ మనం అడుగడుగునా చూడవచ్చు ”

ఈనాడు అంగోలా జనాభాలో రెండు లక్షలమంది పోర్చుగీస్ వాళ్లు తిష్టవేసివున్నారు వాళ్ళందరికీ ఆయుధాలున్నాయి జాతీయ వాదులనుండి తప్పించుకోడానికి ఆఫ్రికన్లను బెదరించడానికి వారికి ఆయుధాలు సప్లయి చేయబడ్డాయి అంగోలా తనదే నన్న దృష్టి నిరూపణకోసం యత్నిస్తున్న బుడతకీచులు పోర్చుగల్ నుండి గ్రామాలకు గ్రామాలనే అంగోలాకు తరలిస్తున్నారు కాగా అంగోలాలోని స్థానిక ప్రజల్ని స్వంత నివాసాలనుండి అడవుల్లోకి బలవంతాన నెట్టివేస్తున్నారు అంగోలాలో పోర్చుగీస్ పాలన ఫాసిజంతోకూడుకున్న వలస పాలన ప్రజలకు అతి సామాన్యమైన ప్రాథమిక రాజకీయ హక్కులు కూడా లేవు ఆఫ్రికన్ అనేవాడెవడికీ ఓటు హక్కు లేకుండా చేశారు.

ఎన్నినిర్బంధాలు విధించినా పోర్చుగీస్ ఫాసిస్టు పాలన అంగోలా జాతీయ విముక్తి ఉద్యమాన్ని అణచలేకపోతోంది. 1956 58 లో అనేక రాజకీయపార్టీలు అంగోలాలో ఏర్పడ్డాయి వీటిలో “అంగోలా జాతీయ విముక్తి ఉద్యమ ‘పార్టీ’, అంగోలా పీపుల్స్ యూనియన్ ప్రధానమైనవి జాతీయ విముక్తి పార్టీ, అంగోలాకు సత్వర సంపూర్ణ స్వాతంత్ర్యం లభించాలని, అంగోలాశ్రామికవర్గాన్ని కంటికిరెప్పలా కాపాడుకోవాలని, ప్రపంచంలోని అభ్యుదయకరశక్తులన్నింటితోమనకవ్యతను పెంపొందించుకోవాలని కోరుతోంది ఇటువంటి కార్యక్రమాన్నే అంగోలా పీపుల్స్ యూనియన్ కూడా చేపట్టింది ఈ పార్టీకి అంగోలా ఉత్తరరాష్ట్రాల్లో ఎక్కువ పలుకుబడివుంది

అనేక త్యాగాలకు ఓర్చి ఆఫ్రికన్లు ఈ సంవత్సరం జనవరి నాటికి అంగోలాలోని ఉత్తర ప్రాంతాలను చాలవరకు విముక్తిచేసుకలిగారు

పోర్చుగీస్‌వాళ్ళు గోవాలో మాదిరిగానే అంగోలాలో భూదహన విధానాన్ని గాకుండా ఇంకా క్రూరమైన చర్యలకు పాల్పడుతున్నారు “ఈవెనింగ్ న్యూస్” అనే పత్రిక విలేకరి అంగోలా రాజధాని లువాండా నుండి ఇలా వ్రాస్తున్నాడు

“పోర్చుగీస్‌వాళ్ళు ప్రజల్ని నానావిధాల భయభ్రాంతుల్ని చేస్తున్నారు పంటలను నాశనం చేస్తున్నారు పశువుల్ని చంపేస్తున్నారు గ్రామాలకు గ్రామాలను తగులబెడుతున్నారు మబింబాలా అనే గ్రామంవుంది ఇక్కడ పోర్చుగీస్ సైనికులు స్త్రీలనూ, పిల్లలనుకూడా కాల్చి చంపేశారు అలాగే మావోయా అన్న గ్రామంలో నిద్రమంచాల మీదవుండగానే గ్రామ ప్రజలను ఊచకోత కోశారు ”

మొజాంబిక్

ఇది పోర్చుగీస్‌వారి పరిపాలనక్రిందకు వచ్చి 500 సంవత్సరాలు గడిచాయి ఈ ఐదు శతాబ్దాల కాలంలోనూ పోర్చుగీస్‌వాళ్లు ఈ దేశాలకు ఒరగబెట్టిందేమిటో బ్రిటిష్‌పత్రిక “వరల్డ్ న్యూస్” ఇలా వెల్లడించింది

“ఆఖరికి పోర్చుగీసు సామ్రాజ్యవాదులు బానిస వ్యాపారం సాగించారు ఇటీవలకాలంలో దానిస్థానే వెట్టిచాకిరీ వచ్చింది కాంట్రాక్టుపద్ధతులువచ్చాయి ఈ పద్ధతులు మంచి లాభాలు తెచ్చిపెడుతున్నాయి వేలకొలది కూలివాళ్ళైన కార్మికులు దక్షిణాఫ్రికా బంగారు గనులకు సప్లయి చేయబడుతున్నారు తల్లులకూ,పిల్లలకూ సంబంధంలేకుండా చేస్తున్నారు కుటుంబాలకు కుటుంబాలు పనిభారం వల్లనైనా చస్తున్నారు లేదా విపరీత నిర్బంధాలవల్లనైనా చస్తున్నారు మొజాంబిక్ జనాభా అంతటికీ కలిపి 149 మంది డాక్టర్లు మాత్రమే. నూటికి 99 మంది నిరక్షరాస్యులు ఇటీవల కాలంలో అమెరికా, బ్రిటిషు, బెల్జియం గుత్తవర్గాలు పోర్చుగల్ ఆర్థిక బలహీనతల్ని వినియోగించుకొని అంగోలా, మొజాంబిక్‌లలో ప్రవేశించాయి. మైనింగ్ పరిశ్రమను ఆక్రమించుకున్నారు అపారమైన ఖనిజసంపద చేజిక్కించుకున్నారు

మకావో (అవోమిన్)

ఇది చైనాతీరంలో వున్న మరొక పోర్చుగీసు వలస దీనిని చైనావారు “అవోమిన్” అని పిలుస్తారు

మకావో ఒక ద్వీపకల్పం ఇది సుమారు నాలుగుమైళ్ళ పొడవు, సుమారు 8 మైళ్ళ వెడల్పు వుంటుంది దక్షిణ చైనా సముద్ర కోస్తాపైనవుంది పర్వత ప్రాంతం తుఫాను లెక్కువ వస్తుంటాయి మకావోలో జనాభాలో అధిక సంఖ్యాకులు చైనావారే వీరితోపాటు 9 వేలమంది పోర్చుగీస్ వాళ్ళు, పోర్చుగీస్ – చైనావారి మధ్య వాత్యంతర వివాహాల ఫలితంగా పుట్టిన “మకావోలు” అనబడే వర్గాలు కొన్ని వున్నాయి మకావో పట్టణం ఆ వలస ప్రభుత్వానికి కేంద్రస్థానంగా పనిచేస్తోంది మకావోలోని పరిశ్రమల్లో ఎక్కువ ఇక్కడ సీకపడిపోయిన చైనా పెట్టుబడిదార్లవే వ్యవసాయం అభివృద్ధికాలేదు మకావో మొత్తం ఆర్థిక వ్యవస్థంతా వర్తకం మీదనే ఆధారపడివుంది అనేక సంవత్సరాలుగా మకావో చైనావారి బియ్యం, సిల్కు, టీ, ప్రత్తి, పొగాకు, చెక్కర ఎగుమతులకు ఇంధనాలు, మందులు, యంత్రాలు, సోడా, ఆయుధాలు వగైరా చైనాకేవులకు, పట్టణాలకు దిగుమతి చేసేందుకు ఒక రవాణా కేంద్ర మార్గంగా ఉన్నందువనే ఇది ఇంతకాలంగా పోర్చుగీస్‌వాళ్ళ వలసగా మన్నుతూ వచ్చింది 19వ శతాబ్దంలో ఆగ్నేయాసియాకు, అమెరికాకుదానికి చైనా కూలీలను ఎగుమతి చేయడం ఒక పెద్ద వ్యాపారంగా వుండేది, హాంకాంగ్ అభివృద్ధి చెందిన తరువాత మకావో ప్రాధాన్యత [illegible] దిగా సన్నగిల్లింది

మకావో ప్రధానమైన నాణాలు హాంకాంగ్ డాలరు, దక్షిణ అమెరికాకు చెందిన “పెసో”. ఈ వలసలో ప్రధాన ద్రవ్యనిధి సంస్థ “పోర్చుగీస్ నేషనల్ ఓవర్‌సీస్ బ్యాంకు”

అసలు చైనాతీరాలకు చేరిన మొదటి యూరోపియన్లు మన భారతదేశానికి వచ్చినట్లే) పోర్చుగీస్‌వాళ్లు 16వ శతాబ్దం మధ్యభాగంలో పోర్చుగీస్ వర్తకులు చైనా తీరంలోని పశ్చిమ (సిచియాంగ్) నది డెల్టాలో స్థిరపడ్డారు 1557 లో మకావో ద్వీపకల్పంలో నివసించడానికి చైనా అధికారులనుండి అనుమతి పొందడంలో పోర్చుగీస్‌వాళ్లు విజయం సాధించారు ఇది కేవలం వ్యాపార నిమిత్తం ఏర్పడ్డ కేంద్రమేననీ, వారు తమ అధీనంలోనే వుండగలరనీ చైనా

వీరగోవా! స్వాగతం!

రచన: సంచారి

ఉప్పెనలా - ఉవ్వెత్తుగ
ఉప్పొంగిన - వీరగోవ !
స్వాగతం ! - సుస్వాగతం !!
తరతరాలు - దాస్యంలో
కుమిలి, కుళ్ళి - కృశించావ్
తల్లి ఒడిలో - చేరగాను
తహతహెంతో - జెందినావు
బుడతకీచు - ముష్కరులు
ఆంగ్లేయులు - అమెరికన్లు
ఆపలేరు - మన ఐక్యం
వృధాపోదు - మీ త్యాగం
శీఘ్రంగా - మీ విముక్తి
సాధించను - మన సైన్యం
జైత్రయాత్ర సాగెనదిగో
సాలజారు - డీ సిల్వా
సాగించిన - హత్యాకాండ
సాగదింక - చెల్లదింక
స్వాతంత్ర్యపు - జయపతాక
మన భువిపై - చిరస్థాయిగ
నిలుస్తుంది - జయిస్తుంది
తొలగిపోయెను చెఱలు
వెడలిపోయెను మరులు
అన్నదమ్ముల మధ్య
అడ్డుగోడలు పోయె
మనముగన్నా కలలు
పండి ఫలియించాయి
భారతావనిలోన
భాగమై నిలిచావు
అందుకో జేజేలు
అందు కొమ్మి విగో

క్రొత్త లోక్‌సభలో తమకు 150 స్థానాలుంటాయట

స్వతంత్రపార్టీ అధ్యక్షుడు శ్రీ రంగా ఆశ

హైదరాబాద్, డిసెంబరు 19

వచ్చే సాధారణ ఎన్నికల తర్వాత ఏర్పడబోయే లోక్‌సభలో తమకు 150 స్థానా లుంటాయని నేడిక్కడ స్వతంత్రపార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్ జి రంగా వక్కాణించారు

ఈ ఎన్నికల పోరాటంలో కాంగ్రెసుకు డబ్బు ముమ్మరంగా దొరుకుతూంటే, తమ పార్టీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నదన్నారు

ప్రఖ్యాత రాజ్యాంగవేత్త శ్రీ చక్రవర్తుల రాజగోపాలాచార్యుల నాయకత్వాన స్వతంత్రపార్టీ దేశానికి కొత్త మార్గాన్ని చూపడంవల్ల కాంగ్రెసు పూర్తిగా ఖంగారు తిన్నదన్నారు

దేశంలో అధిక రాష్ట్రాలలో తమ పార్టీ చాలా బలపడుతున్నదనీ,ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షం కాగలదన్నారు మద్రాసులో కాంగ్రెసును అధికారానికి దూరంగావుంచుతామనీ, మైసూరులో తమ బలంబాగా ఉంటుందని చెప్పారు

బీహారులో తమ పార్టీ అనేక సీట్లకు “చిక్కించుకొని” కాంగ్రెసుకు మెజారిటీలేకుండా చేయాలని ఆశిస్తున్నదన్నారు

ఒరిస్సాలో 14 లోక్‌సభ స్థానాలకు పోటీ పెడతామన్నారు

మధ్యప్రదేశ్‌లో 6 లోక్ సభ స్థానాలకు పోటీచేస్తామనీ, ఇందులో నలుగురు స్వయంపోషకులని అన్నారు గుజరాత్, రాజస్థాన్‌లలో చాలా మెజారిటీ సంపాదించే అవకాశమున్నదన్నారు

పంజాబులో ఎన్నికల ప్రచారం, ఐక్యకార్యాచరణకు సంబంధించినంతవరకు తమ పార్టీ ఏర్పాట్లు పూర్తి చేసుకున్నదన్నారు మాస్టర్ తారాసింగ్‌తో భుజంభుజంకలిపి ప్రచారానికి పూనుకుంటామన్నారు ఎనిమిది లోక్‌సభ స్థానాలకు పోటీ పెడతామన్నారు శాసనసభకు ఎన్ని సీట్లకు పోటీచేసేదీ తనవద్ద లెక్కలు లేవన్నారు

ఆంధ్రప్రదేశ్‌లో

ఇక ఆంధ్రప్రదేశ్‌లో స్వతంత్ర పార్టీకిఎక్కువ ప్రోత్సాహాలు లభిస్తున్నాయని శ్రీ రంగా చెప్పారు ఈ రాష్ట్రంలో 100 సీట్లకు పైగా సంపాదించగలమనీ, ఇందులో గుంటూరు జిల్లా అగ్రస్థానంలో వుంటుందనీ అన్నారు గుంటూరులోని 25 స్థానాలలో కనీసం 15 అయినా తప్పక నెగ్గగలమన్నారు “ఆంధ్ర ప్రాంతంలోనే 100 గాని అంతకంటే హెచ్చుగాని అనేదే మా నినాదం” అన్నారు

తెలంగాణా సంగతేమిటని ప్రశ్నించగా అక్కడకూడా కొద్దిమందిని నిలబెడతామన్నారు

తమపార్టీ భూమిశిస్తును రద్దుచేయాలని డిమాండ్ చేస్తున్నదనీ, అందుచేత తమ జెండాచుట్టూ జనం గుంపులు కూడుతున్నారని అన్నారు

అధికారులు అట్లో అభిప్రాయ పడ్డారు అనే వారికి చివరికి గుడి బండయై కూర్చున్నది

— ప్రసాద్

ఇకపై తీసుకోగల చర్యల్నిగూర్చిఅమెరికా ఆలోచిస్తుందట

ఐరాస, డిసెంబరు 19

గోవా సమస్య విషయమై ఇక నిప్పుడు తీసుకోవలసిన చర్యలను గురించి, తక్కిన దేశాలతో ఈ రాత్రే సమాలోచనలు జరుపుతామనీ, ఐరాస తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరే హక్కును ఉంచుకుంటున్నామనీ, అమెరికా ప్రతినిధి అడ్లై స్టీవెన్సన్ గత రాత్రి భద్రతా సంఘంలో ప్రకటించారు

భారతదేశాన్ని ఖండిస్తూ తమ మద్దతులోవచ్చిన తీర్మానాన్ని సోవియట్ వీటో చేసిన వెంటనే ఆయన ఈ ప్రకటన చేశారు

భద్రతాసంఘంలో వీటో అమలు జరిగినా లెక్కచేయకుండా “శాంతి సంరక్షణార్థం” ఐరాస తగు చర్యలు తీసుకోవడానికి వీలుకలిగించే ఒక నిబంధనను పాటించవలసిందిగా అమెరికా ప్రభుత్వం కోరదలచుకున్నదేమో ఇంకా తేలలేదు

ఈ నిబంధన ప్రకారం, వీటో అమలు జరిగిన 24 గంటలలో భద్రతాసంఘంలోమెజారిటీవోటుతో, ఈ సమస్యను అత్యవసర ఐరాస మహాసభ ఎదుట పెట్టవచ్చు

బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి

గోవా సమస్య విషయంలో, శాంతియుతంగా చొరవ తీసుకొనే ఉద్దేశం తమ ప్రభుత్వానికిలేదని బ్రిటిష్ విదేశాంగశాఖోద్యోగి ఒకరు తెలిపారు.

ఈవిషయంలో పోర్చుగీసు ప్రభుత్వపు అభిప్రాయాన్నీ, ఈ పరిణామాలకు ఆందోళన తెలిపిన ఇతర దేశాల అభిప్రాయాలనూ తెలుసుకోవలసి ఉంటుందన్నారు భారతదేశం కామన్వెల్తు సభ్యురాలు కావడం వల్ల తలెత్తగల పరిమితులను బ్రిటిషు ప్రభుత్వం 1954 లోనే పోర్చుగీసు ప్రభుత్వానికి తెలిపిందని ఈయన అన్నారు

మాక్ - నెహ్రూ ఉత్తర ప్రత్యుత్తరాలు

లండన్, డిసెంబరు 19

గోవా విషయమై తమకూ, భారత ప్రధానినెహ్రూకూ మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయని, బ్రిటిష్ ప్రధాని హెరాల్డ్ మాక్మిలన్ నేడు కామన్సు సభలో ప్రకటించారు వాటిని తాము ప్రచురించదలచుకోలేదన్నారు.

లేబరుపార్టీసభ్యుడు వుడ్రోవాట్ అడిగిన ఒక ప్రశ్నకు జవాబుగా ఈ విషయం తెలిపారు

గోవా గవర్నర్‌కు సలహాదారుడుగా శ్రీ హందూ నియామకం

బెల్గాం, డిసెంబరు 19

భారతీయ పోలీసు దళానికి చెందిన శ్రీ జి కె హందూను గోవా మిలిటరీ గవర్నరుకు ప్రత్యేక సలహాదారుగా నియమిస్తూ భారతప్రభుత్వం నేడు ప్రకటించింది

శ్రీ హందూ పోర్చుగీస్ వలస పాలనను తుదముట్టించడానికి తహతహ లాడిన వారిలో ఒకడైనందున ఇక్కడ గోవావర్గాలు ఆయన నియామకానికి సంతసాన్ని వెల్లడించాయి

గోవాకు సివిల్, సైనిక ఉద్యోగులు

బొంబాయి, డిసెంబరు 19

సివిల్, సైనిక ఉద్యోగులు కొందరు ఈదేశ ఒక ప్రత్యేక విమానంలో బొంబాయినుండి గోవాకు బయలుదేరారు

విదేశీ స్థావరాల పాలనకుచెందిన 1947 చట్టాన్ని అనుసరించి భారత ప్రభుత్వం గోవా, డయ్యూ, డామన్ పరిపాలనను సాగిస్తుంది

డయ్యూ, డామన్‌లలో కలెక్టరు హోదాగల పరిపాలనాధికారులుంటారు

సైనిక చర్యలో 8 మంది మృతి

శ్రీ కృష్ణమీనన్ వెల్లడి

బొంబాయి, డిసెంబరు 19

న్యూయార్కునుండి వెడుతూ యిక్కడికి వచ్చిన రక్షణ మంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడిక్కడ పత్రికలవారితో మాట్లాడుతూగోవా,డామన్,డయ్యూలను విముక్తి చేయడానికి జరిగిన సైనిక చర్యల్లో ఎనిమిది మంది ప్రాణాలను కోల్పోయారని తెలిపారు

ఇందులో నలుగురు అంజదీవ్ దీవిలో పోర్చుగీసువారిచే కాల్చివేయబడ్డారు పోర్చుగీస్‌వారు తెల్లజెండా ఎత్తి, మన నావికులనమ్మి ఆదీవిలో ప్రవేశించగా పోర్చుగీస్‌వారు పిరికిపందలవలె మనవారిని కాల్చిచంపారనీ, అయినప్పటికీ మనవారు కక్షతో వ్యవహరించకుండా హుందాతనంతో వ్యవహరించారని శ్రీ మీనన్ వివరించారు

డయ్యూలో ఇద్దరు, డామన్‌లో మరోయిద్దరూ చనిపోయారన్నారు

విశాలాంధ్ర లక్షనిధి

శ్రీ చాడం బాలయ్య (రెండవసారి) ప్రొద్దుటూరు	5
అభిమాని ప్రొద్దుటూరు	5
,, ,,	5
శ్రీ కుందుర నరసింహమూర్తిగారు (కుమారుని జన్మదిన సందర్భంలో) కూనవరం, ప గో జిల్లా	5
అభిమాని విజయనగరం	1
ఎండుగుంపాలెం వ్యవసాయ కార్మికులు, గుంటూరు జిల్లా	30 84
వ్యవసాయ కార్మికులు, వెంకటాపురం గుంటూరుజిల్లా	5
గ్రామాభ్యుదయ సమితి-గాజులరేగ	5
శ్రీమతి ఇంజరపు మహాలక్ష్మమ్మ, అనకాపల్లి	10
శ్రీ జి వరసయ్యగారి ద్వితీయ కుమార్తె చి॥ సౌ॥ సుబ్బమ్మ వివాహ సందర్భంలో (కప్పట్రాళ్ల), కర్నూలుజిల్లా	5
చేవుటూరుశాఖ - కృష్ణా	5
రాయపూరు గ్రామపార్టీ సభ్యులు, అభిమానులు నిజామాబాద్ జిల్లా	20
అభిమాని (సీనియర్‌గారి ద్వారా)	20
శ్రీ డి వీరారెడ్డి, సీతారామపురం కడపజిల్లా	1
అభిమాని అల్లూరు గుంటూరుజిల్లా	1
పోరంకిశాఖ కృష్ణా	10
శ్రీ దొమ్మేటి వెంకట్రావు, రాజమండ్రి	2

డయ్యూ గవర్నర్ లొంగుబాటు

వెరవాల్ (సౌరాష్ట్ర), డిసెంబరు 19

డయ్యూ గవర్నర్ నేటి మధ్యాహ్నం 12 గంటలకు 112 వ భారత పదాతి దళాధిపతి బ్రిగేడియర్ ఆగ్ జై సింగ్‌కు లొంగిపోవడంతో సౌరాష్ట్ర తీరంలోని 24 చదరపుమైళ్ళ డయ్యూదీవి మాతృభూమియైన భారతదేశంలో విలీనమైంది ఈ దీవిలో జనాభా 15 వేలు

పోర్చుగీస్ ప్రతినిధివర్గ మొకటి గత రాత్రి “ఆగ్” వద్ద మన బ్రిగేడియర్‌ను కలుసుకుని నేటి ఉదయమే తాము లొంగిపోనున్నామని తెలియజేశారు కాని ఈలోగా భారత సైన్యం నేడు తెల్లవారు జామునే ముందుకు సాగి బుడతకీచుల తమ భూదహన కార్యక్రమాన్ని సాగించకుండా దీవిని రక్షించారు

తమ కుటుంబాలను విదేశాలకు తరలించిన 400 మంది పోర్చుగీస్ సైనికులు భారత సేనకు బందీలుగా పట్టుబడ్డారు డయ్యూలో పోర్చుగీస్‌వాళ్లు మొత్తం ఏడుగురు చనిపోయారు. 60 మంది గాయపడ్డారు ఈ సందర్భంలో అనేక బ్రిటిష్ తుపాకులు, మరికొన్ని అమెరికన్ ఆయుధాలతో సహా అనేక ఆయుధాలు, మందుగుండు సామాగ్రి పట్టుబడింది

భారత సైనికుల నష్టాలు చాల స్వల్పమని అధికార రీత్యా తెలిసింది

పాంజింపతనం

లిస్బన్ ధ్రువీకరణ

లిస్బన్, డిసెంబరు 20

భారత సేనలు గోవా రాజధానియైన పాంజిమ్‌ను కైవసం చేసుకొన్నమాట నిజమేనని నేడు పోర్చుగీస్ ప్రభుత్వంకూడా ధృవీకరించింది

గోవా బయలుదేరిన బ్రిటిష్ యుద్ధనౌక

సింగపూర్‌కు మరలింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 20

గోవాకు బయలుదేరి వస్తున్నదని బ్రిటిష్ విదేశాంగ మంత్రి లార్డుహోమ్ చెప్పారు. బ్రిటిష్ యుద్ధనౌక ఇప్పుడు సింగపూర్‌కు వెడుతున్నది

ఇక్కడ బ్రిటిష్ హైకమిషన్ ప్రతినిధి పత్రికలవారితో మాట్లాడుతూ గోవాలోని బ్రిటిష్ పౌరులకు రక్షణ కలదని భారత ప్రభుత్వం హామీయిచ్చినందున యుద్ధనౌక యిప్పుడు సింగపూర్‌కు మరలించబడిందన్నారు.

జెట్ విమాన యానంలో శిక్షణ

హైద్రాబాద్‌లో పట్ట ప్రదానోత్సవం

హైద్రాబాద్, డిసెంబరు 19

జెట్ విమానయానంలో ఉన్నత శిక్షణ పొందిన వైమానికులకు పట్టప్రదానోత్సవం నేడిక్కడ జరిగింది ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ - ఇన్ - చీఫ్ ఎస్ ఎన్ గోయల్ అధ్యక్షత వహించారు

“ఏ శత్రువునైనా ఎదుర్కొనగల శక్తి మన వైమానిక బలానికి ఇప్పుడు చేకూరింది

“ఒక దశాబ్దంలోనే ఇప్పుడు శిక్షణ పొందినవారిలో కొందరు అంతరిక్షయానం చేయగలరని విశ్వాసంగా వున్నది ఈ విమానయాన శకానికి తగినట్లుగా దేశంలోని యువకులు తయారు కావాలి” అని అన్నారు

పైలట్ ఆఫీసర్ డి ఆ దాస్‌కు రెండు ఇంజన్లుగల జెట్ విమాన పైలట్లలో అత్యుత్తమునిగానూ, పైలట్ ఆఫీసర్ వి పి నేలాకు రెండు ఇంజన్లుగల రవాణా విమాన పైలట్లలో ఉత్తముని గాను, పైవ్ ఆఫీసర్ కె ఎస్ భౌస్కర్ రెండు ఇంజన్లుగల రవాణా విమానాల నావిగేటర్లలో ఉత్తముడుగాను బహుమతులు ఇచ్చారు

వెంకటేశ్వర విశ్వ విద్యాలయ సమస్యలు

ఉపముఖ్యమంత్రితో విద్యార్థి నాయకుల సంభాషణలు

నెల్లూరు, డిసెంబరు 20

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ విద్యార్థి కార్యాచరణ సంఘ సభ్యులు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 3-30 గంటలకు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి శ్రీ కొండా వెంకటరంగారెడ్డిగారిని నెల్లూరు ట్రావెలర్సుబంగళాలో కలుసుకొని విశ్వవిద్యాలయంలో యీనాడు విద్యార్థులెదుర్కొంటున్న యిబ్బందులు వివరించారు ఈ క్రింది విద్యార్థి సమస్యలను వెంటనే పరిష్కరించుటకు నటకు గత్యంతరంలేక సమ్మె చేయుచున్నామనీ, సత్వరం వాటి పరిష్కారానికి తోడ్పడవలసిందిగా కోరుతూ మెమొరాండంను సమర్పించారు

విద్యార్థి సమస్యలు

1 కోర్సు ఒక్కటే పరీక్ష ఉండాలి

2 గ్రూపు సబ్జక్టులలో విడివిడిగా ఉత్తీర్ణులు కావడానికి అవకాశమివ్వాలి

3 పి యు సి కోర్సులో “హ్యూమన్ ఎచీవ్‌మెంట్స్”ను రద్దు చేయాలి.

4 మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో జనరల్ ఎడ్యుకేషన్ను రద్దు చేయాలి

5 గ్రేడుల పద్ధతిస్థానే మార్కుల పద్ధతి ప్రవేశపెట్టాలి

6 మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో జరిగే పరీక్షలు ప్రతి సంవత్సరం చివర కొన్ని పరీక్షలు చొప్పున జరపాలి

మంత్రిగారు విద్యార్థి ప్రతినిధులు చెప్పిన విషయాలను సావధానంగా విని, సానుభూతిగా మాట్లాడారు

కర్నూలు విద్యార్థుల బహిరంగసభ, ఊరేగింపు

కర్నూలు, డిసెంబరు 19

ఈ నెల 16వ తేదీ శనివారం సాయంత్రం కర్నూలులో కొండారెడ్డి బురుజువద్ద పట్టణ విద్యార్థిసంఘం ఆధ్వర్యాన బహిరంగసభ జరిగింది అంతకుముందు పట్టణవీధుల్లో పెద్ద ఎత్తున విద్యార్థుల ఊరేగింపు జరిగింది శాసనసభ్యులు శ్రీ ఇ అయ్యపురెడ్డిగారు సభకు అధ్యక్షత వహించారు శాసన మండలిసభ్యులు శ్రీ డి వి సుబ్బారావుగారు, స్థానిక న్యాయవాది శ్రీ బుద్ధ కవిగారు, విద్యార్థిసంఘ అధ్యక్షులు శ్రీ రంగయ్యనాయుడుగారు, కార్యాచరణ సమితి కార్యదర్శి యస్. సుధాకర రెడ్డిగారు, శ్రీ సుబ్బారెడ్డి (విద్యార్థి సంఘ కార్యదర్శి) గార్లు ఉపన్యసించారు వక్తలు, విద్యార్థుల న్యాయమైన కోర్కెలు నెరవేర్చేందుకు తమ చేతనైన సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. రంగయ్యనాయుడు గారు విద్యార్థుల కోర్కెలను వివరించారు కార్యాచరణ సమితి కార్యదర్శి శ్రీ సుధాకరరెడ్డి మాట్లాడుతూ, 16వ తేదీన విద్యార్థి కార్యాచరణ సమితి పిలుపు ననుసరించి విశ్వవిద్యాలయంలో తొమ్మిది అనుబంధ కళాశాలల్లో సమ్మె ప్రారంభమైందని తెలియజేశారు ఆదోని, కర్నూలు, అనంతపురం, మదనపల్లి, చిత్తూరు, నెల్లూరు, కావలి, కడప, తిరుపతి మరియు కర్నూలుస్త్రీలకళాశాలలు అన్నిచోట్ల సమ్మె జయప్రదంగా, శాంతియుతంగా జరుగుతోందని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడకుండా ఈ సమస్యలను వెంటనే పరిష్కరించవలసిందిగా విశ్వవిద్యాలయాధికారులకు విజ్ఞప్తి చేశారు విద్యార్థుల సమస్యలపట్ల పట్టణ ప్రజలు పూర్తిగా సానుభూతి చూపుతున్నారు (వి వి)

'ఇది వలస వ్యతిరేక ఉద్యమానికే ఒక విజయం': పోలెండు కమ్యూనిస్టు పత్రికల ప్రశంస

వార్సా, డిసెంబరు 19

"ఇదిఒక్క భారతదేశానికిమాత్రమే గాక, వలసవిధాన వ్యతిరేక ఉద్యమాని కంతటికీ ఒక విజయం" అని గోవా విముక్తిపై పోలెండు కమ్యూనిస్టుపార్టీ పత్రిక 'ట్రిబ్యూనా లుడూ' వ్యాఖ్యానించింది

భారతసేనల ఈ విజయం ప్రభావం ఆఫ్రికాపై విస్తృతంగా ఉంటుందని ఆపత్రిక తెలిపింది

"పోర్చుగీసు వలసపాలన వ్యతిరేక పోరాటంలో అంగోలా, మొజాంబిక్ ప్రజలకు ఇది ఎంతో ఉత్సాహాన్ని యిస్తుంది" అని అన్నది భారతదేశ చరిత్రలో ఇదొక ముఖ్య సంఘటన అని తెలిపింది

"స్వాతంత్ర్య కాముకులందరి దృష్టిలోనూ భారతదేశప్రతిష్ఠ దీనివల్ల పెరుగుతుందన్నది"

'జీసీ వార్షావీ' అనే పత్రిక ఇలా అన్నది

"కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాల భూభాగాల్లో ఇంకా మిగిలి వున్న వివిధ వలసలు, ఇప్పుడు గోవా విముక్తితో ఇక రోజులు దగ్గరపడ్డాయి.

"వలసదేశాల స్వాతంత్ర్యం గురించి ఐరాస చేసిన నిర్ణయాలను వలస పాలక దేశాలు ధిక్కరించదలచు కున్నట్లయితే బలప్రయోగంతోనైనా సరే వలస విధాన అవశేషాలను నిర్మూలించేందుకు ఆయా దేశాలకు హక్కు ఉన్నదనే ప్రస్తుత ప్రభావాంశం భారతదేశం ఇటువంటి చర్యను తీసుకోవడం ప్రత్యేక ప్రాధాన్యం గల విషయం ఆఫ్రికాలో పోర్చుగీసు వలసపీడనను ప్రతిఘటించి పోరాడుతూన్న దేశాలకు ఇదొక పెద్ద అండఅన్నమాట" అని ఆ పత్రిక రాసింది

'ప్రావ్దా' వ్యాఖ్య

మాస్కో, డిసెంబరు 19

గోవా విముక్తి పోరాటవార్తను మాస్కో పత్రికలన్నీ చాలా ప్రాధాన్యమిచ్చి ప్రచురించాయి

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక 'ప్రావ్దా'లో పోలిటికస్ ఒక వ్యాఖ్య రాస్తూ ఇలా అన్నారు

"[illegible] డయ్యూ, డామన్లను [illegible] భారతదేశంలో ఉండనివ్వాలని అనేక [illegible] సాలుగా భారత ప్రభుత్వం పోర్చుగీసు ప్రభుత్వానికి సూచిస్తూ వచ్చింది శాంతికాముక దేశాలన్నీ ఈ డిమాండును బలపరుస్తూ వచ్చాయి ఈ డిమాండు న్యాయమైనదని అనేక ఆసియా-ఆఫ్రికా సమావేశాలు గుర్తించాయి

"భారత రిపబ్లిక్ నుండి విడదీయరాని భాగాలయిన గోవా, డయ్యూ, డామన్లను వారి భారతదేశానికి అప్పగించడానికి వలస పాలక, సామ్రాజ్యవాదదేశాలు మాత్రమే వ్యతిరేకిస్తూ వచ్చాయి"

ఈజిప్టు పత్రిక వ్యాఖ్య

కైరో, డిసెంబరు 19

"ప్రతి సామ్రాజ్యవాదిపైన తీసిన దెబ్బ, ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యానికి దోహదకరమయిన ఒక మహత్తరచర్య" అని ఐక్య అరబ్ రిపబ్లిక్ ప్రభుత్వ వర్గాలతో సన్నిహిత సంబంధాలుగల 'అల్ జమూరియా' పత్రిక నేడు గోవా విముక్తినిగురించివ్యాఖ్యానిస్తూఅన్నది

ఇరాక్ ప్రభుత్వ అభినందనలు

బాగ్దాద్, డిసెంబరు 19

గోవాలో తనహక్కుల పునరుద్ధరణకై భారతదేశం తీసుకొన్నది న్యాయమైన చర్యఅని ఇరాక్ ప్రభుత్వ ప్రతినిధి గతరాత్రి అభినందించారు భారతదేశం శాంతియుతమైన విజ్ఞప్తులను చేసిందనీ, ఎంతో కాలం ఓర్మి వహించిందనీ ఆయన అన్నారు

మీనన్ కు బ్రెజ్నేవ్ అభినందనలు

బొంబాయి, డిసెంబరు 19

గోవాలో భారత సైన్యం తన సైనిక చర్యలను జయప్రదంగా ముగించినందుకు రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ ను నేడు సోవియట్ అధ్యక్షుడు బ్రెజ్నేవ్ అభినందించారు.

భారత వైమానికదళ విమానంలో బొంబాయికి చేరిన శ్రీ మీనన్ బరోడా నుంచి మరొక విమానంలో దిగిన బ్రెజ్నేవ్ ను చూసి ఆయన వద్దకు వెళ్లారు బ్రెజ్నేవ్ తనకారునుంచి దిగి శ్రీ మీనన్ తో కరచాలనం చేశారు గోవాపై సైనికచర్యను విజయవంతంగా పూర్తిచేసినందుకు తన అభినందనలను అందజేశారు

ఆ తరువాత మహారాష్ట్ర గవర్నరు శ్రీ శ్రీప్రకాశ్ శ్రీ మీనన్ ను అభినందించారు న్యూయార్కు బయలుదేరి వెళ్ళడానికి ముందు కొన్ని గంటలు ఇక్కడ శ్రీ మీనన్ ఉన్నారు ఇక్కడకు వచ్చిన తరువాత శ్రీ మీనన్ ట్రంక్ ఫోన్ లో ఢిల్లీతో మాట్లాడారు.

అమెరికా ధోరణిపట్ల ఢిల్లీలో ఆశ్చర్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 19

భద్రతా సంఘ సమావేశంలో భారత దేశాన్ని ఖండిస్తూ అమెరికా ప్రతినిధి అడ్లెయ్ స్టీవెన్సన్ అంత ఆవేశంతోనూ, అంత తీవ్రంగానూ మాట్లాడడం ఢిల్లీలో చాల ఆశ్చర్యం కలిగించింది

ఢిల్లీలోని అమెరికా రాయబారిచేసిన వ్యాఖ్యకే, స్టీవెన్సన్ మరింత పెంచి వివరించారని వారంటున్నారు

ఇక బ్రిటిష్ ప్రభుత్వ వైఖరి విషయం, గోవాలోని బ్రిటిష్ పౌరుల రక్షణార్థం ఒక యుద్ధనావను పంపాలని బ్రిటిష్ విదేశాంగమంత్రి లార్డ్ హోమ్, పార్లమెంటులో చేసిన ప్రతిపాదన పూర్తిగా హాస్యాస్పదమూ, భారతదేశాన్ని అవమానపరిచేదీ అని ఢిల్లీలో విమర్శిస్తున్నారు గోవాలో ఉన్నది మహాఅయితే ఒక అరడజనుమంది బ్రిటిష్‌పౌరులు భారతదేశంలోఆస్తులూ, వృత్తులూ కల బ్రిటిష్ పౌరులు ఎంతోమంది ఉన్నారు ఈ దేశంలో వీరి క్షేమం గురించి ఇంతవరకు ఎవ్వరికీ ఎలాంటి ఆందోళనా కలగలేదు అని వీరంటున్నారు

అమెరికా ఒడిగట్టిన ఘాతుకం

ఐరాస, డిసెంబరు 19

గోవాసమస్యపై భద్రతాసంఘంలో నేడు జరిగిన చర్చసందర్భంలో, ఓటింగులో తాను తటస్థంగా ఉంటానని ఒక దక్షిణఅమెరికాదేశ ప్రతినిధి లాబీలో తెలిపాడు

కాని, అతను చివరకు పోర్చుగీసు తీర్మానానికి అనుకూలంగా ఓటు చేశాడు

అమెరికా ప్రతినిధి తన అనుచర దేశాలవారిపై తెచ్చిన తీవ్ర ఒత్తిడే ఇందుకుకారణమని అనుకుంటున్నారు

అడ్లెయ్ స్టీవెన్సన్ వింత ప్రవర్తనా, దురుసు మాటలూ అందరికీ ఆశ్చర్యం కలిగించాయి

పోర్చుగీసు విదేశాంగమంత్రి

న్యూయార్కు, డిసెంబరు 19

పోర్చుగీసు విదేశాంగమంత్రి ఫ్రాంకో నోగ్వైరా ఈరోజే విమానంలో న్యూయార్కు వచ్చారు

గోవా సమస్యపై తన ప్రభుత్వపు అభిప్రాయాలను ఐరాస ముందుంచడం కోసం ఈయన వచ్చారట

స్టీవెన్సన్ కు నెహ్రూ జవాబు

న్యూఢిల్లీ, డిసెంబరు 19

భారతచర్యపై ఐరాసలోనిఅమెరికా ప్రతినిధి అడ్లెయ్ స్టీవెన్సన్ మున్నగువారు చేసిన విమర్శకు జవాబు చెప్తూ శ్రీ నెహ్రూ ఇలా అన్నారు "సైనిక చర్య తీసుకోవడం నా అభిమతానికివిరుద్ధమైనది కాగా, సైనికచర్య తీసుకోనట్లయితే కలిగే దుష్ఫలితాలు ప్రమాదకరమైనవి

సైనికచర్య 24 గంటలలో ముగియడాన్నిబట్టి అది సమర్థనీయమైనదని చెప్పవచ్చు అక్కడిప్రభుత్వం (పోర్చుగీసు), వేలాదిసైనికులు ఏమీ చేయలేకపోయారు

ఈ చర్య చిన్నదే అయినప్పటికీ మన రక్షణశాఖల సామర్థ్యాన్ని, వాటి మధ్యగల సమన్వయాన్ని నిరూపిస్తున్నది ప్రతిఘటన లేకపోవడం వలన సైనికచర్య సులువైన మాట నిజమే కాని ఇది చాలా సమర్థవంతంగా జరిగింది మనరక్షణశాఖల సత్తాను తెలియజేస్తోంది

గోవాలో రోడ్లనిండా మందుపాతరలను అమర్చారు రోడ్లపై గోతులను తవ్వారు అంతేకాక మన సైన్యాలు ఈ రోడ్లను బాగుచేసేవరకు తమతో కూడా శకటాలను తీసుకొని వెళ్ళడానికి వీలు లేకపోయింది మన సైనికులు కాలినడకనే ముందుకు వెళ్లారు నిన్న ఆఫీసర్లు, సైనికులు 22 మైళ్లు కాలినడక సాగించారు

"అన్ని దశలలోను మన సైనికులకు గోవా ప్రజలు సహాయంచేశారు వారికి పూలమాలలను వేసి కొబ్బరి నీళ్ళను ఇచ్చారు సమర్థవంతంగానూ, చక్కగాను తమ కర్తవ్యాన్ని నిర్వహించిన మన రక్షణ శాఖలను నేను అభినందిస్తున్నాను"అని శ్రీ నెహ్రూ అన్నారు

అంగోలా తాత్కాలిక ప్రభుత్వం స్థాపన

కొద్దిమాసాల్లో జరుగుతుందని ప్రకటన

న్యూయార్కు, డిసెంబరు 19

అంగోలా జాతీయవాదుల సంస్థ (యు పి ఎ) అధ్యక్షుడు హోల్డెన్ రాబర్టో కొద్దిమాసాలలోనే అంగోలా భూభాగంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం నెలకొల్పబడుతుందని నిన్న ప్రకటించారు

పోర్చుగీసు వలసయైన అంగోలాలో తాత్కాలిక ప్రభుత్వాన్ని స్థాపించేందుకు యుద్ధ సమితి సమావేశం జరుగుతుందని ఆయన చెప్పారు అంగోలా జాతీయవాదుల సైనిక కమాండర్లు ఈ సమావేశానికి హాజరవుతారని ఆయన అన్నారు జాతీయప్రభుత్వం రాజధాని ఎక్కడ ఉండేది తానిప్పుడు చెప్పననీ, అది సైనికరహస్యమనీ అన్నారు

కలకత్తాలోని మహల్లా కమిటీ గోవా విముక్తి సందర్భంగా బిస్కట్లు కొని పంచడానికి గాను గోవాలోని జవాన్లకు రు 100 లు పంపారు.

వివాద పరిష్కృతికి ఇన్నాళ్లు ఏంచేశారు?

పోర్చుగల్లుకు, దాని మిత్రదేశాలకు భారత రక్షణ మంత్రి శ్రీ మీనన్ ప్రశ్న

సంప్రతింపులకు పోర్చుగల్ నిరాకరణవల్లనే సైనిక చర్య గైకొనవలసి వచ్చిందని వివరణ

బొంబాయి, డిసెంబరు 19

గోవా వివాదాన్ని సంప్రతింపుల ద్వారా పరిష్కరించడమే తమ ఉద్దేశమైతే ఈవిషయమై ఐరాసయిన్నాళ్లు ఎందుకు తీర్మానం చేయలేదని పోర్చుగల్లును, దాని మిత్రదేశాలను భారత రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడిక్కడ ప్రశ్నించారు

బొంబాయి కాంగ్రెసు కమిటీ అప్పటికప్పుడు ఏర్పరచిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ శ్రీ మీనన్ ఇలా అన్నారు

"అగ్రరాజ్యాల వైఖరితో గాని, అవి భారతదేశాన్ని ఖండిస్తూ ఐరాసలో ప్రతిపాదించిన తీర్మానంతో గాని భారతదేశానికి విరోధం లేదు వాటికి మనం జవాబు చెప్తాం కాని మన మిత్రులు మనకి రాసి ఇస్తున్న మందును ఒక గుటకైనా పుచ్చుకొంటారనే నేను ఆశిస్తున్నాను."

సభకు హాజరైన 50వేల మందికి పైగా ప్రజలు శ్రీ మీనన్ ప్రసంగిస్తున్నంతసేపు హర్షధ్వానాలు చేశారు గోవాసమస్య చరిత్రను ఆయన సుదీర్ఘంగా వివరించారు. సంప్రతింపుల ద్వారా సమస్యను పరిష్కరించడానికి 15 సంవత్సరాలపాటు భారతదేశం తీసుకొన్న చర్యలను, భారతదేశంపట్ల పోర్చుగల్లు ప్రదర్శించిన అవమానకరమైన వైఖరిని, సైనిక చర్యకు దారితీసిన పరిస్థితులను ఆయన వివరించారు

శ్రీ మీనన్ ఇంకా ఇలా అన్నారు

"గోవాపై చర్య తీసుకోవడంలో మనం ఐరాస ప్రణాళికను ఏవిధంగానూ ఉల్లంఘించలేదు వలసలు ఇకమీదట కొనసాగరాదని ఐరాసయే తీర్మానించింది భారతదేశం దానికి అనుగుణంగానే నడిచింది

వలస విధానం శాశ్వతమైన దురాక్రమణ గోవాలో ఈ దురాక్రమణను భారతదేశం తొలగించింది బలమే న్యాయాన్ని నిర్ణయిస్తుందని భారతదేశం ఎన్నడూ విశ్వసించదు కాని తనహక్కులను స్థాపించుకొనే బాధ్యతను భారతదేశంఎన్నడూ వదులుకోదు గోవాలో భారతదేశం తీసుకున్న చర్య తన హక్కులను పునరుద్ధరించుకోవడం మాత్రమే అవుతుంది

గోవాపై చర్యతీసుకోవాలని అంతిమంగా నిర్ణయించడానికి దేశం ప్రధాన మంత్రి ఎంతో మానసిక సంఘర్షణకు గురి అయ్యారు. గోవాపై చర్యతీసుకొన్నామని మనమేమీపశ్చాత్తాపం చెందడంలేదు" అని శ్రీ మీనన్ అన్నారు

కానిప్పుడు ఐరాసకు తాత్కాలికంగా సెలవుతీసుకున్నాననీ, కాని చివరి నిమిషం వరకు తానేమీ నిర్ణయించలేదనీ ఆయన అన్నారు ఐరాసలో గోవాపై చర్చకు సంబంధించిన భోగట్టాకోసం తాను ఎదురుచూస్తున్నాననీ, ఈ విషయమై తనకు ఆదేశాలు వస్తాయనీ శ్రీ మీనన్ అన్నారు

సంప్రతింపులద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి పోర్చుగల్ నిరాకరించడంవల్లనే భారతదేశం చర్య తీసుకోవలసి వచ్చిందని శ్రీ మీనన్ స్పష్టంచేశారు

లాంఛనంగా పోర్చుగీసు సేనల లొంగుబాటు

జనరల్ చౌధురికీ, బుడతకీచు సేనాని నివేదన

పాంజిమ్, డిసెంబరు 19

గోవాలోని పోర్చుగీసు సేనలు ఈరోజే లెఫ్టినెంట్ జనరల్ జె యన్ చౌధురికి లొంగిపోయాయి

"గోవా విముక్తి" సేనలకు జనరల్ చౌధురి సర్వసేనానిగా ఉన్నారు పోర్చుగీసు సేనలు లొంగిపోవడాన్ని లాంఛనంగా స్వీకరించేందుకు ఈయన ఈరోజే ఉదయం బెల్గాంనుండి విమానంలో పాంజిమ్ వచ్చారు

పాంజిమ్ వీధులలో వేలాది ప్రజలు, ఆనందపారవశ్యంతో ఈయనకుస్వాగత మిచ్చారు

పోర్చుగీసు సేనల ప్రధాన కార్యాలయం ఎదుటనున్న బయలు ప్రదేశంలో ఆ సేనలు లొంగిపోయే కార్యక్రమం జరిగింది

పోర్చుగీసు సేనాధిపతి, జనరల్ చౌధురివద్దకు నడిచి శాల్యూట్ చేసి, అటెన్షన్ లో నిలబడి, "మేము మీకు ఇదే లొంగిపోతున్నాము" అని పోర్చుగీసు భాషలో అన్నారు

"యుద్ధవిరమణ చేయ వలసిందిగా మా సేనలకు గతరాత్రే ఉత్తరువులు జారీఅయాయనీ, మా సైనికులు ఆయుధాలను కిందపడేస్తున్నారనీ మీకు నివేదిస్తున్నాను"అని ఆయన అన్నారు

జనరల్ చౌధురి యిలా జవాబు చెప్పారు

"మీ సైనికులు బారకాసుల లోనే ఉండాలి ఇతర వ్యవహారాలు తరువాత చూద్దాము"

చౌధురి ఇలా అన్న తరువాత, పోర్చుగీసు సేనాని తిరిగి శాల్యూట్ చేసి,బారకాసులోకి వెళ్ళిపోయాడు

ఆ తరువాత, జనరల్ చౌధురి అక్కడ చేరిన వేలాది ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారత సైనికులు ప్రజలకు కావలసిన రక్షణనంతా ఇస్తారన్నారు ప్రజల ప్రయోజనాలకు పూర్తి రక్షణ ఉంటుందన్నారు

రాజధాని పాంజిమ్‌లోకి ప్రవేశించిన తొలి భారతీయ పటాలాలను శ్రీ చౌధురి కలుసుకున్నారు. అతి వేగంగా, రికార్డు సమయంలో గమ్యస్థానాన్ని చేరుకున్నందుకు ఆయన ఆ పటాలాలను అభినందించారు

2 వేలమంది పోర్చుగీస్ సైనికుల లొంగుబాటు

న్యూఢిల్లీ, డిసెంబరు 19

ఈరోజే సాయంత్రానికల్లా రెండు వేలమందికిపైగాపోర్చుగీస్ సైనికులుతమ ఆయుధాలను కిందపడేసి, భారత సైనికాధికారులకు లొంగిపోయారు

పోర్చుగీసు సైన్యంలోని బ్రిటిష్ తయారీటాంకులు ఆరు మార్మగోవాలో భారత సైనికులకు పట్టుబడ్డాయి

అంజదీవ్ దీవిలో కొంతమంది పోర్చుగీసు సైనిక సిబ్బంది లొంగిపోకుండా ఇంకా దాక్కొని ఉన్నట్లు తెలుస్తోంది. వీరికోసం ఆ దీవిలో గాలిస్తున్నారు

బుడతకీచుల దింపుడుకళ్ళెంఆశ!

తమ సేనలు యింకా పోరాడుతున్నాయట

పారిస్, డిసెంబరు 19

ఇక్కడి పోర్చుగీస్ రాయబార కార్యాలయం అధికారులు ఒక ప్రకటన చేస్తూ, గోవాలోని తమ సేనలు స్థానిక ప్రజల సహాయంతో ఇప్పటికీ భారత సేనలను ఎదిరించి పోరాడుతున్నాయనీ, అనేక చోట్ల స్థానిక ప్రజలు భారత 'దురాక్రమణదారుల'కు వ్యతిరేకంగా ఆయుధాలు ధరించారనీ ప్రకటించుకొన్నారు

భారత విమాన దళాలు గోవా రేడియో స్టేషన్ను నాశనం చేసినప్పటికీ, సముద్రంవద్దనున్న పోర్చుగీస్ నౌకల సహాయంతో ప్రయివేటు ట్రాన్స్మిటర్లద్వారా ఎంతో కష్టంతో సమాచార సంబంధాలు అందుతున్నాయనీ చెప్పారు

డామన్ గవర్నరు లొంగుబాటు

వాపి (డామన్), డిసెంబరు 19

పోర్చుగీసు వలసగావున్న డామన్లోని పోర్చుగీసు గవర్నరు నేడుదయం 8-30 గంటలకు భారత సేనాధిపతి కర్నల్ భోంస్లేకు లొంగిపోయారు జాంపోర్ కోటవద్ద పోర్చుగీస్ జెండా దిగిపోయిన అనంతరం గవర్నర్ వచ్చి లొంగిపోయారు ఆ జెండా స్థానే భారత త్రివర్ణపతాక ఎగిరింది

శ్రీ పణిక్కర్

(1 వ పేజీ 8 వ కాలం తరువాయి)

మనం వెనుకంజ వేయజాలం మన లక్ష్యాన్ని విస్మరించి వెనుకంజవేస్తే తిరిగి మనం పేదరికం, అజ్ఞానాంధకారాలకు గురికాగలం మన పద్ధతినుండి వెనుకడుగు వేస్తే మన స్వాతంత్ర్యం కోల్పోవడమే ఫలితమవుతుంది నిరాడంబర జీవితం, ఉన్నతాశయం అనే పాతబడి బూజుపట్టిన, విసుగుకరమైన నినాదానికి లోబడిపోతాం కాబట్టి అపజయంలాగ కనిపించేదానివల్ల వెనుకంజ వేయరాదు, లోపాలు మనలను సంకుచితపరచరాదు

"నేటి భారతదేశంలో ప్రధాన సమస్య మూడువిధాలవిప్లవాన్ని సాధించడం సైన్సు, టెక్నాలజీలలో అధునాతన విజ్ఞానాన్ని ఉపయోగించుకున్న పారిశ్రామిక కార్యక్రమం ఒక కొత్త ఆర్థికజీవితాన్ని సృష్టించడానికే, ఆరు లక్షల గ్రామాల జీవితంలో మార్పుతేవడం, గ్రామీణప్రజలసాంఘికవ్యవస్థలో మార్పు తెచ్చి వారిలో కొత్త ఆశయాలను, కొత్తఉత్తేజాన్ని రేకెత్తించడానికే సాంఘిక విప్లవం మన వ్యవస్థలను ఆధునికం చేయడానికే ఈమూడు విప్లవాలను ఒకేసారి నిర్వహించాలని ఆధునిక భారత దేశం పూనుకొనడమే నాటి నవ జీవితంలోని అత్యంత ప్రముఖ విషయం.

సాంఘిక విప్లవం

"ఈ మూడు లక్ష్యాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి వున్నాయి విస్తృతంగా జరిగే పారిశ్రామిక అభివృద్ధి మన గ్రామాలను ఇంకా వెనుక బడేయించితే, ఆ కనబడే అభివృద్ధి అంతా పైపైనే వుంటుంది కాని వాస్తవంలో ప్రజల దౌర్భాగ్యం ఇంకా పెరుగుతోంది అలాగే గ్రామీణ జీవితాన్ని, దేశం పారిశ్రామిక వంతం చేయకుండా ఎంత సమగ్రంగా పునర్నిర్మించ పూనుకున్నప్పటికీ అది దేశాన్ని బలహీనపరచి ఇతరులపై ఆధారపడివుండేలాచేస్తుంది సాంఘిక విప్లవం లేకుండా తక్కిన రెండూజయప్రదంకావు

"మన దేశం యొక్క మౌలికభావం మానవునిమీద ప్రకృతికే సవాలు ఇతర దేశాలలో యీ ప్రకృతితో మానవుడు సరిపెట్టుకు పోవాలని చూచేవాడు ఆనాడు న్యాయం, వర్షాభావం, పెనుగాలులు,అంటువ్యాధులు ఏమివచ్చినా ఆ మానవునికి వాటిపై పట్టు వుండేదికాదు నేడు అలాకాదు ఇప్పుడు మేఘాలనే ఆదేశించి వర్షాలు కురిపిస్తున్నాడు స్పష్టంగా చెప్పాలంటే, కొన్ని సాంఘిక లక్ష్యాల సాధనకోసం ప్రయోజనకరమైన కార్యక్రమానికిపూనుకొనడమే నేటి అవసరం నేటి భారతదేశంలో ఎక్కడికి వెళ్ళినా ఇదేచూడగలరు

"అంటరానితనం తరతరాల సాంప్రదాయాలకు కట్టుబడిన భారతదేశం పాత జీవితంలో తెగింపులు చేసు కోవాలన్నమాట ఈ కొత్తకాల వ్యవస్థలో పొసగదు. లక్షలాది నిమ్న జాతులు, గిరిజన ప్రజలు ఎలాంటి అవకాశాలు లేకుండా జీవించడాన్ని సహించదు

"భారతదేశంలో ఏకీభావం పెరుగుతున్నది కాని ఇటీవల సంవత్సరాలలో స్థానికతత్వం కూడా పెరిగింది దీనిని అరికట్టకపోతే పరస్పర అనుమానాలు, విభేదాలు పెరగకమానవు "అనిపణిక్కర్ తన ప్రసంగం ముగించారు

యూనియన్ మినిరీ ఐరాస కైవసం

ఎలిజబెత్ విల్లీలో కిరాయి సైనికులకు స్థావరమైన పశ్చిమ దేశాల కంపెనీ

ఐరాస, డిసెంబరు 19

ఎలిజబెత్ విల్లీలోని యూనియన్ మినిరీ(కాటంగా గనుల కంపెనీ)కేంద్ర కార్యాలయం ప్రాంతాన్ని పూర్తిగా ఐరాసకు చెందిన ఇథియోపియా సేనలు నేడు ఆక్రమించాయని ఐరాస ప్రతినిధి ప్రకటించారు యూనియన్ మినిరీ స్థావరాలనుంచి మోర్టారు, మెషీను గన్నులతో జరిపిన కాల్పులను ఐరాస సేనలు ఎదుర్కొన్నాయని అన్నారు

యూనియన్ మినిరీ పారిశ్రామిక కర్మాగారంలోని అనేక లక్ష్యాలను ఐరాస సేనలు ఆక్రమించినట్లు లియోపాల్డ్ విల్లీలోని ఐరాస ప్రతినిధి తెలియజేశారు యూనియన్ మినిరీ స్థావరాలనుంచి తమపై కాల్పులు జరిపిన తరువాత ఇథియోపియా సైనికులు దాడి జరిపారనీ, వారు గట్టిప్రతిఘటనను ఎదుర్కొన్నారనీ చెప్పారు యూనియన్ మినిరీలోని అన్ని లక్ష్యాలను వారు ఆక్రమించుకొన్నారని తెలియజేశారు

అదౌలా - షోంబే సమావేశం

లియోపాల్డ్ విల్లీ, డిసెంబరు 19

కాంగో కేంద్ర ప్రభుత్వ ప్రధాని సిరిల్ అదౌలా, మోసె షోంబేలు ఈరోజే కిటోనా చేరుకున్నారు ఆగస్టులో అదౌలా అధికారంలోకి వచ్చిన తరువాత వీరిద్దరూ సమావేశంకావడం ఇదే మొదటిసారి

వీరిద్దరూ కలుసుకోగానే కరచాలనం చేసుకొని, రాజకీయ చర్చలు మరునాటికి వాయిదా వేసుకొన్నారు

ఐరాస, డిసెంబరు 19

బ్రిటిష్ గయానా, దక్షిణ రొడీషియా సమస్యలను తిరిగి జనవరిలో సమావేశమయ్యే ఐరాసలో చర్చించాలని ధర్మకర్తృత్వ సంఘం నేడు నిర్ణయించింది

బ్రెజ్నేవ్ 55 వ జన్మదినోత్సవం

నెహ్రూ ప్రభృతుల శుభాకాంక్షలు

బొంబాయి, డిసెంబరు 19

ప్రస్తుతం మనదేశాన్ని సందర్శిస్తూ ఉన్న సోవియట్ అధ్యక్షుడు లియోనిడ్ ఇల్యిచ్ బ్రెజ్నేవ్ కు నేటితో 55 ఏళ్లు నిండాయి

బ్రెజ్నేవ్ నేటి ఉదయం అంకాలేశ్వర్ తైలం స్టేషన్లో దిగగానే రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్, ప్రధానినెహ్రూలు పంపిన జన్మదిన శుభాకాంక్ష సందేశాలను ఆయనకు గుజరాత్ ముఖ్యమంత్రి డా॥ జీవరాజ్ మెహతా అందజేశారు

"మిత్రులెవరో, శత్రువులెవరో తేల్చిన అగ్నిపరీక్ష": శ్రీ అజయ్ ఘోష్ వ్యాఖ్య

బెల్గాం, డిసెంబరు 19

"భారతదేశపు మిత్రులెవరో, శత్రువులెవరో తేల్చే అగ్నిపరీక్ష ఇది" అని భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ అజయ్ ఘోష్ గోవా విముక్తిని గురించి నేడు వ్యాఖ్యానించారు

గోవావిముక్తికై భారత ప్రభుత్వం తీసుకున్న చర్యను సోవియట్ నిర్ద్వంద్వంగా బలపరచగా, పశ్చిమరాజ్యాలు విచారం వెలిబుచ్చాయని ఆయన అన్నారు

పైపెచ్చు ఈ పశ్చిమరాజ్యాలలో కొన్ని భద్రతాసంఘంలో పోర్చుగల్లును బలపరిచాయి కూడా అని అన్నారు

అరేబియా సముద్రంలో గోవా సమీపంలో ఒక బ్రిటిష్ క్రూయిజర్ యుద్ధ నావా, ఒక జలాంతర్గామీ కనిపించాయన్న వార్తను గురించి విలేకరులు తెలుపగా, శ్రీ అజయ్ ఇలా అన్నారు.

"ఈ వార్తే నిజమయినట్లయితే, ఒక కామన్వెల్తు సభ్యదేశపు అంతరంగిక వ్యవహారాల్లో స్నేహ విరుద్ధంగానూ అకారణంగానూ బ్రిటన్ జోక్యం కలిగించుకోవడమే అవుతుంది"

అజయ్ ఘోష్ ఈ పత్రికాగోష్ఠి జరిపినప్పుడు శ్రీమతి అరుణా అసఫాలీ కూడా అక్కడే ఉన్నారు

"బ్రిటన్ ఒక క్రూయిజర్ నీ, ఒక జలాంతర్గామినీ భారత తీరాలకు పంపడం, కామన్వెల్తు సంబంధాలకు ఎంతో విరుద్ధమయిన చర్య"అని ఆమె ఖండించారు

కాటంగాలో 'తాత్కాలిక' యుద్ధ విరమణ

ఎలిజబెత్ విల్లీ, డిసెంబరు 18

కాటంగాలో ఇరు పక్షాలకు 'తాత్కాలిక యుద్ధ విరమణ' జరిగిందని కాటంగా సమాచార మంత్రిఆల్బర్ట్ స్వెంబో నేడు అన్నారు

యూథాంట్ ఉత్తరువు

ఐరాస కార్యదర్శి యూథాంట్ నేడు ఒకతాత్కాలిక ఉత్తరువు చేస్తూ, కాటంగాలో యుద్ధం నిలుపుచేయాలని కోరారు షోంబే, అదౌలాల సమావేశానికి వీలుగామాత్రమే ఈ ఉత్తరువు చేసినట్లు ఐరాస ప్రతినిధి ఒకరు చెప్పారు

కిటోనాకు సంప్రతింపుల నిమిత్తం షోంబే వెళ్ళడం ఖాయమైతేనే ఈ ఉత్తరువు అమలు జరుగుతుందని, సంప్రతింపుల కాలంలో ఐరాస సేనలపై దాడి జరిగితే, ఆత్మరక్షణకై తిరిగి కాల్పులు సాగించవలసి వస్తుందనీ ఈ ప్రతినిధి అన్నారు

కాంగో ప్రధానీ, మోసె షోంబేల మధ్య సమావేశం జరిగితే, అది ప్రత్యేకంగా ఐరాస ఆధిపత్యాన్నే జరగాలని ఐరాస ప్రతినిధి అన్నారు

బెల్గాం సభలో మన సైనికులకు అజయ్ ఘోష్ జేజేలు

బెల్గాం, డిసెంబరు 19

గోవా, డామన్, డయ్యూలు విముక్తికావడినసందర్భంలో యిక్కడ బహిరంగసభలు జరిగాయి

గోవా జాతీయ విమోచన కమిటీ బెల్గాంశాఖ ఆధ్వర్యాన జరిగిన బహిరంగ సభలో భారత కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ అజయఘోష్ మాట్లాడుతూ 1857 లో ప్రారంభమైన చరిత్రాత్మకమైన మొదటి స్వాతంత్ర్య యుద్ధంతో ప్రారంభమైన మన స్వాతంత్ర్య పోరాటం నేడు పోర్చుగీస్ పాలన అంతం కావడంతో ముగిసిందన్నారు గోవా విముక్తిఅయినందుకు గోవన్లతోపాటు యావద్భారత ప్రజలు నేడు ఆనంద పడుతున్నారన్నారు

గోవా విముక్తి పోరాటంలో ప్రాణాలర్పించిన యోధుల గౌరవార్థం సభలో అంతా ఒకసారి నిలబడి జోహార్లు అర్పించారు

భారత భూమిలో పోర్చుగీసు పాలనను అంతంచేసినందుకు శ్రీ అజయ్ ఘోష్ ప్రధాని నెహ్రూను అభినందించారు. ఈ కర్తవ్య నిర్వహణను జయప్రదంగాముగించిన ధైర్యశాలురైన మన సైనికులకు ఆయన జేజేలు తెలిపారు

భారత చర్యలపట్ల బ్రిటిష్ పత్రికల అక్కసు

ఒక్క 'డైలీవర్కర్' పత్రిక మినహా

లండన్, డిసెంబరు 19

గోవా విముక్తికి భారతదేశం తీసుకున్న సైనికచర్యలను బ్రిటన్ లో కమ్యూనిస్టు పత్రిక "డైలీ వర్కర్" ఒక్కటిమినహా తతిమ్మా పత్రికలన్నీ తీవ్రంగా ఖండించాయి

"గోవాకు విముక్తి సైన్యాల జైత్రయాత్ర" అనే పతాకశీర్షికతో 'డైలీ వర్కర్' పత్రిక గోవా విముక్తి వార్తను ప్రచురించింది

'డైలీ టెలిగ్రాఫ్' పత్రిక గత రెండువారాలుగా భారతదేశానికి వ్యతిరేకంగా విపరీతమైన ధోరణిలో వ్రాస్తోంది

'డైలీమెయిల్' పత్రిక గోవాలో సైనిక చర్యను "ఘాతుకమైన చర్య"గా పేర్కొన్నది "డైలీ ఎక్స్ ప్రెస్" ప్రధానినెహ్రూ "శాంతికి విద్రోహి"గా పేర్కొని ఖండించింది

'యార్క్ షైర్ పోస్టు' పత్రిక నెహ్రూకపటనాటక మాడుతున్నాడని ఖండించింది

మితవాద పత్రికగా చెప్పబడే "మాంచెస్టర్ గార్డియన్" పత్రిక నెహ్రూ వ్యతిరేక ప్రచారాన్ని పెద్దగా ప్రారంభించక పోయినప్పటికీ గోవా విముక్తికి సైనికచర్యలను ప్రారంభించడం పూర్తిగాఅనుచితమని ఆక్షేపనిగా వ్రాస్తోంది

ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యవర్గ సమావేశం

విజయవాడలో చర్చలు

విజయవాడ, డిసెంబరు 20

ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం నిన్నటినుండి ఇక్కడ 'ప్రజాశక్తి' నగర్ లో జరుగుతున్నది సమావేశానికి కార్యవర్గ సభ్యులేగాక ప్రత్యేక ఆహ్వానంపై వివిధ జిల్లాలకుచెందిన మరి కొంతమంది ముఖ్యులను కూడా ఆహ్వానించారు

వివిధ జిల్లాల్లో యింకా నిర్ణయించవలసిన కమ్యూనిస్టు అభ్యర్థులను గురించి, పార్టీ బలపరచవలసిన స్వతంత్రులను గురించి కార్యవర్గం చర్చించుతోంది సమావేశం రేపుకూడా కొనసాగుతుంది

సమావేశ అనంతరం మరి కొన్ని నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థుల పేర్లను, పార్టీ బలపర్చే స్వతంత్రుల పేర్లను ప్రకటించగలరని తెలుస్తోంది

శ్రీ సిద్ధాంత మృతి

ఢిల్లీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్

కటక్, డిసెంబరు 19

ఢిల్లీ విశ్వవిద్యాలయ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ సిద్ధాంత నేటిరాత్రి 10-45 గంటలకు హృద్రోగంతో భువనేశ్వర్ లో చనిపోయారని రాజభవనం నుండి టెలిఫోను ద్వారా యిక్కడికి వార్త అందింది

ఎల్లెన్ రాయ్ హంతకులకు మరణ శిక్ష

డెహ్రాడూన్, డిసెంబరు 19

కీ॥ శే॥ యం ఎన్ రాయ్ భార్య శ్రీమతి ఎల్లెన్ రాయ్ ని హత్య చేసినందుకు బసంత్ కుమార్, సురేష్ చంద్ర ఛత్రీలకు సెషన్సుజడ్జి ఓంకార్ నాథ్ నేడు మరణ శిక్ష విధించారు

రాజకీయ కారణాలతో శ్రీమతి రాయ్ ని ఆమె అతిధి ఆట్టోజో సెఫ్ చంపి వుండవచ్చుననే డిఫెన్సు పక్షవాదనతో జడ్జి ఏకీభవించలేదు



కమ్యూనిస్టుపార్టీ
ఎన్నికల గుర్తు

¼ డెమ్మీసైజు (8½×"11") డోరుపోస్టరు
న్యూస్‌ప్రింటు కాగితం

ప్రతి వెయ్యిఖరీదు రు 10-50 న పై చొ॥న
సప్లయి చేయబడును

ఆర్డరుతోపాటు నియోజకవర్గంపేరు అభ్యర్థిపూర్తిపేరు.
50 శాతం ఖరీదు పంపించుతూ
ఎన్నివేలు కావలయునో తెలుపవలెను
మిగతాసగం ఖరీదు డోరపోస్టర్లు తీసుకునేముందు చెల్లించవలయును
దగ్గరలోనున్న రైల్వేస్టేషన్ తెలిపిన రైల్వేపార్శిలుద్వారా పంపబడును
ఆర్డర్లు అందిన వారంరోజులలోగా సప్లయిచేయబడును
ఆర్డర్లు యీ క్రిందివారికి పంపండి

స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్,
బకింగ్‌హాంపేటపోస్టు, విజయవాడ - 2

ప్రాథమిక, రాష్ట్రభాషల పరీక్షలకు గుర్తింపు

హైదరాబాద్, డిసెంబరు 18

దక్షిణ భారత హిందీ ప్రచారసభ నిర్వహించే ప్రాథమిక రాష్ట్రభాషా పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీస్ కమిషన్ నిర్వహించే మూడవ తరగతి, రెండవ తరగతి భాషా పరీక్షల్లో వరుసగా ఉత్తీర్ణులైనట్లు పరిగణించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించిందని ప్రచారసభ కార్యదర్శి ఇటీవల ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

రేడియో

శుక్రవారం, డిసెంబరు 22

శక 1883 పుష్య 1

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, వక్తృత్వం ఎస్ గోపాలరత్నం, 6-35 భక్తిరంజని- [హై బి], 6-55 ప్రసార తరంగిణి; 7-0 తె వా, 7-15 గాంధీ మార్గం [హై బి], 7-30 హైదరాబాద్ వలె, 8-0 ఆం వా, 8-15 హిం వా 8-30 ప్రసార సమాప్తి

మధ్యాహ్నం 11-30 రాష్ట్ర గానం, 11-40 మాధ్యమిక పాఠశాలలకు, 12-10 లలిత సంగీతం, 12-30 కార్మికుల కార్యక్రమము, 1-0 టి కె రంగాచారి, 1-30 యుగళ గీతావళి, 1-50 తె వా, 2-0 ప్రసార సమాప్తి

సాయంత్రము 6-0 స్థానిక ప్రకటనలు; 6-5 ప్రాం వార్తలు, 6-15 గ్రామస్థులకు, 7-0 తె. వా, 7-15 గ్రామస్థులకు, 7-30 సంగీత కచేరి – (మ బి), 9-0 ఆం వా, 9-15 నృత్య సంగీతం, 9-30 ఒకే కుటుంబం నాటిక, 9-45 ఎమ్ ఎల్ వసంతకుమారి, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

హైదరాబాద్ - ఎ

405 4 మీ (740 కిలోసై)

ఉదయం 6-30 సుప్రభాత్, 6-35 భక్తిరంజని - వేదస్తుతి కీర్తనలు, 6-55 కార్యక్రమ వివరణ 7-0 తె వా, 7-15 గాంధీమార్గం, 7-30 జయలక్ష్మి సంతానం, 8-0 ఆం వా; 8-15 హిం వా 8-30 హిందూస్థానీ సంగీతశిక్షణ, 8-45 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం 11 40 మాధ్యమిక పాఠశాలలకు [వి బి], 12-10 మాధ్యమిక పాఠశాలలకు (ఉర్దూ), 12-30 కార్మికులకు [వి బి], 1-0 స్త్రీలకు [హిందీ], 1-30 శాస్త్రీయ సంగీత్ 1-50 తె వా, 2-0 హై బి. వలె, 2-10 ఉ వా, 2-20 హై బి వలె, 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం 6-0 స్థానిక ప్రకటనలు, 6-5 ప్రాం. వా, 6-15 నాటిక [ఉర్దూ], 7-0 తె వా; 7 15 గాంధీ పథ్ [హిందీ], 7-30 సంగీతోత్సవం (మ. బి), 9-0 ఆం వా, 9-15 ఉ వా, 9-30 నాటిక (వి బి), 9-45 సుగమ్ సంగీత్, 10-0 సాగర్ సోదరులు, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

హైదరాబాద్ - బి

49 02 మీ (6120 కిలోసై)

ఉదయం 6-30 హై ఎ వలె, 7-45 ప్రసార సమాప్తి

ప్రసారము I (తరువాయి)

8-0 హై ఎ. వలె, 8-45 ప్రసార సమాప్తి

40 02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం 11-40 హై ఎ వలె 12-10 [illegible], 12-30 హై ఎ. వలె, 1-0 రేడియో సంగీత గోష్ఠి, 1-30 హై ఎ వలె, 2-0 జయలక్ష్మి సంతానం, 2-30 ప్రసార సమాప్తి

60 12 మీ (4920 కిలోసై)

6-0 హై ఎ వలె, 6-15 గ్రామస్థులకు, 7-0 తె వా, 7-15 గ్రామస్థులకు, 7-30 హై ఎ వలె, 9 0 ఆం వా, 9-15 నృత్యసంగీతం (వి బి); 9-30 హై ఎ. వలె, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

మద్రాస్ - బి

211 3 మీ (1420 కిలోసై)

49 80 మీ (6035 కిలోసై)

ఉదయం 6 45 మంగళ గానం; 7-0 త. వా 7-15 సంగీత మంజరి, 7-30 అభిరామి అందాది: ధర్మపురం స్వామినాథన్, 8-0 ఆం వా, 8-15 ప్రసార సమాప్తి

మధ్యాహ్నం 12-00 కార్మికుల కార్యక్రమం (తమిళం)[మ.బి],12-30 ప్రసార సమాప్తి,

1-0 మాదర్ నిగళ్చి - స్త్రీలకు (తమిళం) 1-30 ఆం వా, 1-40 గీతమంజరి, 1-50 త వా, 2-0 మధుర గీతం, 2-10 ప్రసార సమాప్తి

211 3 మీ (1420 కిలోసై)

సాయంత్రం 5-30 పాశ్చాత్య సంగీతం, 5-50 స్థానిక ప్రకటనలు, (ఆంగ్లము), 6-0 ఆం. వా, 6-5 మ ఎ వలె, 6-15 కార్యక్రమ వివరణ (తమిళం), 6-20 పి రంగస్వామి, 7-0 త. వా, 7-15 సంగీతమాల, 7-30 మ. ఎ వలె, 9-0 ఆం వా, 9-15 ఆంగ్ల ప్రసంగం, 9-30 పాశ్చాత్య సంగీతం, 10-30 ప్రసార సమాప్తి

'కరువు పనులను కంట్రాక్టు కివ్వలేదు'

అనంతపురం జిల్లా కలెక్టర్ ప్రకటన: రెవిన్యూబోర్డు సభ్యులిచే పనుల పరిశీలన

అసలు కరువే లేదన్నట్లు కేంద్ర ప్రభుత్వ, రైల్వేశాఖల నిర్లక్ష్య వైఖరి

(విశాలాంధ్ర విలేకరి)

అనంతపురం, డిసెంబరు 17

కరువు పనులను కంట్రాక్టర్లకివ్వటం లేదనీ, పబ్లిక్ వర్క్సు శాఖ ద్వారా పని చేయిస్తున్నామనీ, కూలీలకు రోజుకు రూపాయి కంటే ఎక్కువ తక్కువకూలి గిట్టటంలేదనీ పత్రికావిలేకరుల గోష్ఠిలో అనంతపురం జిల్లా కలెక్టర్ శ్రీ టి బాలకృష్ణన్ గారు నేడు విశదం చేశారు.

తమ ప్రకటనలో కలెక్టర్ క్రింది విషయాలను తెలిపారు

"నిన్న రెవిన్యూబోర్డు మెంబరు శ్రీ యం టి రాజుగారు వచ్చిన సందర్భములో కరువుపనులు జరుగుచున్న వివిధ కేంద్రాలను చూచినాము ప్రతికేంద్రములోను సరాసరి రూపాయి పొందలేకొని రెండు రూపాయల వరకు కూలిగిట్టుతున్నది. స్త్రీలు, పురుషులు, కొందరు పిల్లలు కూడా పనిచేస్తున్నారు. రూపాయికి తక్కువకూలి యే కేంద్రములోను లేదు. ఏదీ కూడా ఎక్కడకూడా కరువుపనులు కంట్రాక్టర్లకు యివ్వడంలేదు. పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటు ద్వారానే చేయిస్తున్నాము. పబ్లిక్ వర్క్సు, రెవిన్యూశాఖలు రెండూ సహకరించి పనిచేస్తున్నాయి. వారానికి ఒక్కసారి కూలిబట్వాడా చేస్తున్నారు. కరువు కేంద్రాలలోనే చౌకడిపోల్లో ధాన్యంఅమ్ముతున్నాము. జొన్నలు రూపాయికి 1¾ సేర్లు అమ్ముతున్నాము. పాలపొడి ఉచితంగా పిల్లలకు సప్లయి చేస్తున్నాము.

పనిముట్లు డిపార్టుమెంటు ద్వారా యిస్తున్నాము. అయితే, అవి మొండి బారటంవల్ల కూలి తగినంతగా గిట్టడం లేదని తెలిసింది. అందువల్ల రిపేరి ఖర్చులకని కొంత మొత్తము మంజూరు చేశాము. రానురానుయింకా యెక్కువగా గిట్టుబాటు కావచ్చును.

ఇంతవరకు తుంగభద్ర ఎగువ కాలువ పనులకే ప్రాముఖ్యత యిస్తున్నాము. దాదాపు అయిదు వేలమంది పనిచేస్తున్నారు. సంక్రాంతి పోయిన తర్వాత ఇరవై వేలమందికి పెరగవచ్చునని అనుకుంటున్నాము.

జిల్లాలో మొత్తం ఇప్పుడు 291 చౌక ధాన్యండిపోలున్నవి. వాటిని 350 వరకు పెంచాలనుకున్నాము. అయితే రైల్వే వ్యాగనుల యిబ్బందివల్ల స్టాకు రావడం లేదు. ఇప్పుడు తాత్కాలికంగా గుంతకల్లు స్టోరు నుంచి 200 టన్నుల ధాన్యం తెప్పించాము. ఇంతలోనే 1000 టన్నుల ధాన్యం మద్రాసునుంచి వస్తున్నది.

1962 మార్చి వరకు పదివేల టన్నుల ధాన్యం అవసరమౌతుందని అంచనా వేసి, ఆ మేరకు ఇండెంటు వేశాము. మునిసిపల్ పట్టణాలలో మాత్రము మూడో వంతు ధాన్యం గోధుమలు తప్పనిసరిగా తీసుకోవలసి వుంటుంది.

ప్రభుత్వంవారు కరువు పనులకు గాను రు 10 లక్షలు, తర్వాత రు 7½ లక్షలు యిచ్చారు. ఇంతవరకు అంటే, ఈ ఏప్రిల్ నుంచి మంజూరు అయిన మొత్తాలు:

రోడ్డు పనులకు రు 9 50 లక్షలు, బావుల సబ్సిడీలకు 7 50 లక్షలు, మైనర్ ఇర్రిగేషను పనులకు 1 25 లక్షలు, తక్కావి అప్పులకు 8 లక్షలు, పశువుల మేతకు అప్పులు 50 వేలు, కండగడ్డికి 50 వేలు, మంచినీళ్ల బావులు లోతు చేయడానికి 70 వేలు, సంరక్షణ పనులకు 25 వేలు

గడ్డి నల్లమల అడవులనుంచి యింకా రాలేదు. గడ్డి అప్పులిప్పుడేయిస్తే దుర్వినియోగమౌతుందని యివ్వడం లేదు. గడ్డి దిగినవెంటనే అప్పులిచ్చి కొనుక్కొనునట్లు చేయడంమంచిది. జీవనభృతిఅప్పులు అవసర పరిస్థితులు వచ్చినప్పుడు యివ్వాలని అనుకున్నాము. దేనికి యిచ్చినడబ్బు దానికి ఉపయోగపడేటట్లు చూడడం అవసరం. బావుల సబ్సిడీతో ప్రభుత్వానికి చేరగా సంబంధములేని సమితులకు, జిల్లాపరిషత్తులకు కేటాయింపు చేశాము.

15 రోజులకు ఒకసారి పరిస్థితులను గురించి రిపోర్టు అందుకుంటున్నాను"

విలేకరులకు సంగతులు తెలియపరచుటకు నెలకు ఒకటి రెండుసార్లు సమావేశం జరుపుతామన్నారు.

కమలానగర్‌లోని చౌకధాన్యండిపో వద్ద రద్దీగల్ల ఒక ముసలి, ఒక గర్భిణీ స్త్రీ మూర్ఛపోవడం గుర్తుకు తీసుకుంగా పోలీసు సహాయముతో క్యూ ఏర్పాటుచేసి క్యూ పద్ధతిని అనుసరిస్తున్నారు.

ఖమ్మం విద్యార్థులు కరువునివారణకు గాను వసూలుచేసిన డబ్బు రు 290 నిం చేరిందనీ, ఆ డబ్బు గుడ్డలకు ఉపయోగిస్తామనీ తెలిపి, కలెక్టర్ కృతజ్ఞతను ప్రకటించారు.

ప్రభుత్వం ముఖ్యంగా కేంద్ర రైల్వే శాఖవారు సహకారం చూపడంలేదని తెలుస్తూవుంది. కేంద్ర ప్రభుత్వం ఇక్కడ కరువున్నదన్న స్థితిని గుర్తించలేదని తెలుస్తూవుంది.

మెదక్ జిల్లా సిద్ధిపేట పంచాయతీ సమితికి డిసెంబరు 23వ ప్రారంభోత్సవం జరుగుతుంది.

బజారు ధరలు

విజయవాడ, డిసెంబరు 20

(మధ్యాహ్నం గం. 1 వరకు)

బంగారం		
మేలిమి పొట్లా10 గ్రాములు		122 00
మాసు ,,		122 00
నవరసు 8 గ్రాములు		100 50
వెండి: 1 కిలోగ్రాం		207 00
10 గ్రాములు		2 15
ధాన్యం		
24 నెంబరు (75 కి)		38 00
సంకరన్నాలు		31 50
అక్కుళ్లు		29 00
అక్కుళ్ళు (కొత్తవి)		24 00
బియ్యం		
24 నెంబరు (75 కి)		74 00
సంకరన్నాలు		66 00
అక్కుళ్ళు	60/-	62 00
అక్కుళ్ళు (కొత్తవి)		55 00
అపరాలు		
మినుములు (100 కి)		67 00
కందులు (100 కి)	85-/	86 00
పచ్చ పెసలు 280		45 00
సెనగలు ([illegible]) 928		48 50
ధనియాలు (408)	26/-	27 00
ఉలవలు (100 కి)		37 50
,, కొత్తవి		38 50
ఆముదాలు (75కి)		51 50
పంచదార (ఉయ్యూరు)		104 50
కొబ్బరినూనె డబ్బా 1½ మ		41 00
బెల్లం 10 కి	9 00	9 87
బెల్లం 11.20 కి.	8 25	5 25
మిర్చి 10కి	12/-	22 50
నీరుల్లి	1 88	2 25
చింతపండు (10కి)	8 50	11 00
నువ్వులనూనె ,, కు.		26 00
వేరుశనగపప్పు ఎగుమతి [illegible]		76 25
కోదాడ		77 00
వేరుశనగనూనె 10 కి		18 45
[illegible] 10 కిలోగ్రాములు		24 75
కొబ్బరికాయలు 1000	210/-,	248
సంచులు 100		181 05
[illegible]		122 00
కట్టెలు 2 వ నంబరు		12 00
3 వ నంబరు		16 00

తాడేపల్లి పింగాణీ కంపెనీ మూసివేత?

డిసెంబరు 26 లోపున బొగ్గు సప్లయికాకపోతే సంభవమని మేనేజిమెంటుచే నోటీస్ జారీ

తాడేపల్లిగూడెం, డిసెంబరు 19

డిసెంబరు 26వ తేదీలోపల తగినంత బొగ్గుసప్లయి కాకపోతే తాడేపల్లి పింగాణీ కంపెనీ మూసివేయబడుతుందని ఫ్యాక్టరీ మేనేజిమెంటు నోటీసు జారీచేసింది. అందువల్ల ప్రభుత్వం వెంటనే తగినంత బొగ్గును సప్లయి చేయాలని కోరుతూ కంపెనీ వర్కర్సుయూనియన్ వార్షికోత్సవ సభలో తీర్మానించారు.

లోగడ ఈ కారణంగా చాల సందర్భాలలో కంపెనీ మూసివేయబడింది.

గుంటూరు జిల్లా తాడేపల్లి పింగాణీ కంపెనీ వర్కర్సు యూనియన్ వార్షికోత్సవం మొన్న జరిగింది. కార్యదర్శి శ్రీ ఎ. శివరామకృష్ణయ్యగారు యూనియన్ కార్యకలాపాలను, కంపెనీ వారికి,యూనియన్‌కూ జరిగిన చర్చలను వివరించిన తర్వాత నూతన సంవత్సరమునకు శ్రీ ఎస్ వి రంగారావు అధ్యక్షులుగా కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

కార్మిక సాంఘిక భీమా పథకాన్ని యిక్కడి కార్మికులకు వర్తింపచేయాలనీ, గతంలో యింక్రిమెంటు యివ్వని వారికి సంవత్సరము సర్వీసు అయిన వారికి యింక్రిమెంట్సు యివ్వాలనీ, మేనేజిమెంటు యూనియన్‌ను గుర్తించాలని కూడా తీర్మానాలు చేశారు. (వి. వి.)

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ అక్రమ నిబంధనలకు వ్యతిరేకంగా సమ్మెచేస్తూ ఊరేగింపు జరుపుకొంటున్న కావలి కళాశాల విద్యార్థులు

మానుకోటలో స్త్రీల ఊరేగింపు

మంత్రి శ్రీ రామచంద్రారెడ్డిని ఓడించాలని నినాదాలు

మానుకోట, డిసెంబరు 18

వరంగల్ జిల్లా మానుకోట పట్టణంలో ఈనెల 17వ తేదీన వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యాన ఎన్నికల ఊరేగింపు జరిగింది. ఊరేగింపులో దాదాపు 200 మంది పాల్గొన్నారు.

ఇందులో 120 మంది స్త్రీలు - తతిమ్మావారు పురుషులు.

స్త్రీలు గంపలు నెత్తిన పెట్టుకొని, ప్రదర్శనలో పాల్గొన్నారు. కనీస వ్యవసాయ కార్మికుల కోర్కెలను తీర్చలేని మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డిగారిని ఓడించాలని నగర ప్రధాన వీధులలో ఊరేగింపుగా వెళ్లి నినాదాలు యిచ్చారు. వీరితోపాటు పురుష వ్యవసాయ కార్మికులు కూడా ఊరేగింపులో పాల్గొని నినాదాలు యిచ్చారు.

స్త్రీల ఊరేగింపుకు శ్రీమతి వద్దిరాజు [illegible] గారు నాయకత్వం వహించారు. వారితోపాటు శ్రీ యుతులు అకారపు కట్టమల్లు, వద్ది తిరపతయ్య గార్లు కూడా వున్నారు.

పలుచోట్ల బహిరంగ సభలు

మానుకోట తాలూకా జేరడ గ్రామంలో ఈనెల 15వ తేదీ శ్రీ కూన్మాన రామయ్యగారి అధ్యక్షతన ఎన్నికల బహిరంగసభ జరిగింది. సభకు రెండు వేలమంది ప్రజలు వచ్చారు. శ్రీ కొండపల్లి లక్ష్మణరావు గారు తాలూకాలో కాంగ్రెసువారు చేస్తున్న దురాగతాలను వివరించారు. తర్వాత శ్రీ జన్నారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డిగార్లు ఉపన్యసిస్తూ గత ఎన్నికల్లో శ్రీ నూకల రామచంద్రారెడ్డిగారు గెలవడానికి సంపూర్ణ సహకారమిచ్చామని, ఎన్నికల తర్వాత ప్రజలను మరచి కొంతమంది స్వార్థపరులను వెంట తీసుకున్నాడని, అక్రమాలు జరుపుతుండడం సహించలేక గత 4 సంవత్సరాలనుండి మేము ప్రజల పక్షాలనుండి సేవచేస్తున్నామన్నారు. ఈసారి యెన్నికల్లో మంత్రి రామచంద్రారెడ్డిని వోడించి, స్వతంత్ర అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మహబూబాబాద్ శాఖ కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ యం వెంకటమల్లుగారు స్వతంత్ర అభ్యర్థిని కమ్యూనిస్టుపార్టీ యెందుకు బలపరుస్తుందో వివరించారు.

ఆర్ సత్యంగారుకూడా మాట్లాడారు.

సభకుపూర్వం శ్రీ మదన్‌మోహన్ రెడ్డి, శ్రీ జనార్ధన్ రెడ్డి, శ్రీ నూకల నర్సింహారెడ్డిగార్లను జీపులో ఊరేగించారు.

సభానంతరం 'గరిక' దళంవారు పల్నాటియుద్ధం బుర్రకథ చెప్పారు.

యశ్వారరం గ్రామంలో ఈనెల 8వ తేదీన యెన్నికల సభ జరిగింది సభకు శ్రీ సీతారాంరావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ జె మదన్‌మోహన్ రెడ్డి, శ్రీ జనార్ధన్‌రెడ్డి (స్వతంత్ర అభ్యర్థి), శ్రీ కొండపల్లి లక్ష్మణరావు, శ్రీ ఆర్ సత్యంగార్లు ఉపన్యసిస్తూ మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డిగారిని ఓడించాలని విజ్ఞప్తి చేశారు

మానుకోట తాలూకాలో రామచంద్రారెడ్డిగారు గెలిచిన తర్వాత దౌర్జన్యాలు, హత్యలు, లూటీలు యేవిధంగా పెరిగాయో వివరించారు.

తర్వాత శ్రీ కొండపల్లి గోపాల్‌రావుగారు మాట్లాడుతూ 20 సంవత్సరాలనుండి కమ్యూనిస్టు పార్టీ ప్రజల ముందుండి యేవిధంగా పని చేస్తుందో వివరించారు. పార్లమెంటుకు శ్రీ తీగల సత్యనారాయణరావుగారిని గెలిపించాలని కోరారు.

తర్వాత గుంటూరు దళంవారిచే పల్నాటియుద్ధం బుర్రకథ చెప్పబడింది.

ఈనెల 17వ తేదీన బూర్గంపాడు, గొల్లగూడెం, [illegible]గూడెం గ్రామాల్లో గ్రూపుమీటింగులు జరిగాయి. వందలసంఖ్యలో ప్రజలుపాల్గొన్నారు. శ్రీ మదన్ మోహన్ రెడ్డి, శ్రీ కొండపల్లి గోపాలరావు, శ్రీ జె జనార్ధన్ రెడ్డిగార్లు ఉపన్యసించారు.

తాళ్ళపూసపల్లిలో ఈనెల 17వ తేదీన బహిరంగసభ జరిగింది. శ్రీ రావుల రంగారెడ్డిగారు అధ్యక్షత వహించారు. శ్రీ కొండపల్లి గోపాల్‌రావుగారు ఉపన్యసిస్తూ, తాలూకాలో వున్న 30 వేల ఎకరాల బంజరును పంచడానికి ప్రభుత్వం నిరాకరిస్తున్నదనీ, లేనిపోని కారణాలతో ఆలస్యం చేస్తున్నదని విమర్శించారు. శ్రీ జన్నారెడ్డి, మదన్‌మోహన్ రెడ్డిగారుకూడా ఉపన్యసించారు.

శ్రీ జె జనార్ధనరెడ్డి (డోర్నకల్లు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి) గారు మాట్లాడుతూ, శ్రీ నూకల రామచంద్రారెడ్డిగారు కాంగ్రెస్ సంస్థకు పెద్ద ద్రోహం చేశాడని అన్నారు.

శ్రీ కొండపల్లి లక్ష్మణరావు గారు, శ్రీ పులి సంజీవరావుగారుకూడా రామచంద్రారెడ్డి చేసిన [illegible] బట్టబయలు చేస్తూ మాట్లాడారు.

సభానంతరం గుంటూరు జిల్లా బృందంవారిచే పల్నాటియుద్ధం బుర్రకథ చెప్పబడింది.

ఈనెల 12వ తేదీన డోర్నకల్ నియోజకవర్గంలో పెర్మాళ్ళ సంకీస గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి మరియు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన గొప్ప ఊరేగింపు జరిగింది. బండిపై శ్రీ జన్నారెడ్డి, జనార్ధన రెడ్డి (స్వతంత్ర అభ్యర్థి), శ్రీ జన్నారెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీ కొండపల్లి గోపాలరావు (చిల్లంచర్ల నియోజకవర్గ కమ్యూనిస్టు అభ్యర్థి) ఆసీనులైనారు. బండికి ఇరువైపుల ఎడ్లనుకట్టారు. శ్రీ జనార్ధన్ రెడ్డి గారికే మన ఓటు, శ్రీ తీగల సత్యనారాయణరావుగారికే మన ఓటు అనే నినాదాలు ఇచ్చారు. ఊరేగింపులో 500 మంది పాల్గొన్నారు.

రాత్రి జరిగిన సభకు శ్రీ నూకల నర్సింహారెడ్డి (రామచంద్రారెడ్డి సోదరుడు) అధ్యక్షత వహించారు. 8 వేల మంది సభకు వచ్చారు. సభలో శ్రీ కొండపల్లి లక్ష్మణ్ రావు, శ్రీ జన్నారెడ్డి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీ మానవతి వెంకటమల్లు, శ్రీ కొండపల్లి గోపాలరావు (చిల్లంచర్ల నియోజకవర్గ కమ్యూనిస్టు అభ్యర్థి) గార్లు ఉపన్యసించారు.

విశాఖజిల్లా ఉపాధ్యాయ సంఘవిస్తృతసమావేశం

అనకాపల్లి, డిసెంబరు18

విశాఖజిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ విస్తృత సమావేశం ఈనెల 10వ తేదీన అనకాపల్లి బార్జి ఎలిమెంటరీ స్కూలు భవనంలో శ్రీ ఎ నీలకంఠం గారి అధ్యక్షతను జరిగింది. కార్యకర్తలు, శాఖ యూనియన్ల అధ్యక్ష, కార్యదర్శులు సుమారు 50 మంది హాజరయ్యారు. ఉపాధ్యాయ ప్రెస్ నిధికి జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుని నుండి విరాళములు వసూలు చేయుటకు నిర్ణయం తీసుకొన్నారు.

ఈ జిల్లాలోని స్పెషల్ ఎలిమెంటరీ ఉపాధ్యాయులకు ప్రభుత్వంమంజూరు చేసిన పెయిస్కేల్, రివైజ్డు స్కేల్సుతో కలిపి నిర్ణయించనందుకు విచారం వ్యక్తపరుస్తూ వెంటనే సమితి, పరిషత్ విద్యాశాఖాధికారులు ఈ పెయిస్కేలుని 1-11-58 నుండి మంజూరు చేయవలసిందిగా కోరుతూ తీర్మానించారు. కరువు భత్యాన్ని జీతంలో పూర్తిగా కలపాలనీ, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డ్యూటీ అలవెన్సును, ప్రావేటుకు పూర్తిచేసిన ఉపాధ్యాయులకు ప్రావిడెంటుఫండును కట్టుకొనుటకు వెంటవెంటనే ఆర్డర్లు జారీచేయవలసినదిగా కూడా కోరారు.

విజయవాడ విశేషాలు

కమ్యూనిస్టు సమితి విస్తృత సమావేశం

విజయవాడ, డిసెంబరు 18

నిన్న ఉదయం 10 గంటలకు విజయవాడ పట్టణ కమ్యూనిస్టుసమితి విస్తృత సమావేశం జరిగింది. ముఖ్య కార్యకర్తలు 100 మందిహాజరయినారు. యీ సమావేశానికి శ్రీ సుంకర సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు

విజయవాడ దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గం విషయం, రానున్న మునిసిపల్ ఎన్నికల విషయం దీర్ఘంగా చర్చించారు. దక్షిణ నియోజకవర్గం గురించిన ఒక సిఫార్సును రాష్ట్ర కార్యవర్గ ఆమోదంకొరకు పంపించారు.

రానున్న అసెంబ్లీ, పార్లమెంటు మునిసిపల్ ఎన్నికలు, 1962 సంవత్సరానికి పట్టణకమిటీ సాధారణ నిర్వహణకుగాను మొత్తం రు 20,000 లు నిధి వసూలు చేయాలని సమావేశం ఆమోదించింది. సమావేశంలో కొన్ని వార్డులు, బ్రాంచి కమిటీల తరపున కోటాలు తీసుకోనగా, దాదాపు రు 11,000 లు వరకు వసూలు చేయగలమని వాగ్దానాలు చేసినారు. మిగతా కొన్ని వార్డులు తమ బ్రాంచి జనరల్ బాడీ సమావేశాలు వెంటనే జరిపి, తమ కోటాలు నిర్ణయించగలమని తెలియజేసినారు.

నిధి వసూళ్ళు 1962 జనవరి 1నుండి ప్రారంభించి, ఫిబ్రవరి 28 తో పూర్తి చేయాలని ఆనాటికి హెచ్చుమంది వసూలుచేసిన బ్రాంచికి, హెచ్చు మొత్తం వసూలుచేసిన బ్రాంచికి బహుమతులు యివ్వాలనికూడా నిర్ణయించారు (వి వి)

నాల్గవవార్డు యువజన సంఘం

విజయవాడ, డిసెంబరు 17

విజయవాడ కొత్తపేట నాల్గవవార్డు యువకులు నేడు సమావేశమై గురజాడ మిత్రబృందం పేరిట యువజన సంఘాన్ని స్థాపించుకొన్నారు.

స్థానిక నాయకులు శ్రీ గొట్టిపాటి కొండలరావుగారిచే ఉ॥ 9 గం జండా ప్రతిష్ఠాపన జరిగింది. శ్రీ సూర్యనారాయణ, వై. బి. వెంకట్రాజు గార్లు యువజనసంఘ ఆశయాలను గురించి ప్రసంగించారు. శ్రీ సాది అప్పారావు అధ్యక్షులుగా కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

నీటికొరత అధికంగా యున్నదిగాన మునిసిపల్ వాటరువర్క్సు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజలకు నీటి వసతి కలిగించాలని కోరారు

కేరళ కర్షకసంఘ ఉద్యమాన్ని [illegible] ముఖ్యమంత్రి తానుపిళ్ళై, హోం మంత్రి చాకోల అక్రమచర్యలను నిరసించారు

సీతానగరం వర్కుషాప్ కార్మికుల వర్గీకరణ

విజయవాడ, డిసెంబరు 15

ఆంధ్ర పి డబ్ల్యు డి వర్కర్సుయూనియన్ సీతానగరం బ్రాంచి సర్వసభ్య సమావేశం నిన్న సీతానగరంలో వర్కుషాపు వద్ద శ్రీ ఎ కోటేశ్వరరావుగారి అధ్యక్షతను జరిగింది.

యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ బూరాడ సీతారామయ్యగారు యీనెల 7, 8 తేదీలలో కార్మిక సమస్యలపై హైద్రాబాద్‌లో పి డబ్ల్యు డి శాఖ కార్యదర్శులతోను, పి డబ్ల్యు డి ఛీఫ్ ఇంజనీరుతోను జరిపినసంప్రదింపుల వివరాలను త్రైపాక్షిక సమావేశంలో అంగీకరించిన విధంగా 1-4-54 నుండి 31-3-1959 లో చేరిన వారందరినీ ప్రొవిన్షియలైజ్ చేయాలని, వర్కుషాపులో డిసెంబరు నెలాఖరులోగా వర్గీకరణను పూర్తి చేయాలని, యం. ఆర్ పనివారలకు క్రొత్త జీతాలను అమలు జరపాలని, 240 రోజులు సర్వీసున్న యన్ ఎం ఆర్ పనివారలను జి యం ఆర్ గా మార్చాలని, మున్నగు తీర్మానాలు చేశారు

ఈ సమస్యలపై అధికారులు ఒక నెలలోపు సరైన చర్యలు తీసుకోనిచో లేనిపక్షములో ఉద్యమం ద్వారాపరిష్కారానికి చర్యలు తీసుకొనుటకు కార్యవర్గానికి అధికారమిచ్చారు

మునిసిపల్ టీచర్సు యూనియన్ నిర్ణయాలు

విజయవాడ, డిసెంబరు 15

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్సు యూనియన్ కార్యవర్గ అత్యవసర సమావేశం యూనియన్ అధ్యక్షులు శ్రీ బి వి చంద్రమౌళి గారి అధ్యక్షతను 10వ తేదీన యిక్కడ జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ శంకర కృష్ణమూర్తి గతనెలలో విజయవాడలో జరిగిన 8 రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సంయుక్తసమావేశనిర్ణయాలను, ఈనెల మొదటివారములో ప్రభుత్వంవద్దకు వెళ్ళిన సంయుక్త రాయబార ఫలితములను నివేదించారు.

జీతంతో కరువుభత్యం పూర్తిగా కలపాలన్న, పెరిగిపోయిన జీవనప్రమాణాన్నిబట్టి, అదనంగా కరువుభత్యాన్ని మంజూరుచేయాలన్న ఉపాధ్యాయుల వాంఛలనుకార్యవర్గంపునరుద్ఘాటించింది. ఈ సందర్భంలో 8 రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సంయుక్తసమావేశం నియమించిన సంయుక్త కార్యాచరణ సంఘ కార్యక్రమములో పాల్గొనవలసినదిగా మున్సిపల్ టీచర్లకు విజ్ఞప్తి చేస్తూ, మరొక తీర్మానం చేశారు. జీతాల సమస్య విషయంలో ఎప్పటికప్పుడు తగిననిర్ణయాలు తీసుకొనుటకు ఒక ఉపసంఘాన్ని కూడా వేశారు.

సంగీత పోటీలు

విజయవాడ, డిసెంబరు 18

"బాలభారతి"లో జనవరి 26వ తేదీన 6-16 సంవత్సరాలమధ్య బాల బాలికలకు, శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ వాద్యసంగీతం, లలితసంగీతం, కవితలలో పోటీలు నిర్వహిస్తారు. వివరములకు "కార్యదర్శి, బాలభారతి, అరండల్ పేట-విజయవాడ-2"కు వ్రాయవలెను.

లేఖలు

అశ్వారావుపేట సబ్‌యిన్‌స్పెక్టర్ దౌర్జన్యాలు

ఆర్యా,

ఖమ్మంజిల్లా అశ్వారావుపేట సబ్‌యిన్‌స్పెక్టర్ గుమ్మడవల్లి గ్రామంలో ఈనెల 12వ తేదీన క్యాంపు వెళ్లాడు. అచ్చటనుండి తిరిగి స్టేషనుకు చేరుకొందుకుగాను వెట్టికి బండి కావాలని, వరికళ్ళంలో ధాన్యం నూర్పించుకొంటున్న సాదం బొత్తయ్య యెడ్లను తోలుకు రమ్మనితలార్లనుపంపించాడు. బొత్తయ్య అంతకుముందే కష్టించిన ఎడ్లను మేత కొరకు పచ్చికబీడులో వదలివేశాడు. చెప్పకుండానే ఆ ఎద్దులను తోలుకొనివచ్చి బండికి కట్టుచుండగా బొత్తయ్య పరుగెత్తుకొనివచ్చి తాను కళ్ళంలో ధాన్యం యింటికి తోలుకు పోవాలనీ, మొన్ననే అశ్వారావుపేట జంగ్లాతువాళ్ళకు వెట్టికిబండికట్టినాననీ, యీదఫా మరొకరిని అడిగి తీసుకొని వెళ్ళవలసినదని కోరాడు

ఇందుకై సబ్‌ఇన్‌స్పెక్టరు బొత్తయ్యను బూటుకాలితొట్టుతూ రూళ్ళకర్రతో ఎడమ కంటి క్రింది రెప్ప సమీపంలో దారుణముగా కొట్టాడు. కంటికి తీవ్రమైన గాయంతగిలింది. డాక్టర్లు బలమైన గాయం తగిలిందని, కంటిమీదపు దెబ్బతినే ప్రమాదముందన్నారు. ఈ కేసు కొత్తగూడెం డి ఎస్ పి గారు విచారిస్తున్నట్లుగా తెలుస్తున్నది

వీరికిట్టి చర్యలు మామూలైనవి. ఇటీవల మందడపల్లి, అడపా చినవీరయ్య కేసు విషయంలో రామవరంలో ఇచ్చిన యింజక్షన్ ఆర్డరును ధిక్కరించి వీరయ్యగారి నాగళ్ళపైకి (తన మందడపల్లిలోని మకాం పెట్టి) తనప్రత్యర్థి ముఠాను ఎగద్రోలి బీభత్సం చేయించాడు. అదే విధంగా ముష్టిబండలో తనకుసంబంధం లేనిజోక్యంచేసుకొని ఆ గ్రామ పంచాయతీబోర్డు అధ్యక్షులైన శ్రీ రావి వీర వెంకయ్య గారిని తూలనాడినాడు. ఇదే గ్రామంలో మరొక గౌరవంగల వ్యక్తిని చేతులు కట్టుకొని తనముందు నిలబడని కారణంచేత యిష్టంవచ్చినట్లు తిట్టాడు. ఇవి మచ్చుకుమాత్రమే. అందుచేత యీ సబ్‌ఇన్‌స్పెక్టరును విచారించి చర్య తీసుకోవలసినదిగా పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తిచేస్తున్నాను

ఇట్లు,
రేగళ్ళ చెన్నారెడ్డి,
కార్యదర్శి, అశ్వారావుపేట బ్రాంచి
కమ్యూనిస్టు కమిటి, దమ్మపేట

మధ్యపెన్నార్ ప్రాజెక్టులో మంచినీళ్లు దొరకని స్థితి

ఆర్యా,

అనంతపురం జిల్లా మధ్యపెన్నార్ ప్రాజెక్టు లేబర్ కాలనీలో [illegible] నీరు దొరకక ఇబ్బందులకు లోనై కొందరు ఒక్కొక్కపూట ఆహారము చేయటములేదని పస్తులుంటున్నారు. కాలనీ సుమారు 2 ఫర్లాంగుల పొడవుగల ఫస్టు రోడ్డులో రెండు కొళాయిలున్నవి. రెండవ రోడ్డునందు 1 కొళాయి మాత్రమున్నది. మూడవ రోడ్డులో అసలే కొళాయిలేదు. ప్రస్తుతమున్న కొళాయిలలో నీరు ఉదయం 10 గంటలకు పైబడి వదిలి, 12 గంటలకు నిలుపుతారు. తిరిగి సాయంత్రము 7 గంటలకు వదిలి 8 గంటలకు నిలుపుతారు. కూలీలు ఉదయము పనికి యిచ్చట నుండి 7 గంటలకే వెళ్లవలయును గనుక వారికి నీరు అందుబాటు కాదు. కొందరు రాత్రి10 గంటలవరకు పనిచేసి తిరిగి యింటికిరాగా నీరులేక వంటమాని ఆ అకాలములో రాత్రివేళలో దుకాణముకువెళ్ళి పప్పులు బొరుగులు (మరమరాలు) తెచ్చుకొని తిని నీరు లేక అట్లే పరుండుచున్నారు. కాన ఆ బీదలపై పి డబ్ల్యు డి అధికారులు కరుణచూపి ప్రతిరోడ్డులోను మూడు లేక నాలుగు కొళాయిలు వేసి సకాలములోనీరు దొరుకునట్లుచూడ ప్రార్థన.

ఇట్లు, డాక్టర్ పి రామిరెడ్డి,
మధ్య పెన్నారు ప్రాజెక్టు పి. ఓ.

వెనుకబడిన కులముల స్కూలు ఫీజులు, తుగ్లక్ ఫర్మానాలు

ఆర్యా,

యస్ యస్ యల్ సి పరీక్ష రుసుమును నిమ్న జాతులు, వెనుకబడిన కులములు, క్రైస్తవులు వగైరా విద్యార్థుల నుండి పూర్తిగా వసూలు చేయకూడదనీ, వెనుకబడిన కులముల వారు ఆ రుసుము రూ 16/లు చెల్లించి, ప్రత్యేకముగా ఎగ్జంప్షన్ పూర్తి చేసి పంపుచో వాపసు యివ్వబడుతుందన్న ఆర్డర్లు అములులో ఉన్నాయి. 1962 మార్చి యస్. యస్ యల్ సి పరీక్షా రుసుము యీ నెల 10వ తేదీ లోపల, అది దాటితే 20 వ తేదీలోపల రు 2 రూ లు జరిమానాతో చెల్లించాలన్న ఆర్డర్లు అన్ని స్కూళ్ళకు వచ్చాయి. అలాగే [illegible] ముందుగా అంతా చెల్లించుచున్నారు. పరీక్ష రుసుం ఎగ్జంప్షన్ ఫారము డిసెంబరు 10వతేదీలోపల గ్రామాధికార్ల, గజెటెడ్ ఆఫీసర్ల సంతకాలు ముద్రలతో స్కూలు ద్వారా హైదరాబాదు సాంఘిక సంక్షేమశాఖా డైరెక్టరుకు పంపుకోవాలట! పరీక్ష రుసుము చెల్లింపుకు యేదో రూపములో డిసెంబరు 20 వ తేదీ వరకు గడువు ఫారాలు పూర్తిచేసి డిసెంబరు 10 కే పంపాలి. స్కూళ్లలో ఫీజు చెల్లించితేనే స్కూళ్ళవారు [illegible] తారు. ఆ ఫారాలైనా స్కూళ్ళవాళ్లలో సప్లయిలేదు సరిగదా, జిల్లాస్థాయి[illegible] (కలెక్టరాఫీసు) కూడాలేవు. కావలసినవారు హైదరాబాదుకువ్రాసి తెప్పించుకోవాలి. పరీక్ష రుసుము ఎగ్జంప్షన్ నోటీసు యిచ్చి - [illegible] తయారైంది పరీక్షలు మార్చి (1962)లో కనుక ఈ లోపునైనా ఆ ఫారాలు అన్ని స్కూళ్లకుపంపి, వాటిని పూర్తిచేసే అవకాశము గలుగచేయవలసిందిగా కోరుచున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ (సాంఘిక సంక్షేమ) తమ జి ఓ యం యస్ నం 3250/61 తేదీ 14-10-61 లో శెట్టిబలిజ, తెలగ, కాపు కులములను వెనుకబడిన కులములతో చేర్చినటుగా ప్రకటించియున్నది. ఈ ఆర్డరులోనే అన్ని శాఖల వారు విద్యావిషయము తెలియపరిచామన్నారు. విచారించగా యేస్కూలుకు యింతవరకు అలాంటి ఆర్డర్సు రాలేదని చెప్పుచున్నారు. ఆర్డర్సు చూపిస్తే అధికారయుతంగా రానిదే తామేమియు చేయలేమని చెప్పుచున్నారు. ఈ కులముల పేదవిద్యార్థులు యిప్పటికే నిండు జీతములతో నానా అవస్థలు పడుచున్నారు. వీరు నెల నిండు జీతాలు (డిసెంబరుతో) చెల్లించియున్నారు. వెంటనే అన్ని స్కూళ్ళకు ఆర్డర్లు పంపించగోరుచున్నాను

ఆస్తి వివరముల పత్రములో తగు ఆదాయములేదని నిరూపించుచున్న విద్యార్థినులకు కులముతో నిమిత్తము లేకుండా అర్ధజీతములు చేసినట్లుగానే, విద్యార్థులకుకూడా అలాంటి అవకాశము గలుగచేసి తమ విద్యుక్తధర్మమును నెరవేర్చవలసినదిగా ప్రభుత్వమును కోరుచున్నాను

ఇట్లు,
మంచాల నరసింహారావు,
కైకవరం.

యానాదుల గుడిసెల పీకివేత

మాచెర్ల, డిసెంబరు 18

గుంటూరుజిల్లా పల్నాడుతాలూకా గొట్టిపాళ్ల ఫారెస్టు(రిజర్వుడు నెం 2)లో పలనాడు, నర్సరావుపేట, వినుకొండ తాలూకాలకు చెందిన యానాదులు సుమారు 100 కుటుంబాలవారు గుడిసెలు వేసుకొని వుంటున్నారు. ఈ ప్రాంతమంతా (బుసజాలదుబ్బులు మినహా) చెట్లు పూర్తిగా లేవు. అటువంటిచోట ఒక పూరిగా గుడిసెలు వేసుకొని వుంటున్న వారిని 7 వ తేదీన ఫారెస్టు అధికారులు అసిస్టెంటు డి యఫ్ ఓ రేంజరు, ఇద్దరు ఫారెస్టు గార్డులు, [illegible] పోలీసులు వచ్చి ఏలాంటి నోటీసులు లేకుండా దౌర్జన్యంగా గుడిసెలు పీకివేశారు.

ఓట్లుకొనే పద్ధతికి ప్రతిఘటన పోరాటం

యువజనసంఘాలు సాగించాలని
చింతలపూడితాలూకా యువజన మహాసభలో
శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసంగం

కామవరపుకోట, డిసెంబరు 16

ఎన్నికల్లో ఓట్లుకొనే పద్ధతిని సాగనివ్వకుండా యువజన సంఘాలు కృషి చేయాలని గ్రామాల్లో యువజన సంఘాలు ముందు నిలచి ఏర్పరి, ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న వివిధ అభ్యర్థులను ఆహ్వానించి వారివారి ప్రణాళికలను, విధానాలను వివరించుట్లు ఏర్పాటు చేయడం మంచిదనీ, ఎన్నికల సందర్భంగా యువజనోద్యమం ఆశయాలు, ఆదర్శాల ప్రచారానికి కూడా కృషి చేయాలనీ చింతలపూడి తాలూకా యువజన మహాసభను ప్రారంభిస్తూ ప్రదేశ్ యువజనసమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణగారు వివరించారు

పశ్చిమ గోదావరిజిల్లా, చింతలపూడి తాలూకా యువజనోత్సవాలు, మహాసభ కామవరపుకోట గ్రామంలో ఈ నెల 15, 16 తేదీలలో జరిగాయి

16 వ తేదీన గార్లపాటి వెంకటేశ్వరరావుగారి అధ్యక్షతను ప్రతినిధుల సమావేశం జరిగింది వివిధ గ్రామాల నుండి 60 మంది పాల్గొన్నారు

తాలూకా యువజన సంఘాధ్యక్షులు శ్రీ కొనకళ్ల రామారావుగారు కార్యకలాపాలనివేదిక ప్రవేశపెట్టారు సుమారు చర్చలలో పాల్గొన్నారు జిల్లా యువజన సంఘాధ్యక్షులు శ్రీ యస్ జె సి భట్టాచార్యగారు కూడా మాట్లాడారు

శ్రీ సత్యనారాయణగారు తమ ప్రసంగంలో యిలా అన్నారు

"యువజనోద్యమం కేవలం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైనది కాదు, అది రాజకీయాలకు అతీతమైనదీ కాదు

ప్రపంచశాంతినీ, పలు విధాల నిర్మాణ యువజనసంఘం ఆశిస్తున్నది జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమాలను ఆచరణలో పెట్టేందుకు, సోషలిస్టు భావాల ప్రచారానికి, సాంఘిక అవలక్షణాల తొలగింపుకు, సుఖప్రదమైన భవిష్యత్తు అంగీకరించే యువజనులెవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా యువజన సంఘంలో చేరవచ్చు

ఎన్నికల వాతావరణం మన జాతీయ జీవితంలో ఎంతో ప్రాధాన్యత వహిస్తాయి కాబట్టి యువజన సంఘాలు, కార్యకర్తలు ప్రముఖపాత్ర వహించవలసివుంది కాని యువజన సంఘాలుగా, కార్యకర్తలుగా ఏదో ఒక పార్టీనో, అభ్యర్థినో బలపరచటం మాత్రం జరగదు

ఎన్నికల సందర్భంలో కుల, మత తత్వాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు, ఓట్లుకొనే పద్ధతి సాగకుండా చేయాలి

ఇప్పుడు మార్కింగు పద్ధతి అమలు జరుపబడుతున్నందున పొరపాటు పడకుండా నిరక్షరాస్యులైన మన వోటర్లను అందుకు తర్ఫీదు చేయాలి

ఈ రోజుల్లో వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా వోటర్లచైతన్యాన్ని పెంచాలి

సోషలిజం పట్ల వివిధ అభ్యర్థుల అభిప్రాయాలేమిటో స్పష్టంగా ప్రకటింపచేయాలి

మన విధాన ప్రకటనలో పేర్కొన్న విధంగా వర్ణాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించేందుకై అట్టి వివాహాలు చేసుకున్న వారికీ, వారి బిడ్డలకు విద్యా, ఉద్యోగ విషయాలలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించడానికి అందరి సుముఖత్వం పొందేందుకు కృషి చేయాలి"

తరువాత 18గురితో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు

శ్రీ కొనకళ్ళ రామారావు (అధ్యక్షులు), శ్రీ రావు రాధాకృష్ణమూర్తి (ఉపాధ్యక్షులు), శ్రీ ఏలూరి రంగారావు (కార్యదర్శి), శ్రీ పల్లాడి కనకసుందరం (సహాయ కార్యదర్శి), శ్రీ గార్లపాటి వెంకటేశ్వరరావు (కోశాధికారి) శ్రీయుతులు గుత్తా రాఘవులు, శ్రీరాముల కృష్ణమాచారి, అర్జునపు ఫుల్లారెడ్డి, అలవాల భక్తవత్సలరెడ్డి, ఆకుల సత్యనారాయణ, రామారావు, నల్లూరి సత్యనారాయణ, కల్లమోతుల కోటయ్య

తీర్మానాలు

కామవరపుకోటలో హైస్కూల్ మిడిల్ స్కూల్ చదువు చేసినతరువాత యితర గ్రామాలకు పంపి చదివించలేక ఇంటి ఆగవలసి వస్తున్నదనీ, కామవరపుకోట మిడిల్ స్కూల్ను హైస్కూల్ గా మార్చవలసినదిగా ప్రభుత్వాన్ని, హైస్కూలు భవన నిర్మాణం కోరుతూ తీర్మానించారు. కామవరపుకోటనుండి చింతలపూడి యున్నప్పుడు వర్షపు కాలవ్వకుండా మరో వేయవలసినదిగానూ, కామవరపుకోటలో ప్రయివేటు మరి సెంటును వెంటనే నెలకొల్పా 1951 నదీజలాల ఒడంబడికను తిరగదోడే వైఖరిని విరమిస్తూనూ సరిహద్దున్ని శ్రీ రాలు చేశారు

ఆరాత్రి శ్రీ కొనకళ్ళ రామారావు (అధ్యక్షులు చింతలపూడి తాలూకా యువజనసంఘం) గారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణగారు ఉపన్యసించిన తరువాత కామవరపుకోట పంచాయతీ సమితి ఆఫీసరు శ్రీ ఎం హెచ్ షరీఫ్, పశ్చిమగోదావరిజిల్లా యువజనసంఘ అధ్యక్షులు శ్రీ ఎస్. జె. సి భట్టాచార్యగార్లు మాట్లాడారు

అనంతరం శ్రీ ప్రసాద్ దళం (గుంటూరుజిల్లా) వారిచే బొబ్బిలి యుద్ధం బుర్రకథ చెప్పబడింది ఈ సభకు మూడువేలమంది వచ్చారు

ఈ సందర్భంలో సాంస్కృతిక, ఆటల పోటీలుకూడా నిర్వహించబడ్డవి చెడుగుడు విన్నర్సు టీంటర్స్ (లోగడ కూడె) విన్నర్సుగాను, శ్రీ సాయిబాబా మెమోరియల్స్ రన్నర్సుగాను వచ్చారు టగ్ ఆఫ్ వార్ లో విజయం శ్రీ టీము కాడిదర్ల, సైకిల్ స్లో లో బాలా సైకిల్ మెడలిస్టు శ్రీ ఎం రంగారావు, సైకిల్ స్పీడులో షేకు కాశింసాహెబ్ గార్లు గెల్చారు

వీరికి శ్రీ రాజా రాఘవరాజా సూర్యనారాయణగారు బహుమతులు పంచారు

నెల్లూరులో శ్రీ ఎ ఎస్. కె అయ్యంగార్ సభ

నెల్లూరు, డిసెంబరు 19

నెల్లూరు పట్టణంలో ఈ నెల 24 వ తేదీన పట్టణ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన గొప్ప బహిరంగ సభ జరుగుతుంది సభలో మద్రాసు కమ్యూనిస్టు నాయకులు శ్రీ ఎ యస్ కె అయ్యంగార్ ప్రసంగిస్తారు

ఏలూరులో మెడికల్ కాలేజీ

ఏలూరు, డిసెంబరు, 16

జిల్లా కేంద్ర స్థానమూ, విద్యా కేంద్రమూ, విన ఏలూరులో ఇంత వరకు మెడికల్ కాలేజీ లేకపోవడం విచారించదగ్గ విషయమనీ, ఆంధ్ర ప్రదేశ్ కు మెడికల్ కాలేజీ అవసరం దృష్ట్యానా, మెడికల్ కాలేజీకి కావలసిన పెద్ద హాస్పిటల్ మొదలగు సకల సదుపాయముల దృష్ట్యానూ, ఏలూరులో వెంటనే మెడికల్ కాలేజీ స్థాపించవలసినదిగా ప్రభుత్వాన్ని కోరుతూ పశ్చిమగోదావరిజిల్లావిద్యార్థి ఫెడరేషన్ కన్వీనింగ్ కమిటీ ఒక తీర్మానం చేసింది

ఈ సమావేశం జిల్లాకార్యాలయంలో శ్రీ లక్ష్మీనారాయణగారి అధ్యక్షతను 10 వ తేదీన జరిగింది

నందిగామ తాలూకా పెనుగంచిప్రోలు సమితిలోని గొల్లపూడి గ్రామములో కుట్టుశిక్షణా కేంద్రమును పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ సోమా సత్యనారాయణగారిచే 9 వ తేదీన ప్రారంభోత్సవము చేయబడినది

మూడు యూనివర్సిటీల విలీనీకరణ అసంభవము

విద్యార్థి ఫెడరేషన్ రాయబారవర్గానికి విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావు జవాబు

హైదరాబాద్, డిసెంబరు 19

ఆంధ్రప్రదేశ్ లోని మూడు విశ్వవిద్యాలయాలను విలీనంచేసి, ఒక దాన్ని అఫిలియేటింగ్ యూనివర్సిటీగాను, తక్కిన రెంటినీ రెసిడెన్షియల్ యూనివర్సిటీలుగాను వుంచాలన్నది అసంభవమని విద్యార్థి ఫెడరేషన్ రాయబారవర్గానికి విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు జవాబు చెప్పారు

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖా మంత్రి శ్రీ యస్ బి పి పట్టాభి రామారావుగారిని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధివర్గం ఇటీవల కలుసుకొన్నది ప్రతినిధివర్గంలో ప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ పి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీ జి వి నారాయణరావు, కార్యదర్శి శ్రీ సురేష్ బాబు, శ్రీ డి వి కె రామారావు, శ్రీ ఎ అప్పారావుగారలున్నారు

ఏలూరు విద్యాగోష్ఠిలో జరిగిన నిర్ణయాలను వివరిస్తూ దిగువ కోర్కెలతో కూడిన మెమొరాండాన్ని ప్రతినిధివర్గం మంత్రికి అందజేసింది

"ఆంధ్రప్రదేశ్ లోని మూడు విశ్వవిద్యాలయాలను సమైక్య పరచి, ఒకే విశ్వవిద్యాలయానికి తక్కిన రెంటినీ అనుబంధించాలి

మూడేండ్ల డిగ్రీ విద్యార్థులకు "జనరల్ ఎడ్యుకేషన్" పాఠ్యాంశాన్ని పరీక్షలనుండి తొలగించాలి

కోర్సుకు రెండు పరీక్షలు పనికిరావు డిగ్రీ కోర్సుల్లో ప్రతి సంవత్సరాంతాన యూనివర్సిటీ పరీక్ష నిర్వహించాలి నెలసరి పరీక్షలు పెట్టాలి

అన్ని స్థాయిల్లోనూ మాతృభాషలో విద్యాబోధన జరగాలి

గ్రూప్ పాఠ్యాంశాలలో విడివిడిగా హాజరై ప్యాసయ్యేందుకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అవకాశం కల్పించాలి ప్రీ-యూనివర్సిటీకి "హ్యూమన్ ఎచీవ్ మెంట్సు" పాఠ్యాంశాన్ని రద్దు చేయాలి

అవసరమైనచోట ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలి"

మంత్రి జవాబిస్తూ, మూడు విశ్వవిద్యాలయాల విలీనీకరణ అసంభవమన్నారు జనరల్ ఎడ్యుకేషన్ విషయమై వివిధ విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులను కలుసుకోవలసిందిగా ప్రతినిధి వర్గాన్ని కోరారు

కోర్సుకు రెండు పరీక్షలు పెట్టడం మంచిదేనని ఆయన వాదించారు కోర్సుకు ఒక పరీక్ష పెట్టినప్పుడు కొందరు తప్పారని, రెండు పరీక్షలు పెట్టినప్పుడే ప్యాసయ్యారని తన ఉదాహరణను మంత్రి చెప్పారు

బోధనా భాషగా ప్రాంతీయ భాషను ప్రవేశపెట్టడం క్రమేణా సాధ్యమనీ ఆయన జవాబిచ్చారు

హ్యూమన్ ఎచీవ్ మెంట్స్, గ్రూప్ పాఠ్యాంశాలకు విడివిడిగా హాజరయ్యే విషయంపైన ఆ ఉపాధ్యక్షులతో మాట్లాడవలసిందిగా కోరారు.

మంత్రి అల్లూరిపై బాల్యవివాహం కేసు
ఈ నెల 23 న కోర్టులో విచారణ

కాకినాడ, డిసెంబరు 18

అమలాపురం మేజిస్ట్రేటు కోర్టులో మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుపై శ్రీ కాకేటి మోహనరావుచే పెట్టబడిన బాల్య వివాహ కేసు తిరిగి విచారణకు వచ్చింది. ఫిర్యాది తరపున శ్రీ భూపతిరాజు లక్ష్మీనరసరాజు (బీమ్నారు) శ్రీ భూపతిరాజు సుబ్బ తాతరాజు (భీమవరం) గార్లు విచారించబడ్డారు. శ్రీ భూపతిరాజు సుబ్బతాతరాజు ముద్దాయిల తరపు తిరిగిపోయారని ప్రకటించబడి ఫిర్యాదిచే తిరిగి క్రాసు పరీక్ష చేయబడ్డారు శ్రీ అల్లూరి బాపినీడుగారి సాక్ష్యం ఫిర్యాది వదులుకున్నారు

ముద్దాయి లందరినీ ఈ నెల 14 న కోర్టులో విచారణకు హాజరు పెట్టవలసిందిగా కోర్టు ఉత్తరువు చేసింది మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజుగారు ఈ నెల 23 న కోర్టులో స్వయంగా హాజరుకాగలరని వారి ప్లీడరుద్వారా తెలియపరచినందున కేసు తిరిగి 23 వ తేదీకి వాయిదా పడింది

ఫిర్యాది తరఫున శ్రీ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యంగారున్నూ, ముద్దాయిల తరఫున శ్రీ పొలగుమ్మి సూర్యారావు వర్మగారలున్నూ హాజరయ్యారు

దాళ్వా పంటకు నీరు సప్లయి సమస్య

జిల్లేపల్లి, డిసెంబరు 14

రేపల్లె తాలూకా రైతులు కోదండరామన్న జిల్లేపల్లి కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు శ్రీ డి వి బుచ్చిరావుగారి అధ్యక్షతన సమావేశమై ఈ సంవత్సరం మొదటిపంట అన్ని ప్రాంతములలోను విపరీతముగా దెబ్బతిన్నదనీ, జిల్లా రైతులంతా దాళ్వాపంటమీద ఆశ పెట్టుకొని యున్నారనీ, కాని యింత వరకు అధికారులు దాళ్వా పంటకు నీరు ఇచ్చునదిలేనిదీ, తేల్చి చెప్పలేదనీ, ఈవిషయంలో అధికారులు వెంటనే ప్రకటన చేయాలని తీర్మానించారు

కృష్ణాజిల్లా యిరిగేషన్ బోర్డు ఆజిల్లాలో సుమారు ఒకలక్ష ఎకరముల దాళ్వా సాగుకు నీరు యివ్వనిశ్చయించినట్లు పత్రికాముఖమున తెలిసినందున గుంటూరు జిల్లాలోకూడా దాళ్వాకు నీరిప్పించాలని కోరారు

సువర్ణ ఘంటా కంకణ మురళీకృష్ణ బిరుదాంకితులు, రేడియో గాయకులు శ్రీ నిడమానూరు రంగయ్య (కొత్తకోట) గారికి, వారి శిష్యులకు కనిగిరి పౌరులు 10 వ తేదీన ఘన సన్మానం చేశారు.

విజయవాడ వించిపేటలో 7 12, 13, 14 వార్డుల యువజన మహాసభ జరిగిన సందర్భంలో హాజరైన యువజన నాయకులు, ప్రతిధులు

కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల ప్రచారసభలు

రామవరప్పాడు, డిసెంబరు 18

విజయవాడ తాలూకా రామవరప్పాడు గ్రామ కమ్యూనిస్టుశాఖ సమావేశం ఇటీవల జరిగింది కొత్తగా 12 మంది సభ్యులను చేర్చుకొన్నారు

శ్రీ కుర్మల కృష్ణారావు కార్యదర్శిగా కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు 11 మందితో ఎన్నికల కమిటీని ఎన్నుకొన్నారు ఆ కమిటీకి అధ్యక్షులుగా శ్రీ యేమినేని వెంకటేశ్వర్లు

గుంటూరులో పలుచోట్ల ఎన్నికల కమిటీలనియామకం

గుంటూరు, డిసెంబరు 19

ఈ నెల 10వ తేదీన గుంటూరులోని రేటుకూరురోడ్డు కొరిటిపాడులో పట్టణ పొగాకుసంఘపు మహిళా కార్మికుల సమావేశం జరిగింది 9 మంది సభ్యులుగల ఎన్నికల సంఘాన్ని యేర్పాటు చేసుకొన్నారు ఇంటింటికీ తిరిగి గుంటూరు 1, 2 నియోజక వర్గాలలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించవలసిందిగా కోరుతూ ప్రచారం చేయుటకు తీర్మానించారు

11 వ తేదీన రేటుకూరు రోడ్డులో పొగాకు కార్మిక మహిళల సమావేశం జరిగింది 11 మంది సభ్యులాంద్రతో ఎన్నికలసంఘం యేర్పాటు చేయబడింది

13వ తేదీన బ్రాడీపేటలో పొగాకు కార్మిక మహిళల సమావేశం జరిగింది అక్కడ 15 మంది సభ్యులాంద్రతో ఎన్నికల సంఘం యేర్పాటు చేయబడింది

14 వ తేదీన పొట్టి శ్రీరాములు నగర్ లో పొగాకు కార్మిక మహిళల సమావేశం జరిపి 11 మందితో ఎన్నికల సంఘం యేర్పరచారు

16 వ తేదీన చిన్నబజారులో శ్రీ ఫజిలుల్లా షాహెబుగారి అధ్యక్షతను బహిరంగసభ జరిగింది ఏడు ముఖ్య కేంద్రాలలో జెండా ప్రతిష్ఠాపనలు జరిగాయి శ్రీ ఫజిలుల్లా సాహెబుగారు అధ్యక్షులుగా ఒక ఎన్నికల సంఘం ఏర్పాటు చేయబడింది సభానంతరం పిల్లలకు మిఠాయి పంచిపెట్టబడింది ఎన్నికల కార్యాలయం కూడా తెరవబడింది

17 వ తేదీన పండరీపురంలో జెండా ప్రతిష్ఠాపన జరిగింది శ్రీ గోగినేని సూర్యనారాయణగారు మాట్లాడారు

బ్రాడీపేట, కొబ్బాకులపేటల్లో పార్టీ సభ్యుల, అభిమానుల సమావేశాలు జరిగాయి శ్రీ ఉత్తలూరి సుబ్బారావుగారు కార్యదర్శిగా 50 మంది సభ్యులతో ఎన్నికలసంఘం ఏర్పాటు చేయబడింది

బొంగరాలబీడులో కూడా ఎన్నికల కార్యాలయం తెరవబడింది

17వ తేదీన గుంటూరు 2 వ నియోజకవర్గంలోని కొర్నిపాడులో జెండా ప్రతిష్ఠాపన జరిగింది శ్రీ సుబ్రం కోటయ్య, అభ్యర్థి శ్రీ యడ్ల రామయ్య గార్లు మాట్లాడారు

సంగడిగుంటలోని ముస్లిం పేటలో శ్రీ ఫక్రుద్దీన్ సాహెబు గారు జెండా ప్రతిష్ఠాపన చేశారు

18 వ తేదీన రామిరెడ్డి తోటలో పట్టణ పొగాకు సంఘ కార్మికమహిళల సమావేశం జరిపి, 11 మంది సభ్యులాంద్రతో ఒక ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు ఎన్నికల కార్యాలయం కూడా తెరవబడింది

వార్డుకమిటీ మంగళవారి సమావేశంలో పట్టణ కార్మిక నాయకుడు శ్రీ కె. ఎం లింగంగారు మాట్లాడారు. (వి వి)

రాంపురంలో బహిరంగ సభ

సోంపేట, డిసెంబరు 18

సోంపేట నియోజకవర్గంలో గల రాంపురంలో ఇటీవల రెండవతేదీన బహిరంగసభ జరిగింది నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి శ్రీ బుజ్జి తులసీదాసును బలపరుస్తూ జిల్లా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ పంచాది కృష్ణమూర్తి గారు ఉపన్యసించారు అనంతరం రాంపురం పంచాయతీ అధ్యక్షులు శ్రీనల్ల పీతాంబరం, డాక్టరు నారాయణగార్లు ఉపన్యసించారు సభానంతరం 'హరిపురం' యువజనులు బుర్రకథ చెప్పారు.

కమిటీ సమావేశం

సోంపేట నియోజకవర్గ కమ్యూనిస్టు కమిటీ సమావేశం ఇటీవల పాత్రపురంలో జరిగింది నియోజకవర్గ కమిటీ కన్వీనరు శ్రీ పంచాది కృష్ణమూర్తి గారు గత నిర్ణయాలను సమీక్షించారు. తరువాత జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీ మారప్ప గోవిందరాజులుగారు ప్రస్తుత పరిస్థితులు, ప్రచారపద్ధతులను గురించి వివరించారు ఈ నెల 25 నాటికి నియోజకవర్గంలో 11 ప్రాంతాలలో ప్రాంతీయ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు

డబ్బు సంచులకు బుద్ధి చెప్పండి
గిరిజనులకు శ్రీ ఆదభట్ల కైలాసం ఉద్బోధ

నాగూరు, డిసెంబరు 18

శ్రీకాకుళంజిల్లా నాగూరు నియోజకవర్గంలోని అమిటి, పెదఖర్జ, కల్ల, కేదారిపురం గ్రామాల్లో ఇటీవల బహిరంగసభలు జరిగాయి వీటిల్లో జిల్లా గిరిజన సంఘాధ్యక్షులు శ్రీ వి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీ ఆదిభట్ల కైలాసంగార్లు ప్రసంగించారు

శ్రీ కైలాసంగారు తమ ప్రసంగాల్లో ఇలా ఉపన్యసించారు

"కాంగ్రెసువాళ్ళు డబ్బుసంచులను నమ్మి మీ వోట్లను కొనాలని చూస్తున్నారు ఆ విధంగా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు తమ అధికారాన్ని ఇప్పుడు దుర్వినియోగం చేస్తూ, పేద ప్రజలను విచ్చలవిడిగా దోచుకొంటున్నారు వారి డబ్బు సంచులకు బుద్ధి చెప్పే రోజు నేడు వచ్చింది కనుక గిరిజన సంఘాలకు అన్ని విధాల చేయూతనిచ్చిన శ్రీ బిడ్డిక శ్రీరాములుగారిని గెలిపించవలసిందిగా కోరుతున్నాను"

శ్రీకాకుళం జిల్లా నాగూరు నియోజకవర్గ కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ బిడ్డిక శ్రీరాములుగారి విజయానికై యీ దిగువ గ్రామాల్లో ఎన్నికల కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి బొడ్డికలో 20 మందితోను, జమ్ములో 15 మందితోను, పెదదోడిజలో 12 మందితోను, జయపురంలో 12 మందితోను, గొర్లిలో 15 మందితోను, చెక్కాపురంలో 12 మందితోను కమిటీలు ఏర్పడ్డాయి ఇవన్నీ శ్రీ జామిగుంప స్వామిగారి నాయకత్వాన పనిచేస్తాయి

ఎన్నికల నిధి వసూళ్ళు

జిల్లా గిరిజన అధ్యక్షులు శ్రీ వి సత్యనారాయణగారి ఎన్నికల నిధి వసూళ్ళ పర్యటనలో యీ దిగువ గ్రామాల గిరిజనులు రూ 86/- లు కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల నిధి సమర్పించారు వారి పేర్లు యీ దిగువ నీయబడినవి

పెండెముకల్లు సాకా శేరన్నదొర రు 5, జడగ సుందరనారాయణ 10, గజపతి పెంటన్నదొర 8, యల్లప్పదొర రాములు 8, బిడ్డిక చినగుండు 10

పురిడిగ్రామం ఆరిక అడ్డయ్య రు 5 లు, మండంగి లక్కాయి 3, జన్ని అడ్డయి 2, నిమ్మక సుక్కు 2, నిమ్మక లక్ష్మయ్య 1, ఆరిక పెద అడ్డయి 5, నిమ్మక దేవరి అడ్డయి 5, బిడ్డిక తవుడు 1, నిమ్మక లక్కాయి 1, నిమ్మక సర్వయి 1, ఆరిక లక్కాయి 1, నిమ్మల ఎంకన్న 0-8-0, నిమ్మల కొండను 1, మండంగి భూదెవ్వ 3, నిమ్మక గంగన్న 1, నిమ్మక సన్నెన్న 1, ఆరిక బంగం 1, ఆరిక సొంబ్రు 4, ఆరిక సన్నెన్న 5, ఆరిక కొన్న 6, మరక లక్ష్మయ్య 1, బిడ్డిక బుడ్డన్న 5

అమలాపురంలో డా॥ అప్పారి రామకృష్ణ గారిచే ఈ నెల 17 వ తేదీన నూతనంగా వైద్యాలయం ప్రారంభించబడింది.

రావి నూతల ప్రాంతీయ కమ్యూనిస్టు సభ

జానకీపురం, డిసెంబరు 18

ఈ నెల 14 వ తేదీన జానకీపురం గ్రామంలో మధిర నియోజక వర్గంలోని రావి నూతల ప్రాంతీయ కమ్యూనిస్టు పార్టీ ముఖ్యుల సమావేశం శ్రీ కొల్లూరి భద్రయ్య గారి అధ్యక్షతను జరిగింది సమావేశానికి వివిధ గ్రామాలనుండి పార్టీ ముఖ్యులు 40 మంది హాజరైనారు

జిల్లా కమ్యూనిస్టు కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీ బోడేపూడి వెంకటేశ్వరరావు గారు ఖమ్మం జిల్లాలో వున్న రాజకీయపరిస్థితి గురించి వివరించారు

జిల్లా కమ్యూనిస్టు సభ్యులు శ్రీ తమ్మరపు గోవిందుగారు మధిర నియోజకవర్గంరావినూతల ప్రాంతంలో ఎన్నికల కార్యక్రమాన్ని గురించి వివరించారు

జిల్లా సమితి సభ్యులు శ్రీ రావెళ్ళ జానకిరామయ్య గారు ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెసు బలహీన పరిస్థితిని వివరించారు

సమావేశానికి వచ్చిన వారిలో 20 మంది పార్టీముఖ్యులు రు 998-0-0లు వాగ్దానం చేశారు విరాళాలు చేసిన వారి పేర్లు శ్రీయుతులు చుండూరు నరసింహారావు రు 116, రావెళ్ళ జానకిరామయ్య, శ్రీ బోళ్ళ లక్ష్మయ్య 116, శ్రీ బోనేపల్లి బిచ్చాలు 116, వెన్నూతల కృష్ణమూర్తి 58, ఆళ్ళ జానకిరామయ్య 58, జొన్నలగడ్డ రామయ్య 58, కొల్లూరి భద్రయ్య 30, షేకు మీరా 25, ఆర్ నాగేశ్వరరావు 28, ఆళ్ళ చిన్నపుల్లయ్య 25, ప్రకాశరావు 25, శేషయ్య 25, బి వెంకటేశ్వరరావు 25, జంగా నరసింహారావు 25, కొల్లూరి సత్యం 25, కె మోహన్ రావు 25, యనమద్ది చినలక్ష్మీనరసయ్య 15, యనమద్ది చినరాములు 15, రాటకొండ రామకోటయ్య 15, ఒక నలుగురు సానుభూతిపరులు 60 పార్టీ ముఖ్యులు దిగువ విధంగా గ్రామాలలో వసూలు చేయుటకు కోటాలు తీసుకున్నారు :

గోవిందాపురం రు 400, ముష్టికుంట 300, తూనబోట్ల 200, అప్పకొత్త 200, గొల్లవాడ్ 200, రావినూతల 200, రామన్నపేట, 200, చొప్పకట్లపాలెం 100, చిరునోముల 100, పెద్దబీరవల్లి100, వల్లాపురం100, మోటమర్రి 100, రామాపురం 100, చిన్నబీరవల్లి 50, సీతానగరం 80, గ్రామాలు వారీగా తీసుకున్న మొత్తం కోటా 2880 లు

86 మందితో రావినూతల ప్రాంతీయ ఎన్నికల కమిటీని ఎన్నుకొన్నారు

ఎన్నికల కమిటీకి శ్రీ తమ్మరపు గోవిందుగార్ని కన్వీనరుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు

పర్కాలలో రు 867 లవాగ్దానం

పర్కాల, డిసెంబరు 19

వరంగల్ జిల్లా పర్కాల నియోజకవర్గంలోని గోపాలపురంలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల నిధికి రు 867 లకు వసూళ్లు వచ్చాయి

దాతల పేర్లు

శ్రీయుతులు జి రామన్న (గ్రామ సర్పంచ్) రు 50, ఎం డి యాకూబ్ 50, కె లక్ష్మయ్య గ్రామపంచాయతీ సభ్యులు 25, అయిత సాంబయ్య 20, బుజ్జూరి వైకుంఠం 20, పాత వీరయ్య 15, అనుగం వీరయ్య 15, దూడపాక రాజయ్య (గ్రామపంచాయతీ సభ్యులు) 15, దూదపాక సమ్మయ్య (గ్రామ పంచాయతీసభ్యులు) 10, ఎ సీతారాం నాయక్ 10, పాత సాంబయ్య 10, కాంచం చంద్రమౌళి 10, మాల వీరయ్య 10, కన్నెగపు అంకూసు 10, అకినపెల్లి శేఖరయ్య 8, మహమ్మద్ ఖాశిం 6, మహమ్మద్ జాఫర్ 6, మహమ్మద్ హిమాం 5, దొగ్గెల నరసయ్య 5, దుప్పటి చినకనకయ్య 5, సాదుబెల్లి అంకూసు 5, దూదపాక వెంకటరాజు 5, మాట్ల ఆకూసు 5, జె ఎల్లయ్య హాజిజర్ (పంచాయతీ బోర్డు సభ్యులు) 5, మాట్ల దుర్గయ్య 4, అంబాల సమ్మయ్య 4, ఏకు పెద బలయ్య 4, ఆకెపెల్లి అంకూసు 4, దూదపాక పెదంకూసు 3, దుప్పటి పెద కనకయ్య 2, మంద వీరయ్య 2, మంద రామయ్య 2, మంద పోశయ్య 2 ఏకు కొండయ్య 2, ఏకు బలయ్య 2, ఏకు నర్సయ్య 2, దూదపాక నోదెలు 2, సాదుబొల్లి బుచ్చయ్య 2, సాదుబొల్లి సమ్మయ్య 2, సాదుబొల్లి బోద్యాలు 1, దూదపాక పెద్దయ్య 1, మొత్తం రు 867 లు

గోళ్ళపాడులో కాంగ్రెస్ దౌర్జన్యం

రాత్రిపూట కమ్యూనిస్టు కార్యకర్తల ఇళ్లపై దాడి

ఖమ్మం, డిసెంబరు 16

ఖమ్మం తాలూకా గోళ్ళపాడు మండల కాంగ్రెసు ప్రెసిడెంటు బత్తుల వనమాలి, గ్రామ పంచాయతీ ప్రెసిడెంటు మందడి గోపాలరెడ్డి, వైస్ ప్రెసిడెంటు వద్ది రాంరెడ్డిగార్ల నాయకత్వాన 16 మంది గూండాలు 11 వ తేదీ రాత్రి కర్రలు, బరిసెలు తీసుకొని కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు శ్రీ మిడకంటి నారాయణరెడ్డి, సింగిరెడ్డి సత్యనారాయణరెడ్డిగార్ల యిండ్లపై దాడి చేశారు తలుపులు పగులగొట్టి వారు కమ్యూనిస్టుపార్టీకి రాజీనామా ఇవ్వాలనీ, పార్టీ జండాలను పీకివేయాలనీ, లేకపోతే చంపివేస్తామనీ, యిండ్లు పీకివేస్తామనీ బెదరించారు ఇండ్లలో వున్న వారంతా కేకలు వేసేసరికి వెళ్ళిపోయారు

లోగడ యీ గ్రామంలో కమ్యూనిస్టుపార్టీకి అంతగా బలంలేదు కాని కాంగ్రెసు నాయకులుగా చలామణి అవుతూ ప్రజలపైన దౌర్జన్యాలు, దాడులు చేస్తూన్న యీ దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా గ్రామంలో అనేకమంది యువకులు కమ్యూనిస్టుపార్టీవైపు వచ్చి పార్టీ శాఖను స్థాపించుకొన్నారు ఈ ఉక్రోషం ఫలితమే ఈదాడి

మండల కాంగ్రెసు అధ్యక్షుడు బత్తుల వనమాలిపైన లోగడ అనేక కేసులు పోలీసులవద్ద ఉన్నవి వీరి దౌర్జన్యాలను గురించి పోలీసులకు దరఖాస్తులు యిచ్చుకున్నారు (వి వి)

వెంట్రప్రగడలో చెడుగుడు, నాటికల పోటీలు
జనవరి 2 వ వారంలో

వెంట్రప్రగడ, డిసెంబరు 18

కృష్ణాజిల్లా వెంట్రప్రగడ గ్రామంలో పసుపు అనుపత్రి స్థాపిత సహాయార్థం జనవరి రెండవ వారంలో చెడుగుడు, నాటక, నాటికల పోటీలను స్థానిక విద్యార్థి యూనియన్ నిర్వహించ నున్నది

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు చెందిన టీములు ఈ పోటీల్లో పాల్గొన వచ్చును డిసెంబరు 30 వ తేదీ ఈ పోటీ జట్టుల పేర్లు తీసుకొనడానికి ఆఖరుతేదీ వివరాలకు దిగువ అడ్రసుకు వ్రాసి తెలుసుకొనవచ్చును

కోసరాజు రామారావు, వెంట్రప్రగడ పోస్టు, వయా ఇందుపల్లి, గుడివాడ తాలూకా, కృష్ణాజిల్లా

కమ్యూనిస్టుపార్టీకి కష్టజీవుల శ్రమదానం

పండితవిల్లూరు, డిసెంబరు 16

నర్సాపురం తాలూకా పండితవిల్లూరు గ్రామ శివారు ఆనందరావుపేట వ్యవసాయ కార్మికులు వరికోతకోసి రు 10 లు, స్థానిక బంటుసంఘంవారు రు 10 లు గ్రామ కమ్యూనిస్టుపార్టీకి విరాళంగా యిచ్చారు

* * *

అవనిగడ్డతాలూకా కృష్ణాపురంలో 8 వ తేదీన 4 ఎకరములు కట్టిపేరకట్టి రు 25/-లు కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల నిధికి యిచ్చారు

* * *

నర్సాపురం తాలూకా కొమ్ముచిక్కాల గ్రామంలో 100 మంది 8 ఎకరముల వరికోను గొట్టగా వచ్చిన నూరు రూపాయలు కమ్యూనిస్టుపార్టీకి విరాళంగా యిచ్చినారు

* * *

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా వుయ్యూరు నియోజక వర్గంలోని అమీనాపురం గ్రామంలోని కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, సానుభూతిపరులు వరి కోతకోసి వచ్చిన రు 20 లు కమ్యూనిస్టుపార్టీ నిధికి సమర్పించారు

* * *

అదే నియోజకవర్గంలోని హనుమంతపురం గ్రామంలోని పార్టీ సభ్యులు, సానుభూతిపరులు వరికోతకోసి వచ్చిన రు 41/-లు కమ్యూనిస్టుపార్టీ నిధికి సమర్పించారు

కైకలూరు జోన్ లోని 15 హైస్కూళ్ల విద్యార్థులకు వివిధ ఆటలలో పోటీలు మోటూరు హైస్కూలులో ఈ నెల 7, 8, 9, 10 లలో జరిగాయి చివరరోజున జరిగిన సభలో శ్రీ వాకల వెంకట శేషయ్య విజేతలకు బహుమతులను పంచిపెట్టారు

ఏలూరులో కోరాడ సన్మానం ఏర్పాట్లు

ఏలూరు, డిసెంబరు 14

నాట్యాచార్య శ్రీ కోరాడ నరసింహారావుగారు తమ రెండవ విదేశీ పర్యటనానంతరం డిసెంబరు 24 న ఏలూరుకు చేరుకోనున్న వారికి అఖండ స్వాగతమొసగి సన్మానించుటకు ఆహ్వాన సంఘంవారు నిశ్చయించారు

ఆహ్వాన సంఘానికి శ్రీ జవ్వాది లక్ష్మయ్యనాయుడు ఎమ్ ఎల్ ఏ, గారు అధ్యక్షులుగా వున్నారు.

నర్సాపురంలో కాంగ్రెస్ ప్రచారానికి సమితి జీపు

నర్సాపురం, డిసెంబరు 18

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ పరకాల శేషావతారంను నిర్ణయించటంతోనే, నర్సాపురం పంచాయతీసమితి జీపులో సమితి అధ్యక్షులు శ్రీ చేగొండి హరరామజోగయ్య, కాంగ్రెసు అభ్యర్థి, మండల కాంగ్రెసు నాయకులు ఎన్నికల ప్రచారము ప్రారంభించారు మొన్నటి రోజున సమితిజీపులో యేనుగువానిలంక, లంక యాలమంచిలి, పేడిపాడు, శేరేపిమిల్లి గ్రామాలు తిరిగారు

ఈ ప్రచార కార్యక్రమంలో కొన్నిచోట్ల ఉపాధ్యాయులనుకూడా సమితి అధ్యక్షులు పిలిపించి కాంగ్రెసు అభ్యర్థికి పరిచయంచేస్తూ కాంగ్రెసు విజయానికి కృషి చేయాలని చెబుతున్నారు. కాంగ్రెసు అభ్యర్థిని గెలిపిస్తే మీ గ్రామాల్లో రోడ్లు, మంచినీటి వగైరా పనులు సమితిద్వారా జరుగుతాయని, కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపిస్తే పనులేమీ జరగవనీ ప్రచారం చేస్తున్నారు. ఇదేవిధంగా సమితి జీపును రెండురోజులుగా మిగతా గ్రామాల్లో ప్రచారానికి ఉపయోగించారు

ఆముదాలవలస సమితి టీచర్ల యిక్కట్లు

బెలమాం, డిసెంబరు 17

శ్రీకాకుళంజిల్లా ఆముదాలవలస పంచాయతీ సమితిలో టీచర్లకు 1958 నవంబరునుండి రావలసిన ఇంక్రిమెంట్లు యివ్వకపోగా, యిప్పటికి 4 నెలల నుండి జీతాలు రాలేదు ఈ పరిస్థితుల వల్ల ఉపాధ్యాయులు నానాదురవస్థల పాలవుతున్నారు చేసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక, పనిపాపలకు పాలైనా కొనిపెట్టలేక నానాయిక్కట్లకు గురిఅవుతున్నారు వారు మనః ప్రశాంతత లోపించి బోధనాపటిమను కోల్పోతున్నారు సమితి ఆఫీసుకు ఉపాధ్యాయులు జీతాల గురించి వెళ్ళితే, గుమాస్తాలు కసిరేస్తున్నారు బిడీవోను కలుసుకోగా, 4, 5 రోజుల్లో యిస్తామన్నారు.

శ్రీ ప్రకంగి నాగేశ్వరరావుగారు అధ్యక్షులుగా బాదరు పట్టణ వెనుక బడిన తరగతుల సంఘమునకు నూతన కార్యవర్గం ఎన్నుకోబడింది

సభలు - సమావేశాలు

విశాఖజిల్లా యువజనసంఘ కమిటీ సమావేశం డిసెంబరు 24 వ మధ్యాహ్నం 11 గంటలకు విశాఖపట్నం శ్రీ గాదెకొండ విశ్వనాథశాస్త్రిగారి ఇంట్లో జరుగుతుంది

* * *

ఆచంట నియోజకవర్గ కమ్యూనిస్టు కమిటీ సభ్యుల - ఆహ్వానితుల సమావేశం డిసెంబరు 25 న ఉదయం 11 గంటలకు ఆచంటలో జరుగుతుంది సమావేశానికి శ్రీ చెక్కలపూడి రామారావుగారు హాజరవుతారు

* *

నెల్లూరుజిల్లా సైదాపురం గ్రామంలో 24-12-61 తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఆంధ్ర ప్రదేశ్ హైస్కూల్ టీచర్స్ యూనియన్ కార్యవర్గసమావేశం జరుగును

* * *

నెల్లూరు జిల్లా, కోవూరు నియోజకవర్గ కమ్యూనిస్టు కమిటీ కార్యవర్గ సమావేశం ఈ నెల 24 వ తేదీ ఉదయం 8 గంటలకు కోవూరు పార్టీ ఆఫీసులో జరుగుతుంది

* * *

గుంటూరుజిల్లా పల్నాడు తాలూకా రెండు బ్రాంచీల కమ్యూనిస్టు సభ్యుల సంయుక్త సమావేశం డిసెంబరు 25 సోమవారం ఉదయం 11గంటలనుండి కారంపూడిలో జరుగును కామ్రేడ్ కొల్లా వెంకయ్యగారు హాజరవుతా

చమురు ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధన

భారతప్రభుత్వ ఆకాంక్షను వెల్లడిస్తూ అంకాలేశ్వరలో మంత్రిమాళవీయా ప్రసంగం

అంకాలేశ్వర్, డిసెంబరు 19

చమురు ఉత్పత్తిలో భారతదేశం స్వయంసమృద్ధిని సాధించదలచిందని, చమురు పరిశ్రమను పూర్తిగా పబ్లిక్ రంగంలోనే అభివృద్ధి చేయదలచామని నేడిక్కడ గనులు, చమురుశాఖా మంత్రి శ్రీ కె డి మాళవియా అన్నారు

అంకాలేశ్వరలో సోవియట్ అధ్యక్షుని గౌరవార్థం నూనె, ఖనిజ వాయువు కమిషన్ వారు ఏర్పాటుచేసిన సన్మాన సభలో ప్రసంగిస్తూ శ్రీ మాళవియా పై విధంగా చెప్పారు

చమురు అత్యంత ప్రధానమైందనీ, ఈ ఆధునిక ప్రపంచంలో చమురు పరిశ్రమను పూర్తిగా అభివృద్ధి చేసుకోకుండా ఏ ఒక్కదేశం సౌభాగ్యవంతం కాజాలదనీ శ్రీ మాళవియా అన్నారు

చమురుకు ఇంతటి ప్రాధాన్యం వుండబట్టే ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ నాయకత్వాన భారత ప్రభుత్వం ప్రఖ్యాతమైన చమురువిధానాన్ని రూపొందించి అమలు జరుపుతోంది అప్పుడే ఈ విధానం సత్ఫలితాల నిస్తున్నది

సోవియట్ యూనియన్ యిచ్చిన సాంకేతిక, తదితర సహాయం లేకపోయి వుంటే పబ్లిక్ రంగంలో భారతదేశ చమురుపరిశ్రమ ఇంతగా అభివృద్ధి చెంది వుండేదే కాదని శ్రీ మాళవియా అన్నారు

భారతీయ నూనె గనుల్లో పనిచేస్తున్న రష్యన్ సాంకేతికనిపుణులు మన దేశంలో అయిదు వేలమంది చమురుసాంకేతిక నిపుణులను తయారుచేయడానికి సహాయపడ్డారని కూడా ఆయన చెప్పారు మూడు సంవత్సరాల క్రిందట మన దేశం మొత్తంమీద ఇద్దరో ముగ్గురో నూనె సాంకేతిక నిపుణులు వుండేవారన్నారు.

అంకాలేశ్వర్ నూనె గనుల అభివృద్ధిని గురించి శ్రీ మాళవియా ప్రస్తావించి యిలా అన్నారు

మొట్టమొదట నూనెబావి 1960 ప్రారంభంలో త్రవ్వబడింది ఆ సంవత్సరం మే 14 వ తేదీన చమురు లభించింది దానిపై త్రవ్వక కార్యక్రమం త్వరితగతిని సాగించబడింది ఇప్పటికి 26 బావులు త్రవ్వబడ్డాయి అంకాలేశ్వర్‌లో జరుగుతున్న పని చాల ప్రోత్సాహకరంగా వుంది త్వరలోనే అక్కడ పూర్తి ఉత్పత్తి కార్యక్రమం ప్రారంభమవుతుంది

వచ్చే ఆరుమాసాలలోగల చమురు ఉత్పత్తికి సంబంధించిన అన్ని దశలూ పూర్తికాగలవంటూ మంత్రి మాళవియా సోవియట్ యిచ్చిన అత్యంత విలువైన సహాయానికి కృతజ్ఞతను వెల్లడించారు చమురు ఉత్పత్తిలో చేస్తున్న సహాయం ఉభయదేశాల ప్రజలమధ్య స్నేహసంబంధాలు మరింత గట్టిపడటానికి సహాయపడగలదన్నారు.

తనకు చేసిన సన్మానానికి శ్రీ బ్రెజ్నేవ్ బదులు చెపుతూ చమురు పరిశ్రమను అభివృద్ధి చేయడంలో భారతప్రజలు, ముఖ్యంగా ప్రధాన మంత్రి, చమురుశాఖా మంత్రి చేస్తున్న కృషిని అభినందించుతూ, యింకా అభివృద్ధిని సాధించాలని తన కాంక్షను వెలిబుచ్చారు

గోవాలో వలస పరిపాలనను కుదముట్టించినందుకు కూడా భారతదేశాన్ని సోవియట్ అధ్యక్షుడు అభినందించారు

అంతకుముందు శ్రీ బ్రెజ్నేవ్ సతీసమేతంగా అంకాలేశ్వరలో నూనె గనుల ప్రాంతాన్ని పరిశీలించి, అన్ని విషయాలను అడిగి తెలుసుకొన్నారు

అంక్లేశ్వర్‌కు బ్రెజ్నేవ్ రాక

శ్రీ మాలవీయ, డా॥ జీవరాజ్ మెహతాల స్వాగతం

అంక్లేశ్వర్, డిసెంబరు 19

సోవియట్ అధ్యక్షుడు బ్రెజ్నేవ్, ఆయన పరివారం స్పెషల్ ట్రెయిన్‌లో బొంబాయినుంచి ఇక్కడకు నేటి ఉదయం వచ్చారు స్టేషన్లో వారికి కేంద్ర నూనెగనులశాఖామంత్రి శ్రీ మాలవీయ, గుజరాత్ ముఖ్యమంత్రి డా॥ జీవరాజ్ మెహతా తదితరులు స్వాగతంచెప్పారు

చక్కగా అలంకరింపబడ్డ రైలు స్టేషన్ వద్దకు అనేకమంది ప్రజలు, అంక్లేశ్వర్ నూనె గనులలో పనిచేస్తున్న సోవియట్ సాంకేతికజ్ఞులు వారి కుటుంబాలతోను వచ్చి సోవియట్ అధ్యక్షునికి స్వాగతం ఇచ్చారు

సోవియట్ అధ్యక్షునికి అంక్లేశ్వర్ మున్సిపాలిటీ వారు పౌర సన్మానం జరిపారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీ ఇనాందార్ బ్రెజ్నేవ్‌కు ఒక వెండి దుప్పటిని బహూకరించారు తరువాత అంక్లేశ్వర్ నూనెగనులకు బ్రెజ్నేవ్ సపరివారంగా వెళ్లారు

బ్రెజ్నేవ్ రాకను పురస్కరించుకొని అంక్లేశ్వర్ పట్టణాన్ని స్వాగత తోరణాలతో చక్కగా అలంకరించారు

బ్రెజ్నేవ్ వెళ్ళిన మార్గాలలో ప్రజలు గుంపులు గుంపులుగా చేరారు నేడు బ్రెజ్నేవ్ 55 వ జన్మదినోత్సవం ఈ సందర్భంలో ఆయనకు రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, ప్రధాని నెహ్రూల నుంచి శుభాకాంక్ష సందేశాలు అందాయి

సోవియట్ శాంతివాంఛ

ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో పురోభివృద్ధి సాధించేందుకు తాను చేసుకొన్న ప్రణాళికను నెరవేర్చడానికి శాంతి పరిరక్షణ ఎంతో ముఖ్యమైనదనీ, అంచేతనే రష్యా యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నదనీ సోవియట్ అధ్యక్షుడు బ్రెజ్నేవ్ నేడిక్కడ అన్నారు

అంక్లేశ్వర్ మున్సిపాలిటీ చేసిన పౌర సన్మానానికి ఆయన సమాధానం ఇస్తూ రష్యా 20 ఏళ్ళ ప్రణాళిక శతాబ్దాలుగా జనసామాన్యం కంటున్న కలలను సఫలీకృతం చేయగలదని అన్నారు

1962 లో నూనె ఉత్పత్తిని అదనంగా 1 కోటి 60 లక్షల టన్నులు పెంచాలని, తమ దేశం నిర్ణయించుకొన్నదనీ ఏడాదిలో మొత్తం ఉత్పత్తి 18 కోట్ల 50 లక్షల టన్నులు అవుతుందనీ ఆయన చెప్పారు నూనె పరిశ్రమ అభివృద్ధికి భారత ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్య మిస్తున్నదనీ, ప్రభుత్వరంగంలో నూనె పరిశ్రమ నిర్మాణానికి నిర్ణయాత్మకమైన చర్యలను తీసుకొన్నదనీ తనకు ఢిల్లీలో చెప్పినట్లు ఆయన తెలియజేశారు

అంతకుముందు అంక్లేశ్వర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రసంగిస్తూ వివిధ రంగాలలో భారతదేశానికి సోవియట్ యూనియన్ ఇస్తున్న గొప్ప సహాయానికి అంక్లేశ్వర్ ప్రజల కృతజ్ఞతను వెల్లడించారు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
గోల్డెన్ జూబ్లీ సందర్భమున
మా హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీరామా రైస్ మిల్ కంట్రాక్టర్సు కంపెనీ
విజయవాడ
మేనేజరు: అనుమోలు శేషగిరిరావు
Phone 405 Grams Excellent

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
గోల్డెన్ జూబ్లీ సందర్భమున
మా హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీ రామకృష్ణా రైస్‌మిల్
కందులవారి వీధి విజయవాడ-1 ఫోన్ 282

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
గోల్డెన్ జూబ్లీ సందర్భమున
మా హృదయపూర్వక శుభాకాంక్షలు
LION BRAND
గ్రామ్సు "ఫెర్టిలైజర్సు" ఫోన్: 1245
అన్ని పైరుల అధికోత్పత్తికి మా "సింహము" మార్కు
మిశ్రమ ఎరువులనే ఎల్లప్పుడూ వాడండి
ది పయనీర్ ఫర్టిలైజర్సు కంపెనీ
హెడ్డాఫీసు విజయవాడ బ్రాంచి వరంగల్

శ్రీ కేవల్ కిషన్, శ్రీ పి. లక్ష్మయ్యగార్ల ప్రథమ వర్ధంతి

మెదక్, డిసెంబరు 19

మెదక్‌జిల్లా వడ్డేరం రోడ్డుమీద వున్న పోలంపల్లి గ్రామంలో శ్రీయుతులు కేవల్ కిషన్, పి లక్ష్మయ్య గార్ల ప్రథమ వర్ధంత్యుత్సవం ఈ నెల 26 వ తేదీన జరుపుతారు

ఈస్థలం వద్దనే గత సంవత్సరం ఈ రోజున వీరిరువురూ ఒక మోటారు సైకిల్ ప్రమాదానికి గురై మరణించారు. శ్రీ కేవల్ కిషన్ జిల్లా కమ్యూనిస్టు నాయకుడు ఆయనతల్లిగారు ఇటీవలనే మెదక్ నగర మున్సిపాలిటీ వైస్‌ఛైర్మన్‌గా ఎన్నికైనారు

ఈ వర్ధంత్యుత్సవానికి కమ్యూనిస్టు పార్టీ పెద్దగా సన్నాహాలు చేస్తున్నది ఆనాడు శ్రీ కేవల్‌కిషన్ విగ్రహాన్ని మెదక్ నగరంలో ఒక కేంద్ర ప్రదేశంలో ఆవిష్కరిస్తారు

గోవా విముక్తికి బ్రెజ్నేవ్ ఆనందం

బొంబాయి, డిసెంబరు 19

పోర్చుగీస్ వలసాధిపత్యాన్నుండి గోవా, డామన్, డయ్యూలు విముక్తి కావడం భారతదేశ చరిత్రలో ఒక గొప్ప ఘటనని సోవియట్ అధ్యక్షుడు బ్రెజ్నేవ్ నేడిక్కడ వర్ణించారు

నేటి రాత్రి తన గౌరవార్థం రాజభవనంలో మహారాష్ట్ర గవర్నరు శ్రీ శ్రీప్రకాశ్ ఏర్పాటుచేసిన విందు సందర్భంలో శ్రీ బ్రెజ్నేవ్ మాట్లాడుతూ యింకా ఇలా అన్నారు

మీ మాతృభూమిలోని కొన్ని భాగాలు వలసవిధాన అవశేషాల నుండి విముక్తి కాబడి బొంబాయి ప్రజలు తదితర భారత ప్రజలతో కలసి ఆనందోత్సవాలతో వున్న ఈనాడు యిక్కడ నేను ఉండగల్గినందుకు నాకు చాల సంతోషకరంగా వుంది

ఆ తరువాత ఆయన భారతదేశంలో బొంబాయినగర ప్రాధాన్యతనుగురించి ప్రస్తావించారు

గోవా విముక్తి తనజన్మదినానజరిగినందుకు బ్రెజ్నేవ్ సంతసం

బరోడా, డిసెంబరు 19

తన జన్మదినాన గోవా, డామన్, డయ్యూలు పోర్చుగీస్ వలసపరిపాలననుండి విముక్తి అయినందుకు తానెంతో సంతోషపడుతున్నానని సోవియట్ అధ్యక్షుడు శ్రీ బ్రెజ్నేవ్ నేడిక్కడన్నారు

ఇక్కడ నేడు తన 55 వ జన్మదినోత్సవాన్ని జరుపుకొన్న సోవియట్ అధ్యక్షుడు బొంబాయికి విమానం ఎక్కబోతుండగా పోర్చుగీస్ వారు గోవాలో లొంగిపోయిన వార్తను స్థానిక పత్రికలవారు తెలియజేయగా ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు

ద్రావిడ మున్నేట్ర కళగం మద్రాస్ శాసన సభలో 72 సీట్లకు పోటీచేస్తుందని తెలుస్తుంది

గోవ విముక్తికి మాస్కో ఆనందం

(విశాలాంధ్ర విలేకరి)

న్యూఢిల్లీ, డిసెంబరు 19

మాస్కోనుండి "న్యూఏజ్" విలేఖరి శ్రీ మసూద్ అలీ ఖాన్ నేడిక్కడికి కేబుల్ పంపారు అందులో ఆయన గోవావిముక్తిచేయడానికి భారతప్రజలు తీసుకున్న చర్యలను మాస్కో ప్రజలు ఎంతో ఉత్సాహంతో బలపరుస్తున్నారని, ఆనందాన్ని ప్రకటించారని వ్రాశారు

శ్రీ అలీఖాన్ ఇంకా ఇలా వ్రాస్తున్నారు

"మాస్కో మనపట్లనే వుంది శతాబ్దాలుగా పోర్చుగీసు నిర్బంధంలో పడివున్న భారత భూభాగంలోని గోవా, డయ్యూ, డామన్ ప్రజల విముక్తికి భారతప్రభుత్వం సహేతుకమైన సైనికచర్య తీసుకున్నదన్న వార్త నేటి ఉదయం ఇక్కడికి చేరింది ఈ వార్త వినగానే మాస్కో ప్రజలు భారత చర్యను హృదయపూర్వకంగా బలపర్చసాగారు

ఇది భారతదేశం పోర్చుగల్‌తో జరుపుతున్న ధర్మయుద్ధమేగాని అన్యథాగాదని మాస్కో ప్రజలుభావిస్తున్నారు చాల సంవత్సరాలు భారత ప్రజలు పట్టిన ఓర్పునన్న గిల్లక తప్పలేదని, చివరకు సైనికచర్యకు పూనుకోక తప్పలేదని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు గోవాపై ఆదివారంనాటి భారతిచర్య వార్త అందగానే సోమవారం ఉదయం నేను సోవియట్ ప్రభుత్వ విదేశాంగశాఖ ప్రతినిధిని కలుసుకున్నాను అప్పుడాయన నాతో సోవియట్ యూనియన్, వలస విధానానికి వ్యతిరేకంగా పోరాటం నడిపే ప్రజలందరిపట్ల నిలబడుతుందనీ, అలాగే గోవా విముక్తికై భారత ప్రజలు జరిపే పోరాటాన్ని సోవియట్ బలపరుస్తుందనీ అన్నారు

తమ స్వాతంత్ర్య సిద్ధికోసం గోవా ప్రజలు వీరోచిత పోరాటం నడుపుతున్నారన్న సంగతి యిక్కడ చాలాకాలంగా ప్రజలకు తెలుసు గోవాలో పోర్చుగీసు వారెన్ని పైశాచిక కృత్యాలకు ఒడిగట్టినప్పటికీ అక్కడ బలమైన జాతీయ విముక్తిఉద్యమం ఉందన్న విషయం కూడా మాస్కో ప్రజలకు తెలుసునని ఆ ప్రతినిధి అన్నారు "

నేడు బ్రిటిష్, అమెరికన్ పత్రికలు భారత ప్రధానమంత్రి నెహ్రూను "నిరంకుశుడు"గా "కపట నాటక సూత్రధారిగా" ఆరోపించాయి భారత సైనిక చర్య తమకు దిగ్భ్రాంతి కల్గించిందని అవి వ్రాశాయి

భారత ప్రభుత్వం పోర్చుగల్‌కు పంపిన తాజా లేఖను నేడు "ప్రావ్దా" పత్రిక ప్రచురించింది తమ భూభాగంపై వలసాధికారమేదీ మిగులకుండా చేసేందుకై భారతదేశం సంపూర్ణ స్వాతంత్ర్య సిద్ధికై దృఢ నిశ్చయమై వుందని "ప్రావ్దా" ప్రకటించింది "ప్రావ్దా" గోవా వార్తను "వలస విధానం" "భారతదేశంనుండి వైదొలగిపోవాలి" అన్న పెద్ద శీర్షికలతో ప్రచురించింది గోవా విముక్తిపోరాటం ఉధృతం కాజొచ్చినప్పటినుండి ఒక వారంరోజులుగా మాస్కో రేడియో గోవా సమస్యపై సుదీర్ఘ వ్యాఖ్యలు ప్రచారం చేస్తోంది ఈ వ్యాఖ్యల్లో పోర్చుగీస్ విచ్ఛిన్నకారపాత్రను ఖండించింది పోర్చుగల్‌కు ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి సభ్యదేశాలిస్తున్న ప్రోత్సాహాన్ని ఖండించింది పోర్చుగల్ చర్యల వెనుక అమెరికా, బ్రిటన్‌ల కపట నాటకాలను "మాస్కో" రేడియో బహిర్గతం చేసింది గోవాపై భారత చర్యలకు సంబంధించి సోవియట్ ప్రభుత్వం త్వరలోనే ఒక అధికార ప్రకటన చేయనున్నది

భారత చర్యకు యుగోస్లావియా మద్దతు

బెల్‌గ్రేడ్, డిసెంబరు 19

సహకార ధోరణి, సౌహార్దపూర్వక దృక్పథం పోర్చుగీస్‌కు పూజ్యమైనందువల్లనే గోవా సమస్యను శాంతియుత ఏర్పాటుల ద్వారా పరిష్కరించడం అసాధ్యమైందని యుగోస్లావియా అధికార ప్రతినిధి ఒకరు నేటి రాత్రి భారత సైనిక చర్యను బలపరుస్తూ ఒక ప్రకటన చేశారు భారత ప్రభుత్వానికి ఇంతకన్నా మరో మార్గం లేదనికూడా ఆయన చెప్పారు భారత చర్య వలస విధాన నిర్మూలన విషయమై ఐరాస చేసిన ప్రకటనకు అనుగుణంగా వుందన్నారు

మొజాంబిక్ ప్రజలకు భారతదేశ అండకావాలి'

దార్జిలింగ్ డిసెంబరు 19

భారత దేశంలో పోర్చుగీస్ వలస పాలనకు దిగ్విజయంగా స్వస్తి చెప్ప కల్గినందుకు భారత గోవా ప్రజలను అభినందిస్తూ మొజాంబిక్ నుండి పోర్చుగీస్ ఆఫ్రికన్ జాతీయవాదసంస్థ ప్రధాని నెహ్రూకొక కేబుల్ పంపింది

భారత చర్యను మొజాంబిక్ స్వాతంత్ర్య యోధులు బలపరుస్తున్నారని అందులో వుంది మొజాంబిక్ నుండి పోర్చుగీస్ దురాక్రమణదార్లను కరిమికొట్టేందుకు తాము భారతీయుల సహాయాన్ని కోరుతున్నామని వారు తెలిపారు

'బెంగాల్ గోవన్‌సమితి' అభినందన సందేశం

కలకత్తా, డిసెంబరు 19

గోవా, దయ్యూ, డామన్‌లు విముక్తి పొందినందుకూ, భారతదేశంలోని కడసారి వలసావశేషాన్ని కుదమట్టించినందుకూ అభినందిస్తూ బెంగాల్ గోవన్ సమితి ప్రధాని నెహ్రూకు నేడొక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం పంపింది

గోవా విముక్తిపట్ల పలువురి హర్షం

త్రిచూర్, డిసెంబరు 19

పార్లమెంటులో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ కె కె వారియర్ ప్రధాని నెహ్రూ, రక్షణమంత్రి కృష్ణమీనన్ గార్లకు గోవావిముక్తిని జయప్రదంగా నెరవేర్చినందుకు అభినందించుతూ ఒక టెలిగ్రామ్ పంపారు

వారియర్, కర్షకసంఘ ఆందోళన సందర్భంలో అరెస్టయి జైల్లోవున్నారు జైలు సూపరింటెండెంట్ అనుమతితో ఈ టెలిగ్రాం పంపారు

శ్రీయుతులు ఆచార్య జె బి కృపలానీ, జయప్రకాశ్ నారాయణ, డా॥ రామమనోహర్ లోహియా, యన్ జి రంగా, గోవా విముక్తిపట్ల హర్షం వెలిబుచ్చుతూ నేడు ప్రకటనలుచేశారు

భారత చర్యకు ప్రపంచ వ్యాపిత హర్షం

రాబట్, డిసెంబరు 19

గోవాలో భారతదేశ చర్య, మహోన్నత స్వాతంత్ర్య స్వేచ్ఛా భావాలతో ఉద్దీపితమైనదని శ్లాఘిస్తూ పోర్చుగీసు వలసల్లోని జాతీయ పార్టీల సమాఖ్య నేడిక్కడ నుండి ప్రధాన మంత్రి నెహ్రూకు ఒక లేఖ పంపింది

భారత చర్య పోర్చుగీస్ వలసాధిపత్యం క్రింద నున్న తదితర భూభాగాలన్నింటి సత్వర విముక్తికి దోహదం చేస్తుందని ఆ సమాఖ్య కార్యదర్శి మార్సెలినో డోస్‌శాంతోస్ చెప్పారు గోవా విముక్తి పోరాటానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ ప్రభుత్వం పోర్చుగల్‌ను బలపర్చినందుకు విచారం వెలిబుచ్చుతూ, అయూబ్‌ఖాన్‌కు ఆయన నొక లేఖ వ్రాశారు

పశ్చిమ ఇరియన్‌పై అమెరికాకు డా॥ సుకర్నో సందేశం

వాషింగ్టన్, డిసెంబరు 19

పశ్చిమ ఇరియన్ విషయంలో డచ్చివారి కవ్వింపు చర్యలు ఆగకపోతే హాలెండు ప్రభుత్వంతో తమకున్న వివాదంలో బలప్రయోగం చేయవలసివస్తుందని అమెరికా అధ్యక్షుడు కెన్నెడీకి ఇండొనీషియా అధ్యక్షుడు సుకర్నో నేడొకసందేశం పంపారు

పశ్చిమ ఇరియన్‌ను ఒక స్వతంత్ర రాజ్యంగా చేయాలని హాలండ్ పూనుకుంటూంటే ఇండొనీషియా చూస్తూ వూరుకోలేదని డా॥ సుకర్నో తెలిపారని ఇక్కడ అభిజ్ఞవర్గాల వారన్నారు

పశ్చిమ ఇరియన్ వివాదాన్ని శాంతియుతంగానే పరిష్కరించుకోవాలని హితవు చెప్పిన కెన్నెడీకి సమాధానంగానే డా సుకర్నో ఈ సందేశం పంపారు దీనిని నిన్ననే అమెరికా విదేశాంగమంత్రి డీన్‌రస్కుకందజేశారు

అయితే, యీ బలప్రయోగానికి ఎప్పుడు పూనుకుంటారో అధ్యక్షుడు సుకర్నో తేల్చి చెప్పలేదని ఇండొనీషియా అధికారులు అన్నారు ఇండొనీషియా అనేకసార్లు ఈ సమస్యను ఐరాసలో చర్చకు తెచ్చినప్పటికీ, యీ వివాదంలో ఆసక్తికలవారు మాత్రం అంటే అమెరికా అని వారి ఉద్దేశం- యీ వివాద పరిష్కారానికి ఏమీ చేయకుండా మిన్నకున్నారని యీ అధికారులు అన్నారు

హాలెండుకు, ఇండొనీషియాకు మధ్య యుద్ధం రగిలే ప్రమాదం హెచ్చుగా వున్నదని అమెరికా అధికారులు అంటున్నారు

అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి నేడు విలేకరులతో మాట్లాడుతూ ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకొనడమే తమ కోరిక అని అన్నారు ఇందులో మధ్యవర్తిగా వ్యవహరించమని అమెరికాను ఇండొనీషియా కోరిన సంగతి తనకు తెలియదన్నారు

హాలెండ్ రాజధాని హేగ్‌లో డచ్చి ప్రభుత్వ రక్షణశాఖ ప్రతినిధి ఒకరు విలేకరులతో మాట్లాడుతూ, పశ్చిమ ఇరియన్‌లో డచ్చివారు 5,000 మంది సైనికులను సమీకరించారనేది నిరాధారమన్నారు

కృష్ణమీనన్‌కు వ్యతిరేకంగా ఎన్నికల పోరాటానికి ప్రజాసోషలిస్టుపార్టీ కాశ్మీరులో విరాళాలను వసూలు చేస్తున్నది

సెంట్రల్ బ్యాంకు స్వర్ణోత్సవాలు

విజయవాడ, డిసెంబరు 20

సెంట్రల్ బ్యాంకి స్వర్ణోత్సవాలు విజయవాడలో నేడు విజయవాడ ఏజెంటు శ్రీ శ వెంకటేశ్వరన్ గారి ఆధ్వర్యాన జరుగుతున్నాయి

క్లుప్త చరిత్ర

సెంట్రల్ బ్యాంకు 1911 లో ప్రారంభమైంది స్వదేశీ ఉద్యమం బాగా ముమ్మరంగానున్న రోజుల్లో సొరాబ్జీపోచ్‌కనవాలా సెంట్రల్ బ్యాంకును ప్రారంభించారు

పూర్తిగా భారతీయులే ఈ బ్యాంకు మేనేజిమెంటులో వుండటం ఆయన లక్ష్యం

ఫిరోజ్‌షా మెహతా ఈ యత్నానికి బాగా తోడ్పడ్డారు

1911 డిసెంబరులో బ్యాంకు బొంబాయిలో రిజిస్టరైనప్పుడు 50 లక్షల మూలధనం వుంది అందులో 20 లక్షలు జారీచేయబడ్డవి 10లక్షలు చెల్లించబడ్డవి

మొదటి 12 నెలల్లో 88 లక్షల డిపాజిట్లు వచ్చాయి ఆ పిమ్మట ఇబ్బందులు కలిగాయి 1916 తర్వాత యుద్ధానంతరం పరిస్థితి మెరుగైంది

1923 లో సెంట్రల్ బ్యాంకు యూనియన్‌బ్యాంకు నిర్వహణను చేపట్టింది అదే సంవత్సరం టాటా పారిశ్రామిక బ్యాంకు సెంట్రల్ బ్యాంకులో కలిసింది

1936 లో సెంట్రల్ బ్యాంకు పైడ్‌అప్ కాపిటల్, రిజర్వులు మొత్తం 2 5 కోట్లు డిపాజిట్లు 37 కోట్లు

1937 సొరాబ్జీపోచ్‌కనవాలా చనిపోయారు ఇదొక తీరని నష్టం పిమ్మట ఫిరోజ్ సెత్నా మేనేజింగు డైరక్టరైనారు 1938 లో ఆయన చనిపోయారు పిమ్మట నాటినుండి నేటివరకు మోడీ మేనేజింగ్ డైరక్టరుగా వున్నారు

బ్యాంకు ప్రస్తుత పైడ్‌అప్ కాపిటల్ 3 15 కోట్లు రిజర్వు తదితర నిధులు 4 17 కోట్లు

1911 లో బ్యాంకులో 80 మంది ఉద్యోగు లుండేవారు ఈనాడు 12 వేలమంది ఉద్యోగు లున్నారు

ప్రస్తుత బోర్డు ఆఫ్ డైరక్టర్లు వీరు వాలోమీ మోడీ(ఛైర్మన్), సి హెచ్ భాభా (వైస్‌ఛైర్మన్), డి యం కాటావు, సి సి షాడియా, చిమన్ లాల్ పరేఖ్, జంషెడ్ జిజిభాయి, జయకృష్ణహరివల్లభదాస్, యస్ శ కాంభట్టా, యస్ ఎ పార్కివాలా, యస్ యమ్ బాన్జే సభ్యులుగానున్నారు. ప్రస్తుతం యస్ శ కరంజియా బ్యాంకు మేనేజరు

ప్రైవేటురంగంలో ఇది అన్నిటికంటె పెద్దబ్యాంకు

ఈ శుభసమయంలో ప్రజా సేవకై బ్యాంకు తిరిగి శపథం చేస్తున్నది

లావోస్ నాయకులకు 14 రాజ్యాల సభ విజ్ఞప్తి

జనీవా, డిసెంబరు 19

లావోస్ మూడు పక్షాలనాయకులు త్వరగా ఒక మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పరచి, జనవరి 8 వ తేదీన ఇక్కడ జరగబోయే అంతర్జాతీయ సంప్రదింపులలో పాల్గొనడానికి ఒక ఐక్య ప్రతినిధి వర్గాన్ని పంపమని 14 రాజ్యాల లావోస్ సభ నేడు ఒక విజ్ఞప్తిచేసింది

లావోస్‌లో జాతీయైక్యప్రభుత్వాన్ని స్థాపించడంలో ఆలస్యం జరుగుతున్నందున యీ ఐక్య విజ్ఞప్తి అవసరమైందని పశ్చిమ దేశాల ప్రతినిధులు చెప్పారు

లావోస్‌ను తటస్థరాజ్యంగా వుంచే సమస్యమీద యీ 14 రాజ్యాల మధ్య దాదాపు అన్ని విషయాలలోను ఏకీభావం కుదిరింది ఇప్పుడింకా మిగిలి వున్న కొద్ది సమస్యల పరిష్కారానికి లావోస్ ప్రతినిధివర్గం ఆమోదం కావలసివుంది

బ్రిటన్, సోవియట్‌దేశాలు విడిగా వేరొక విజ్ఞప్తిచేస్తూ, త్వరగా లావోస్‌లో మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పరచమని లావోస్ నాయకులను కోరాయి

సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజరుగా శ్రీ రతన్‌లాల్ పదవీస్వీకారం చేశారు.

చెరువు మీద అలిగి

అమెరికా కంపెనీ చర్య

న్యూయార్కు, డిసెంబరు 19

గోవా, డామన్, డయ్యూలపై భారతదేశం "దాడి" చేసినందున, తామిదివరలో భారతదేశంలో స్థాపించదలచిన గడియారాల ఫ్యాక్టరీని ఇకమీదట నిర్మించబోమని అమెరికా కంపెనీ ఒకటి నేడు ప్రకటించింది

యు ఎస్ టైం కార్పొరేషన్ అనే ఈ కంపెనీ అధ్యక్షుడు జె యం లెహమ్‌కుల్ ఈ విషయంపై తమ నిర్ణయాన్ని ఒరిస్సాప్రధాని పట్నాయక్‌కు తెలియపరచారు ఒరిస్సాలోనే ఈ కంపెనీ గడియారాల ఫ్యాక్టరీ పెట్టటం నిర్మింపదలచింది

నెదర్లెండ్స్ పాత పాట

పశ్చిమ ఇరియన్ సమస్యపై

వాషింగ్టన్, డిసెంబరు 19

పశ్చిమ ఇరియన్ సమస్యపై ఇండొనీషియాతో సంప్రతింపులను నెదర్లెండ్స్ ఎప్పుడూ కోరుతుందనీ, అందువల్ల ఈ విషయంపై ఇండొనీషియా యుద్ధ బెదిరింపు అంత ప్రమాదకరమైనది కాదనీ ఇక్కడ డచ్ రాయబారి వాన్ రోయెన్ నేడు చెప్పారు

పశ్చిమ ఇరియన్ ప్రజలకు స్వయం నిర్ణయాధికార సూత్రాన్ని గుర్తించడం ప్రాతిపదికగా సంప్రతింపులుప్రారంభం కావాలని నెదర్లెండ్స్ ప్రభుత్వం కోరుతోందన్నారు

కాంగ్రెసు ఎన్నికల కమిటీ సమావేశం సమాప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 19

ఒక నెల రోజులుగా యిక్కడ వివిధ రాష్ట్రాల కాంగ్రెసు అభ్యర్థుల జాబితాను పరిశీలించుతున్న కాంగ్రెసు కేంద్ర ఎన్నికల కమిటీ నేడు ఉత్తర ప్రదేశ్ అభ్యర్థులను కొంతవరకు నిర్ణయించి తన సమావేశాన్ని యింతటితో ముగించింది

ఉత్తర ప్రదేశ్‌లో యింకా నిర్ణయించవలసి మిగిలివున్న 180 అసెంబ్లీ స్థానాలకు, 30 లోక్ సభా స్థానాలకు అభ్యర్థుల నియామకానికి ఇందిరాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిగార్లతో కూడిన ఒక కమిటీని నియమించారు

మదరాసు రాష్ట్రానికి యింకా పెండింగ్‌లో వున్న సీట్ల విషయంలో తుది నిర్ణయం చేయడానికి శ్రీ సంజీవ రెడ్డికి అధికారం యిచ్చారు

శ్రీ సంజీవరెడ్డి రేపు తన స్వరాష్ట్రమైన ఆంధ్రకు బయలుదేరి వెడుతున్నారు

ఐరాస (న్యూయార్కు), డిసెంబరు 19

ఐరాస ప్రణాళిక ననుసరించి తన అధీనప్రాంతాల విషయమై భోగట్టా ఇవ్వవలసిందిగా పోర్చుగల్‌ను ఆదేశించినా, ఇంతవరకు అలాంటి భోగట్టాను ఇవ్వనందుకు ఐరాస ధర్మకర్తృత్వ సంఘం ఖండించింది ఐరాస జనరల్ అసెంబ్లీ ఇవాళ ఈఖండన తీర్మానాన్ని బలపరచింది

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
గోల్డెన్ జూబ్లీ సందర్భమున
మా హృదయపూర్వక అభినందనలు
శ్రీ లక్ష్మీనారాయణ రా & బాయిల్డ్
రైస్‌మిల్ కాంట్రాక్టర్సు కంపెనీ
గిరినగర్ — విజయవాడ-3
మేనేజరు: వల్లభనేని అచ్యుతరామయ్య

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
గోల్డెన్ జూబ్లీ సందర్భమున
మా హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీ విజయలక్ష్మి విలాస్ రైస్‌మిల్
కాంట్రాక్టర్సు కంపెనీ
సామారంగం చౌక్ విజయవాడ - 1
మేనేజర్సు: కంచెర్ల సుబ్బారావు బొమ్మారెడ్డి సీతారెడ్డి

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
గోల్డెన్ జూబ్లీ సందర్భమున
మా హృదయపూర్వక అభినందనలు
శ్రీ వేణుగోపాల రాధాకృష్ణ రైస్‌మిల్
కాంట్రాక్టర్సు కంపెనీ.
సామారంగంచౌక్ - విజయవాడ - 1
మేనేజరు అడ్సుమిల్లి సీతారామయ్య

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
గోల్డెన్ జూబ్లీ సందర్భమున
మా హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీ కనకదుర్గా రైస్‌మిల్ కాంట్రాక్టర్సు,
కంపెనీ, చలివేంద్రపాలెం.
మేనేజర్సు: బొమ్మారెడ్డి రామకోటిరెడ్డి, నందిపాటి సామిరెడ్డి

Our best Wishes
AND
Hearty Greetings
on the occasion of
THE GOLDEN JUBILEE
OF OUR BANK
THE CENTRAL BANK OF
INDIA SRAMIK UNION,
VIJAYAVADA GROUP, (Regd No 1901)

సంపాదకవర్గం: మోటూరు హనుమంతరావు (అధ్యక్షుడు), కాట్రగడ్డ రాజగోపాలరావు ఏటుకూరు బలరామమూర్తి, విశాలాంధ్ర విజ్ఞానసమితి తరపున ఎడిటర్ ప్రింటర్ అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర ఆర్టుప్రింటర్సు, విజయవాడ - 2